అక్టోబర్ 2005

4

సంపుటి : 1 సంచిక : 4

MARXISTU

మార్క్సిస్టు


సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో.....

వెల: రూ.5/-

మానవత్వం పరిమళించిన మహాశాస్త్రవేత్త

వై. రాధాకృష్ణ మూర్తి



ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ 20వ శతాబ్దపు మహా మేధావుల్లో ఒకరు. విజ్ఞాన శాస్త్రాన్ని ముఖ్యంగా భౌతికశాస్త్రాన్ని సంపన్నం చేసిన శాస్త్రజ్ఞుడు. నోబెల్ బహుమతి గ్రహీత. 2005 ఆయన 50వ వర్ధంతి సంవత్సరం. ఆయన ప్రఖ్యాతి గాంచిన తన 5 శాస్త్ర పత్రాలు ప్రకటించి వందేళ్లయ్యాయి. ఆయన పరిశోధనలు విజ్ఞాన శాస్త్రాన్ని ఒక మలుపు తిప్పాయి. సామాన్య మానవుడు ఈ విశ్వాన్ని సులువుగా అర్థం చేసుకునేందుకు దోహదం చేశాయి. అయితే అంత గొప్ప శాస్త్రవేత్త అయిన ఐన్‌స్టీన్ రాజకీయజీవితం, రాడికల్ అభిప్రాయాలు మాత్రం నాడుగాని, నేడుగాని అంతగా చర్చకు రాలేదు. నిజానికి ఐన్‌స్టీన్ శాస్త్ర పరిశోధనలు ఎంత స్ఫూర్తిదాయకమైనవో, ఆయన రాజకీయ, సామాజిక జీవితంకూడా అంతే స్ఫూర్తిదాయకమైంది.

ఐన్‌స్టీన్ 1879 మార్చి 14న జర్మనీలోని లౌకికభావాలు గల మధ్య తరగతి కుటుంబంలో జన్మించాడు. స్విట్జర్లాండ్‌లో పాలిటెక్నిక్ కళాశాల్లో చదివి పిహెచ్‌డి పూర్తి చేశాడు. అక్కడే ఆయన అభ్యుదయ రాజకీయ భావాలు అలవరచుకున్నాడు. చదువయ్యాక చాలా కాలం ఆయనకు ఉద్యోగం దొరకలేదు. 1902లో బెర్న్ పట్టణంలోని స్విస్ పేటెంట్ ఆఫీస్‌లో గుమస్తాగా చేరాడు. ఆశ్చర్యంగా అక్కడి నుండే ఆయన ప్రపంచ ప్రసిద్ధి పొందిన 5 శాస్త్రీయ పత్రాలు – సాపేక్ష సిద్ధాంతం, కాంతి విద్యుత్ ప్రభావం, క్వాంటం మెకానిక్స్, బ్రౌనియన్ మోషన్, ఇ = ఎంసిస్క్వేర్‌కు సంబంధించిన విశిష్ట పత్రాలు ప్రకటించాడు. 1914లో బెర్లిన్ నుండి ప్రొఫెసర్ ఆఫర్ వస్తే వెళ్లి చేరాడు. ఐన్‌స్టీన్ ఉద్యోగంలో చేరే నాటికి మొదటి ప్రపంచ యుద్ధం మొదలైంది. అందులో జర్మనీ ముఖ్యభాగస్వామి . ఐన్‌స్టీన్ యుద్ధాన్ని వ్యతిరేకించాడు. ఆనాటి జర్మన్ సోషల్ డెమోక్రాట్లు అపర జాతీయ వాదులుగా యుద్ధాన్ని సమర్ధించారు. వారికి సానుభూతి పరుడుగా ఉంటూ వచ్చిన ఐన్‌స్టీన్ మాత్రం ఈ విషయంలో వారితో విభేదించాడు. జర్మన్ సోషల్ డెమోక్రట్స్‌లో యుద్ధాన్ని వ్యతిరేకించిన మైనారిటీతో ఏకభవించాడు. యుద్ధం ఆ దేశాల పాలకవర్గ ప్రయోజనాల కోసం మాత్రమేనని మైనార్టీ సెక్షన్ భావించింది. ఈ విషయంలో ఐన్‌స్టీన్ ఇతర సహచర శాస్త్ర పండితులతో కూడ విభేదించాల్సి వచ్చింది. మాక్స్‌ప్లాంక్ నాడు మంచి పేరున్న శాస్త్ర వేత్త. ఆయనా, మరో వందమంది శాస్త్రవేత్తలూ జర్మనీ చేస్తున్న యుద్ధాన్ని సమర్ధించి 'నాగరిక ప్రపంచానికి ఒక మ్యానిపెస్టో' విడుదల చేశారు. ఐన్‌స్టీన్‌తోపాటు మరో ముగ్గురు శాస్త్రవేత్తలు మాత్రమే తమ భిన్నాభిప్రాయాన్ని ప్రకటించారు. దీనికిగాను ఆయన జైలుకు వెళ్లి ఉండాల్సిందే కాని ఐన్‌స్టీన్‌కి అప్పటికే వచ్చిన ప్రఖ్యాతి జైలు ద్వారాలకు అడ్డుగా నిలిచింది. యుద్ధ సంక్షోభ దశలోనూ, తర్వాత కూడ ఐన్‌స్టీన్ యుద్ధానికి వ్యతిరేకంగా తన అభిప్రాయాలు వెల్లడించాడు. యుద్ధ అనంతరం కూడా దేశంలో పెరుగుతున్న సైనికతత్వానికి, జాతీయ అహంకారానికి వ్యతిరేకంగా నిలబడ్డాడు. విషపూరితమైన వికృత యూదు వ్యతిరేకత జర్మనీలో ఊపందుకుంది. అది ఐన్‌స్టీన్‌నూ తాకింది. ఆయన సాపేక్ష సిద్ధాంతంపైనా దాడిమొదలైంది. దానికి మితవాద రాజకీయ వాదులేకాక సహశాస్త్ర వేత్తలు కూడా గొంతుకలిపారు. ఐన్‌స్టీన్ అప్పటికే అంతర్జాతీయ ఖ్యాతి గడించాడు. 1921లో నోబెల్ బహుమతి పొందాడు. కాంతి యొక్క క్వాంటమ్ స్వభావాన్ని వివరించిన ఫిజిక్స్ సుత్రానికి లభించిన గుర్తింపు అది. విజ్ఞాన శాస్త్రంలోనే కాక సామాజిక, సాంస్కృతిక రంగాల్లోనూ ఆయన విశిష్ట వ్యక్తిగా గుర్తింపు పొందాడు. ఐన్‌స్టీన్ తన రాజకీయ అభిప్రాయాలను నిర్భయంగా తెలిపాడు. దేశంలో పెరుగుతూ వస్తున్న సంకుచిత ఛాందసవాదానికి, జాత్యహం కార తీవ్ర వాదానికి వ్యతిరేకంగా నిలబడ్డాడు.

1930నాటికి జర్మనీలో హిట్లర్ నేషనల్ సోషలిస్టు పార్టీ ఆధిక్యత సంపాదించింది. దాంతో ఐన్‌స్టీన్‌కు అక్కడ ఉండడం దుర్లభమైంది. 1933, జనవరి 30న జర్మనీలో నాజీలు అధికారం కైవసం చేసుకున్నారు. బెర్లిన్‌లో ఉన్న ఐన్‌స్టీన్ ఆస్తిపాస్తుల్నీ స్వాధీనం చేసుకున్నారు. హిట్లర్ ప్రభుత్వపు ప్రచార మంత్రి గోబెల్స్, అభ్యుదయ సాహిత్యాన్ని బజార్లల్లో దహనం చేసే కార్యక్రమం చేపట్టాడు. ఐన్‌స్టీన్ రచనలూ అగ్నికి ఆహుతయ్యాయి. **నెదర్లాండ్స్‌లో లెక్చర్ టూర్‌లో ఉన్న ఐన్‌స్టీన్‌ను చంపితే నగదు రివార్డులిస్తున్నట్లు నాజీ పత్రికలు ప్రకటించాయి.** దాంతో ఆయనా, ఆయన కుటుంబమూ బెర్లిన్‌కు తిరిగి రాకూడదని నిర్ణయించుకున్నారు. అమెరికాలోని ప్రిన్‌స్టన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్‌లో ఉద్యోగం లభించింది. న్యూజెర్సీలో, మెర్సర్ స్ట్రీట్‌లోని ఒక చిన్న ఇంట్లోకి కుటుంబం చేరుకుంది. అక్కడ తన పరిశోధనలపై తీవ్రంగా కేంద్రీకరించాడు. 1940లో తనకు అమెరికా పౌరసత్వం లభించే వరకూ జర్మనీలో తలెత్తిన ఫాశిస్టు నాజీజం, యూదువ్యతిరేక జాత్యహంకారంపై పోరా డాడు. యూదు శరణార్ధులను అమెరికా గడ్డపైకి అనుమతించాలని అప్పటి అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ ప్రభుత్వానికి విన్నపంచేశాడు. ఇతర మేధావులతో కలిసి రాయబారాలు నడిపాడు. కానీ ఆయన కృషి ఫలించ లేదు. **స్పెయిన్‌లో అంతర్యుద్ధంలో – నియంత ఫ్రాంకోకు కమ్యూనిస్టులకు మధ్య జరుగుతున్న ప్రతిష్టాత్మక పోరాటంలో ఫ్రాంకో వ్యతిరేక రిపబ్లికన్ శక్తులను ఐన్‌స్టీన్ బహిరంగంగానే బలపరిచాడు.**

1939లో జర్మన్ నాజీలు అణు పరిశోధలో ముందడుగు వేస్తున్నారనీ, అణ్వాయుధం రూపొందించడానికి సిద్ధంగా ఉన్నారనీ అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ ప్రభుత్వానికి తెలియజేస్తూ ఐన్‌స్టీన్ ఒక లేఖ రాశాడు. అయితే వామపక్షభావాలున్న ఐన్‌స్టీన్‌ను అమె

(మిగతా 35వ పేజీలో)

లోపలి పేజీల్లో...

సంపాదక వర్గం

పాటూరు రామయ్య (సంపాదకులు)

ఎస్.వెంకట్రావు (వర్కింగ్ ఎడిటర్)

కొరటాల సత్యనారాయణ

డా. వై. రాధాకృష్ణమూర్తి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరుపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు : బి. వి. రాఘవులు
సంపాదకులు : పాటూరు రామయ్య
ముద్రణ : ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
1-1-60/2, ఆర్టీసీ క్రాస్ రోడ్స్,
హైదరాబాద్ -20
ఫోన్ : ఎడిటోరియల్ 27665420, 27663761
మేనేజర్: 27673787 ఫ్యాక్స్ : 27639921
EMail: : marxist@cpimap.com
Visit cpi(m) site at : cpim.org

మానవాభివృద్ధి ముఖ్యం

ప్రపంచీకరణ యుగంలో చర్చంతా సంపద పెంచడం, పంచడం చుట్టూ తిరుగుతోంది. సంపద పెంచితే చాలు పంపకం దానంతటదే జరుగుతుంది అని వాదించే నయా-ఉదారవాదులు ఆర్థికాభివృద్ధి మీద కేంద్రీకరిస్తున్నారు. ఆర్థికాభివృద్ధి జరిగితే చాలు మానవ సమాజం అభివృద్ధి చెందిపోయినట్లే అంటున్న వాళ్ల వాదన పూర్తిగా తప్పని, ఆర్థికాభివృద్ధి జరిగినంత మాత్రాన మానవాభివృద్ధి జరగాలని లేదని అనేక నివేదికలు, సర్వేలు చెబుతున్నాయి. తాజాగా ఐక్యరాజ్యసమితి మానవాభివృద్ధి నివేదిక కూడా ఇదే విషయం స్పష్టం చేసింది. ప్రజల కష్టాన్ని పోగుచేసుకుని కొద్ది మంది కోటీశ్వరులైతే వారి నుండి సంపద కిందికి తనంత తానే ప్రవహిస్తుందనే వాదన -ట్రికిల్ డౌన్ ఎఫెక్ట్- ఆచరణలో జరిగేది కాదని 2005 మానవాభివృద్ధి నివేదిక తెలుపుతోంది. భారత దేశం సగటున ఏడాదికి 6.5 శాతం అభివృద్ధి సాధిస్తోంది. ఆ మేరకు ప్రజల జీవితాలు మెరుగుపడుతున్నాయా అంటే అలాంటిదేం లేదని మానవాభివృద్ధి నివేదిక స్పష్టం చేస్తోంది. గతంలో మానవాభివృద్ధిలో మనదేశం 127వ స్థానంలో ఉండేది, ఈ ఏడాది కూడా - 6.5 శాతం అభివృద్ధి సాధించిన తరువాత కూడా- అదే స్థానంలో ఉంది. పేదరికం 35 శాతం నుండి 25 శాతానికి తగ్గిందని చెబుతూనే మరోవైపు ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని నివేదిక స్పష్టం చేసింది. అభివృద్ధి చెందిన అమెరికాలో కూడా ఆర్థికాభివృద్ధి 3.5 శాతం ఉన్నప్పటికీ గత ఏడాదితో పోలిస్తే దారిద్ర్య రేఖ దిగువనున్న వారి సంఖ్య పెరిగింది. శిశు మరణాలు పెరిగాయి. ఉపాధి తగ్గింది. నిరుద్యోగం పెరిగింది. మొత్తం ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ అంతటా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. సోషలిస్టు దేశాల్లో పరిస్థితి దీనికి భిన్నం. అక్కడ ఆర్థికాభివృద్ధితోబాటు మానవాభివృద్ధి గణనీయంగా పెరిగింది. ఐరాస మానవాభివృద్ధి నివేదిక ఈ విషయాలన్నిటినీ తేటతెల్లం చేసింది. మరి ఆర్థికాభివృద్ధి వల్ల పెరిగిన సంపదంతా ఏమైంది? కొద్ది మంది దగ్గర పోగైంది. సంపద పెంచడమే కాని పంచకపోవడం వల్ల కొద్ది దేశాల దగ్గర, కొద్ది మంది దగ్గర సంపద పోగుపడుతోంది. దేశాలమధ్య, ప్రజల మధ్య ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ విషయం కూడా ఐక్యరాజ్యసమితి నివేదిక తెలుపుతోంది. నిజానికి పోగుపడడమే సంపద లక్షణం. అందుకే ఆ సంపదను ప్రజలకు పంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. ప్రజలకు సంపద పంచితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది. మార్కెట్టులో సరుకులకు, సేవలకు గిరాకీ పెరుగుతుంది. ఫలితంగా ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. ప్రజలకు సంపద పంచడంలో భూ పంపకం ప్రధానమైనది. దీని వల్ల విస్తారమైన మన గ్రామీణ ప్రాంతాల్లో 70 శాతానికి పైగా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. భూ పంపకంతోబాటు సబ్సిడీలు, రుణాలు, నీటి వనరులు సమకూర్చాలి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి. ఉపాధి కల్పించాలి. గ్రామీణ శ్రామికులకు కూలి, పట్టణ కార్మికులు, ఉద్యోగులకు వేతనాలు పెంచాలి. విద్య, వైద్య సదుపాయాలు ప్రభుత్వాలే కల్పించాలి. ఇవన్నీ సంపద పంచే చర్యలు, ప్రజల సంపద పెంచే చర్యలు. ఈ చర్యలు తీసుకోవడం వల్లనే సోషలిస్టు దేశాల్లో ఆర్థికాభివృద్ధితోబాటు మానవాభివృద్ధి జరుగుతోంది. పెట్టుబడిదారీ దేశాల్లో కొద్దిమంది సంపద పెంచుకోవడమే గాని పంచకపోవడం వల్లనే అక్కడ ఆర్థికాభివృద్ధి ఉన్నా మానవాభివృద్ధి వెనుకపట్టు పడుతోంది. నయా-ఉదారవాదం సంపద పెంచడానికే గాని పంచడానికి వ్యతిరేకం. అందువల్ల ఈ విధానాలు తలకెత్తుకున్న ప్రభుత్వాలనుండి ప్రజలు అధికారాన్ని తమచేతుల్లోకి తీసుకున్నప్పుడు మాత్రమే నిజమైన అభివృద్ధి జరుగుతుంది.

చందా వివరాలు

విడిపత్రిక : రు.5.. సంవత్సర చందా : రు.60
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

చిరునామా

మార్క్సిస్టు
(సైద్ధాంతిక మాసపత్రిక)
వీధి నెం1, అశోక్‌నగర్,
హైదరాబాద్-20

ప్రజలకు చేరని అభివృద్ధి

2005, మానవాభివృద్ధి నివేదికపై విశ్లేషణ

దేశ ప్రజలు మరింత పేదరికంలోకి, మరింత అభద్రతలోకి కూరుకుపోకుండా చూడాలంటే కనీస ఉమ్మడి కార్యక్రమంలో చేసిన ప్రజానుకూల వాగ్దానాలను అమలు చేయాల్సి ఉంటుందని మార్క్సిస్టు పార్టీ పదేపదే చెప్తూ వస్తున్నది. ఆర్థిక సంస్కరణల దిశలో మార్పు రావాలి. అంటే కార్పొరేట్ లాభాలు కాక ప్రజల సంక్షేమం ప్రధానంగా ఉండే ఆర్థిక విధానాలను చేపట్టాలి.

ఈ ఏడాది మానవ అభివృద్ధి నివేదిక విడుదలైంది. ఈ నివేదిక ప్రకారం మానవ అభివృద్ధి సూచికలో మొత్తం 177 దేశాలకుగాను భారత దేశం 127వ స్థానంలో ఉన్నది. గత ఏడాది కూడా భారత దేశానిది ఇదే స్థానం కావడం విశేషం. బిజెపి నేతృత్వం లోని ఎన్డీయే హయాంలో మన దేశం 121వ స్థానం నుంచి 124వ స్థానానికి ఆ తరువాత 127వ స్థానానికి దిగజారింది. అదృష్టవశాత్తు ఈ పతనం అక్కడ ఆగిపోయింది! పేదరిక సూచిని తీసుకొంటే మొత్తం 103 వర్ధమాన దేశాలలో భారతదేశం 58వ స్థానంలో ఉన్నది. స్త్రీ-పురుష అభివృద్ధి సూచికలో మొత్తం 140 దేశాలకు గాను భారత దేశానిది 98వ స్థానం.

ప్రజల జీవన స్థాయిలో సంభవించిన సార్వత్రిక పతనమే 2004 ఎన్నికల ఫలితాలను నిర్ణయించటంలో ప్రధాన పాత్ర వహించినట్లు మార్క్సిస్టు పార్టీ ఇంతకుముందు పదే పదే చెప్పింది. ఈ స్థితిలో అత్యధిక ప్రజల జీవన స్థాయిని మెరుగుపరచాల్సిన తక్షణావసరం ముందుకు వచ్చింది. కనుకనే యు.పి.ఏ. ప్రభుత్వం ఆమోదించిన కనీస ఉమ్మడి కార్యక్రమంలో ఈ అవసరమే ప్రతిబింబించింది. భారత దేశంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పొందికలో కూడా ఈ అంశమే ప్రతిబింబిస్తున్నది. వామపక్షాల మద్దతు లేకుంటే యు.పి.ఏ. ప్రభుత్వానికి మనుగడే ఉండదు. దేశ ప్రజలు మరింత పేదరికంలోకి, మరింత అభద్రతలోకి కూరుకుపోకుండా చూడాలంటే కనీస ఉమ్మడి కార్యక్రమంలో చేసిన ప్రజానుకూల వాగ్దానాలను అమలు చేయాల్సి ఉంటుందని మార్క్సిస్టు పార్టీ పదేపదే చెప్తూ వస్తున్నది. ఆర్థిక సంస్కరణల దిశలో మార్పు రావాలి. అంటే కార్పొరేట్ లాభాలు కాక ప్రజల సంక్షేమం ప్రధానంగా ఉండే ఆర్థిక విధానాలను చేపట్టాలి. ఐరాస తరఫున ప్రతి సంవత్సరం మానవాభివృద్ధి నివేదిక వెలువడుతూ ఉంటుంది. ఈ ఏడాది నివేదిక పరిశీలిస్తే పార్టీ యొక్క పై అవగాహన సరైనదేనని నిరూపితమవుతున్నది. ఆర్థికాభివృద్ధి ఉన్నంత మాత్రాన మానవ అభివృద్ధి దానంతటదే సంభవించదని మేము పలుమార్లు చెప్పాము. ఐరాస నివేదిక ఈ విధంగా పేర్కొంటున్నది. "ఆర్థిక విజయాలు మానవాభివృద్ధి రూపంలోకి మారాలంటే అభివృద్ధి, పంపిణీ మరింత విస్తృతం కావాలి. గ్రామీణ రంగంలోనూ, సేవా రంగంలోనూ ప్రభుత్వ పెట్టుబడులు పెరగాలి. బలహీనమైన పరిపాలనకు స్వస్తి చెప్పి స్త్రీ పురుష అసమానతలను తొలగించగల రాజకీయ నాయకత్వం కావాలి."

సామాజికరంగంలో పెట్టుబడులు పెరిగినప్పుడు మాత్రమే ఆర్థిక పెరుగుదల సానుకూల ప్రభావాన్ని చూపగలదని మార్క్సిస్టు పార్టీ నొక్కి చెప్పింది. ఐరాస మానవాభివృద్ధి నివేదిక కూడా ఈ అవగాహననే కలిగి ఉన్నది. ఆ నివేదిక ఈ విధంగా పేర్కొన్నది. దశాబ్దాల తరబడి మానవాభివృద్ధి రంగంలో పెట్టుబడులు తక్కువగా పెట్టడం అలానే స్త్రీ-పురుష అసమానతలు అధిగమించవలసిన సవాళ్ళుగా నిలిచాయి. ఉన్నతస్థాయిలోని రాజకీయ నాయకత్వం ఈ సవాళ్లను అధిగమించవలసి ఉంది. ఆస్తి, లింగభేదాలతో నిమిత్తం లేకుండా విద్యా వైద్య సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురానట్లయితే భారతదేశపు భవితవ్యంపై ప్రతికూల ప్రభావాలు పడతాయి. ఆ నివేదిక ఇంకా ఈ విధంగా పేర్కొన్నది. "జాతీయస్థాయిలో చూస్తే గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి రాహిత్యం పెరుగుతున్నది. వ్యవసాయ దిగుబడులలో పెరుగుదల ఏడాదికి 2 శాతం కన్నా తక్కువగా ఉన్నది. వ్యవసాయ కార్మికుల వేతనాలలో స్తబ్దత ఏర్పడింది. లైంగిక వివక్ష పెచ్చుమీరుతోంది. ఒక విషయాన్ని గమనిస్తే ఈ వివక్ష ఎంతగా ఉన్నదీ అర్థమవుతుంది. 1 నుంచి 5 సంవత్సరాల మధ్య వయసుగల బాలికలలో మరణాలు అదే వయసున్న బాలురలో కన్నా 50 శాతం ఎక్కువగా ఉంటున్నాయి. 30 సంవత్సరాల వాళ్లను తీసుకున్నప్పటికీ మగవాళ్లలో కన్నా ఆడవాళ్లలోనే మరణాలు ఎక్కువగా ఉంటున్నాయి. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలలో మగపిల్లలకు ప్రాధాన్యతనిస్తున్నారు. భారతదేశంలో జన్మించే ప్రతి ముగ్గురు శిశువులలోను ఒకరు బరువు తక్కువగా ఉంటున్నారు. తల్లుల ఆరోగ్యం సరిగా ఉండటం లేదన్న విషయం దీనినిబట్టి అర్థమవుతున్నది.

సార్వత్రిక శిశు వ్యాధి నిరోధక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి పదిహేనేళ్లు గడచిన తరువాత కూడా కేవలం 42 శాతంమంది పిల్లలకు మాత్రమే ఈ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. శిశు మరణాలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలలో వ్యాధినిరోధక కార్యక్రమాలు సజావుగా జరగటం లేదు. బీహార్, ఉత్తరప్రదేశ్‌లలో 20 శాతం పిల్లలకు మాత్రమే వ్యాధినిరోధక టీకాలు వేయడం జరిగింది.

ఈ రకమైన సమస్యలను ఎదుర్కోటానికి గాను యు.పి.ఏ. ప్రభుత్వం తన కనీస ఉమ్మడి కార్యక్రమంలో వాగ్దానం చేసినట్లుగా వ్యవసాయం, ఆరోగ్యం, విద్యా తదితర రంగాలలో తక్షణమే పెట్టుబడులు పెంచాలి. ప్రస్తుత ప్రభుత్వం ఈ దిశలో కృషి చేయగలదని ప్రజలు ఆశిస్తున్నారు. ఈ దిశలోనే ప్రభుత్వం ప్రయాణించేలా మార్క్సిస్టుపార్టీ, ఇతర వామపక్షాలు తమ పలుకుబడిని వినియోగిస్తాయి. అంతర్జాతీయంగా చూస్తే

మానవాభి వృద్ధి నివేదిక లోని అంశాలు మార్క్సిస్టు పార్టీ 18వ మహాసభ నివేదికల్లో పేర్కొన్న పలు విషయాలను ధృవీకరించేవిగా ఉన్నాయి. దారిద్ర్యం, ఆర్థిక అసమానతలు అంతకంతకూ పెరుగుతున్నందున ఈనాటి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ దశ స్థిరంగా నిలిచేది కాదని మార్క్సిస్టుపార్టీ గతంలోనే పేర్కొన్నది. అత్యధిక ప్రజల కొనుగోలుశక్తి పడిపోవటంతో ప్రపంచమార్కెట్ కుదించుకుపోతున్నది. ఈ పరిస్థితి పెట్టుబడిదారీ అభివృద్ధిని నిరోధించి సామ్రాజ్యవాద ప్రపంచీకరణను అస్థిరపరుస్తున్నది. మానవాభివృద్ధి నివేదిక ఈ దిగువ విధంగా చెపుతున్నది.

- సమాచారం లభ్యమైన 73 దేశాలను పరిశీలిస్తే 53 దేశాలలో (ప్రపంచ జనాభాలో 80 శాతం పైగా ఉన్నవి) అసమానతలు పెరుగుతున్నాయి.
- వంద కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన మంచినీరు అందుబాటులో లేదు.
- వంద కోట్ల మంది ప్రజలు రోజుకు ఒక డాలరు కన్నా తక్కువ ఆదాయంతో బతుకుతున్నారు.
- 260 కోట్లమంది ప్రజలు అపరిశుభ్ర వాతావరణంలో నివసిస్తున్నారు.
- 46 కోట్లమంది జనాభా గలిగిన 18 దేశాలను తీసుకుంటే వాటిస్థాయి 1990లో కన్నా 2003లో తక్కువగా ఉన్నది.
- ప్రపంచ ఆదాయంలో మూడువంతులదాకా 20 శాతం సంపన్నుల అధీనంలో ఉండగా ప్రపంచాదాయంలో కేవలం 1.5 శాతం మాత్రమే 20 శాతం పేదల చేతుల్లో ఉన్నది. ప్రపంచ కుబేరులైన 500 మంది ఆదాయం, పేదరికంలో మగ్గుతున్న 41.60 కోట్లమంది ఆదాయం కన్నా ఎక్కువగా ఉన్నది.

> " దశాబ్దాల తరబడి మానవాభివృద్ధి రంగంలో పెట్టుబడులు తక్కువగా పెడుతున్నారు. స్త్రీ-పురుష అసమానతలు కొనసాగుతున్నాయి. ఉన్నతస్థాయిలోని రాజకీయ నాయకత్వం ఈ సవాళ్లను అధిగమించవలసి ఉంది. ఆస్తి, లింగభేదాలతో నిమిత్తం లేకుండా విద్యా వైద్య సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురా నట్లయితే భారతదేశపు భవితవ్యంపై ప్రతికూల ప్రభావాలు పడతాయి. "

పేదరికాన్ని తొలగించేటందుకై లభిస్తున్న అంతర్జాతీయ సహాయం సంపన్నదేశాల దయాధర్మమనిచెప్పే కబుర్లు ఒట్టి బూటకమని ఈ నివేదికను చూస్తే తెలుస్తుంది. అంతర్జాతీయ సహాయం కోసం ధనిక దేశాలు తమ స్థూల జాతీయోత్పత్తిలో 0.7 శాతం పెంచాలన్న డిమాండ్ ఇటీవల వినబడింది. అయితే 2000-2003 మధ్య సైనిక వ్యయానికి పెంచిన 11,800 కోట్ల డాలర్లకన్నా ఇది తక్కువగా ఉన్నది. వర్ధమాన దేశాలలోని వ్యవసాయ రంగం అభివృద్ధికోసం ధనికదేశాలు ఏడాదికి 100 కోట్ల డాలర్ల సహాయం చేస్తున్నాయి. కాగా దేశీయంగా రోజుకు 100 కోట్ల డాలర్ల సబ్సిడీని ఇస్తున్నాయి. ఈ సబ్సిడీలు ప్రపంచ దేశాలలోని పేద రైతులను దెబ్బతీస్తున్నాయి. మొత్తంమీద చూసినట్లయితే సామ్రాజ్యవాద ప్రపంచీకరణ క్రమంలో అసమానతలు త్వరితగతిన పెరుగుతున్నట్లు మానవ అభివృద్ధి నివేదిక-2005 తెలుపుతున్నది. దారిద్ర్యాన్ని తొలగించి అత్యధిక ప్రజల జీవన పరిస్థితులను మెరుగు పరిచేటందుకై రాజకీయ లక్ష్యం, అంకితభావం ఉండాలని ఈ నివేదిక చెపుతున్నప్పటికీ ఆ రాజకీయ లక్ష్యం పెట్టుబడదారీ అభివృద్ధి స్వభావానికి విరుద్ధమైనదన్నది సుస్పష్టం. దోపిడీ స్వభావం గలిగిన పెట్టుబడిదారీ విధానానికి సోషలిజం ఒక్కటే ప్రత్యామ్నాయమని మార్క్సిస్టుపార్టీ 18వ మహాసభ పేర్కొన్నది. మానవ అభివృద్ధి నివేదికలో పొందుపరిచిన సమాచారం ప్రపంచ పెట్టుబడిదారీ క్రమాన్ని అభిశంసించేదిగా ఉన్నది.

(పీపుల్స్ డెమొక్రసి సంపాదకీయం)

ఉపాధిరహిత అభివృద్ధి

పోతుకూరు

ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి) మానవాభివృద్ధి నివేదిక - 2005 చర్చించిన అతి ముఖ్యమైన అంశాలలో 'ఉపాధిరహిత అభివృద్ధి' అన్నది కూడా ఒకటి. ప్రస్తుత నయా ఉదారవాద యుగంలో ప్రపంచీకరణ ప్రమాదం విస్తృతంగా విస్తరిస్తున్న నేటి తరుణంలో జరిగే అభివృద్ధి ఉపాధి రహిత అభివృద్ధి మాత్రమేనని మార్క్సిస్టు పార్టీ 18వ మహాసభ రాజకీయ తీర్మానంలో స్పష్టంగా పేర్కొంది. ఇదే విషయాన్ని మానవాభివృద్ధి నివేదిక కూడా ప్రస్తావించడం విశేషం. ఈ ఏడాది మానవాభివృద్ధిలో భారతదేశం గత ఏడాదిలాగానే 127వ స్థానంలో ఉంది. 90లలో 36 శాతంగా ఉన్న పేదరికం ఇపుడు 25శాతానికి తగ్గిపోయినట్లు మానవాభివృద్ధి నివేదిక గుర్తించింది. అంటే పేదరికం వాస్తవంగా తగ్గిపోయినట్లేనా? పేదల జీవితాలు మెరుగుపడినట్లేనా? కానేకాదు. ఇదే విషయాన్ని మానవాభివృద్ధి నివేదిక ప్రస్తావించడమే ఇక్కడ విశేషం. అనేక ఏళ్లుగా మార్క్సిస్టు పార్టీ ఏదైతే చెబుతూ వచ్చిందో అదే విషయాన్ని ఇపుడు ఐక్యరాజ్యసమితి సంస్థ కూడా ప్రస్తావించింది. "ప్రపంచ పెట్టుబడిదారీ విధానంలో ఇపుడు జరుగుతున్న అభివృద్ధి ఉపాధి రహిత అభివృద్ధి. అది ఉపాధిని కబళించే లక్షణాన్ని కూడా కలిగి ఉంది. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి ఫలితాలను పేదలకు ఏ విధంగానూ బదలాయించ జాలదని దీన్ని బట్టి తెలుసుకోవచ్చు. అమెరికాలో 2000లో 4.0 శాతంగా ఉన్న నిరుద్యోగ రేటు 2003 నాటికి 6.0శాతానికి చేరింది. అభివృద్ధి చెందిన పెట్టుబడి దారీ దేశాలలో మొత్తంగా ఈ శాతం 6.6గా ఉంది." అని మార్క్సిస్టు పార్టీ 18వ మహాసభ రాజకీయ తీర్మానం పేర్కొంది. రోజురోజుకూ పెరుగుతున్న ప్రపంచీకరణ

ప్రమాదాన్ని, పెట్టుబడులు 'కొల్లగొట్టే పెట్టుబడులు'గా మారే తీరును మార్క్సిస్టు పార్టీ 18 మహాసభ రాజకీయ తీర్మానంలోనూ, అంతకుముందు తాజాపరిచిన పార్టీ కార్యక్రమంలోనూ వివిధ దేశాల అనుభవాలతో సోదాహరణంగా వివరించడం జరిగింది. అయినా అనేకమంది పెట్టుబడిదారీ విశ్లేషకులకు అది తలకెక్కలేదు. ఆదాయ →

→ వృద్ధి, అభివృద్ధి కనబడుతూనే ఉన్నాయి కదా! భారత్ అభివృద్ధి చెందుతూనే ఉంది కదా అన్న వాదనలు చాలామంది చేస్తుంటారు. "భారతదేశంలో జరుగుతున్న అభివృద్ధి పేదరి కాన్ని వాస్తవంగా తగ్గించేందుకు మాత్రం ఉపయోగపడడం లేదు. భారతదేశంలో పేదరికం గ్రామాల్లో కేంద్రీకృతమై ఉంది. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలైన బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లలో అది మరీ కళ్లకు కడుతుంది. అదే సమయంలో రాష్ట్రాల అభివృద్ధి గణాంకాలు కూడా బాగానే కన్పిస్తాయి. ఆదాయం పట్టణ ప్రాంతాల్లో కనిపిస్తుంది. జాతీయ స్థాయిలో గ్రామీణ నిరుద్యోగం పెరుగుతున్నది. వ్యవసాయ ఉత్పత్తుల వృద్ధి ఏడాదికి రెండు శాతాన్ని మించడం లేదు. వ్యవసాయ కార్మికుల వేతనాలు ఎటువంటి పెరుగుదలకూ నోచుకోకుండా స్తంభించి పోయాయి. అందుకే భారతదేశంలో కన్పిస్తున్న అభివృద్ధి "ఉపాధి రహిత అభివృద్ధి." అని మానవాభివృద్ధి నివేదిక పేర్కొంది. గ్రామీణ పేదరికం పెరుగు తున్నది. రాష్ట్రాల మధ్య అసమానతలు పెరుగు తున్నాయి. పట్టణ ప్రాంతాలలో కన్పిస్తున్న అభివృద్ధి మానవాభివృద్ధి రూపాన్ని సంతరించు కోలేక పోవడమే సమస్య. సామాజిక మౌలిక సదుపాయాల రంగానికి ప్రాధాన్యత పెరిగి నపుడే ఆర్థికాభివృద్ధి నుండి సానుకూల ఫలితాలు వస్తాయి. "భారతదేశంలో మానవా భివృద్ధికి దోహదపడే అనేక రంగాలు దశాబ్దాల తరబడి నిర్లక్ష్యానికి గురికావడం, స్త్రీపురుష అసమానతలు సవాళ్లుగా ఉన్నాయి. అత్యున్నత స్థాయిలోని రాజకీయనాయకులు ఈ సవాళ్లను స్వీకరించగలగాలి. పేదలు-సంపన్నులు, స్త్రీలు-పురుషులు అనే తేడాలు పట్టించుకోకుండా అందరికీ విద్య, ఆరోగ్య సదుపాయాలు అందించగలగాలి. లేదంటే ప్రపంచ ఆర్థిక రంగంలో భారత్ అవకాశాలకు అది ఆటంకంగా పరిణమిస్తుంది" అని యుఎన్‌డిపి నివేదిక స్పష్టంగా వ్యాఖ్యా నించింది. ఇవి నెరవేరాలంటే పాలకుల్లో చిత్తశుద్ధి, కృతనిశ్చయం అవసరమని కూడా అది పేర్కొంది."భారతదేశంలో గ్రామీణ నిరుద్యోగం రోజురోజుకూ విస్తరిస్తున్నది. వ్యవసాయోత్పత్తి పెరుగుదల ఏడాదికి రెండుశాతాన్ని మించడం లేదు. వ్యవసాయ కార్మికుల వేతనాలు ఎదుగూ బొదుగూలేకుండా ఉన్నాయి. అభివృద్ధి ఉన్నా అది 'ఉపాధి రహిత అభివృద్ధి.' జాతీయాదాయంలో ప్రతి 'ఒక్క శాతం' అభివృద్ధి 80లలోనూ, 90లలోనూ మూడురెట్లు ఉద్యోగాలను కల్పించేవి." అని మానవాభివృద్ధి నివేదిక పేర్కొంది. ఆగస్టులో వెలువడిన ఆసియా అభివృద్ధి బ్యాంకు నివేదిక కూడా 'ఉపాధి రహిత అభివృద్ధి' గురించి ప్రస్తావించింది. అభివృద్ధి కన్పిస్తున్నప్పటికీ ఆసియాలో నిరుద్యోగం విస్తరించడాన్ని అది విపులంగా వివరించింది. ఆసియా దేశాలు ఉత్పత్తి విషయంలో మంచి అభివృద్ధిని సాధించినప్పటికీ ఉపాధి వృద్ధి రేటు మాత్రం చాలా నిరుత్సాహంగా ఉందని ఆ నివేదిక పేర్కొంది. ఉపాధి అవకాశాలు పెరగక పోవడం వల్లే ఆసియా ప్రాంత దేశాల్లో పేదరికం విస్తరిస్తున్నదని ఆ నివేదిక వివరించింది. ఆర్థికాభివృద్ధి కనిపిస్తున్నప్పటికీ ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం లేదా స్తంభించి పోవడం వంటి వాటికి భారత్, ఇండొనేషియా, ఫిలిప్పీన్స్, థాయిలాండ్‌లు ప్రబల నిదర్శనాలని ఆ నివేదిక పేర్కొంది. ఇప్పటికైనా పెట్టుబడిదారీ అభివృద్ధి దూరపుకొండను దగ్గరకు వెళ్లి వీక్షిద్దాం.

సోషలిస్టు దేశాల్లో మానవాభివృద్ధి

రవీంద్ర

మానవాభివృద్ధి విషయంలో సోషలిష్టు దేశాలు అప్రతిహతంగా పురోగమి స్తున్నాయి. మిగిలిన అనేక వర్థమాన దేశాల మాదిరిగానే మాజీ సోషలిస్ట్ రిపబ్లిక్‌లు తిరోగమనంలో పయనిస్తున్నాయి. సోషలిస్టు దేశాలు ఉపాధితో కూడిన అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నాయి. 2005 మానవాభివృద్ధి నివేదికలో సోషలిష్టు దేశాలైన క్యూబా 52వ ర్యాంకులోను, చైనా 85వ ర్యాంకులోను, వియత్నాం 108వ ర్యాంకులో ఉన్నాయి. భారత్ మాత్రం 127కే పరిమిత మయింది. మానవాభి వృద్ధి సూచిలో క్యూబా 0.817లోను, చైనా 0.755లోను, వియత్నాం 0.704లోను ఉండగా మన దేశం 0.602లో ఉంది. విశేషమేమిటంటే 1985లో వియత్నాం మానవాభివృద్ధి సూచి 0.583 మాత్రమే. నేడు ఆ దేశం భారత్‌ను మించిపోయింది. చైనాలో 1978 నాటికి 25 కోట్ల మంది పేదరికంలో ఉండగా, 2004నాటికి ఆ సంఖ్య 2.9 కోట్లకు తగ్గింది. దారిద్ర్యనిర్మూలనకు వియత్నాం కూడా అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. 'ప్రోగ్రాం135' పేరుతో చేపట్టిన కార్యక్రమాల వల్ల 1980లో 70శాతంగా ఉన్న దారిద్ర్యం 1990నాటికి 60శాతానికి, 2002నాటికి 32శాతానికి నేడు 21.2శాతానికి తగ్గింది. చైనా, వెనిజులా తదితర దేశాల సహకారం, స్వావలంబన విధానాలతో క్యూబా కూడా నేడు పేదరికం నుండి చాలా వరకు బయట పడింది. సగటు ఆయుర్దాయంలో కూడా క్యూబా సోషలిష్టు దేశాలలో అగ్రస్థానాన్ని ఆక్రమిం చింది. క్యూబా సగటు ఆయుర్దాయం 1959లో 60 సంవత్సరాలుండగా 1999నాటికి 76, నేడది 77.3 సంవత్సరాలకు చేరుకుంది. చైనాలో ఈ సగటు ఆయుర్దాయం 71.6 సంవత్సరాలు కాగా వియత్నాం సగటు ఆయుర్దాయం 70.5సంవత్సరాలుకు చేరుకుంది. స్వాతంత్ర్యం వచ్చి అర్థశతాబ్దం దాటినా మన దేశ సగటు ఆయుర్దాయం 63.3 సంవత్సరాలు మాత్రమే. చైనాలో 1992లో 22.23 శాతం నిరక్షరాస్యులుండగా 2002కి ఇది 8.72 శాతానికి తగ్గింది. 1959 నాటికి క్యూబాలో అక్షరాస్యత 62 శాతం. తాజా నివేదిక ప్రకారం అది 96.9శాతం అని తేలింది. చైనాలో అక్షరాస్యత 90.9శాతం, వియత్నాంలో 90.3శాతం కాగా మన దేశ అక్షరాస్యతా శాతం 61 మాత్రమే. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలలకు సంబంధించిన స్థూల ఎన్‌రోల్‌మెంట్ నిష్పత్తి లో క్యూబా 80శాతం, చైనా 69శాతం, వియత్నాం 64శాతం సాధించగా మన దేశంలో ఇది 60 శాతం మాత్రమే. క్యూబాలో స్త్రీల సగటు ఆయుర్దాయం 77.5 సం.(పురుషులు:72.6సం.), చైనాలో 73.5 సం. వియత్నాంలో 72సం. కాగా మన దేశంలో స్త్రీల సగటు ఆయుర్దాయం 65 సం. క్యూబాలో స్త్రీల అక్షరాస్యతా శాతం 96.8 చైనాలో 86.5, వియత్నాంలో 86.9, కాగా మన దేశ స్త్రీల అక్షరాస్యత 47.8 శాతం మాత్రమే.

ఐరోపాను మళ్లీ వెంటాడుతున్న 'కమ్యూనిస్టు భూతం'

మార్క్సిస్టు

ఇప్పుడు మళ్లీ కమ్యూనిస్టులపై కట్టు కథలు ప్రచారం చేయాల్సిన అవసరం పెట్టుబడిదారీ పాలకవర్గాలకు వచ్చింది ఎందుకంటే కమ్యూనిజానికి, సోషలిజానికి, వామపక్షాలకు ప్రపంచంలో మళ్లీ ఆదరణ పెరుగుతోంది కాబట్టి. ఐరోపాలో, లాటిన్ అమెరికాలో, ఆసియాలో కమ్యూనిస్టు పార్టీల చుట్టూ శ్రామిక జనం సమీకృత మవుతున్నారు కాబట్టి.

"ఐరోపాను ఒక భూతం వెంటాడుతోంది - కమ్యూనిజం అనే భూతం. పాత ఐరోపాకు చెందిన అన్ని శక్తులు: పోప్, జార్, మెటిర్నిచ్, గూజాట్, ఫ్రెంచ్ రాడికల్స్, జర్మన్ పోలీస్-గూఢచారులు వీరంతా ఈ భూతాన్ని పారదోలడానికి ఒక పవిత్రమైన పొత్తు పెట్టుకున్నారు".... మార్క్స్, ఏంగెల్స్ రాసిన కమ్యూనిస్టు ప్రణాళికలో ప్రారంభ వాక్యాలివి. కమ్యూనిస్టు ప్రణాళిక ప్రచురితమైన ఒకటిన్నర శతాబ్దాల తరువాత, యూరప్‌లోనూ, ప్రపంచం మొత్తంలోనూ కమ్యూనిస్టు భూతాన్ని భూస్థాపితం చేశామని పెట్టుబడిదారులు ప్రకటించి చేతులు దులుపుకున్న ఒకటిన్నర దశాబ్దాల తరువాత నేడు మళ్లీ అదే కమ్యూనిస్టు భూతం గురించి ఐరోపా, అమెరికా, ఇతర పెట్టుబడిదారీ పాలక వర్గాలు భయపడుతున్నాయి. వణుకుతున్నాయి. దాన్ని మళ్లీ లేవకుండా చేయాలని మరోసారి పరితపిస్తున్నాయి.

ఎవడో మిత్రోకిన్ అట. సోవియట్ విచ్ఛిన్నం తరువాత ఆ దేశపు గూఢచారి సంస్థ కెజిబి పత్రాలను అతను చూసి కొన్ని విషయాలు రాసుకుని లండన్ పారిపోయి వచ్చాడట. ఆ విషయాలను పట్టుకుని ఇంగ్లండుకు చెందిన మరో పెద్ద మనిషి పుస్తకం రాస్తే, మిత్రోకిన్ చనిపోయిన రెండేళ్లకు పుస్తకం బయటకు తెస్తే అందులోని విషయాలను పట్టుకుని ఐరోపా, అమెరికా, భారత దేశంతో సహా ప్రపంచమంతా కమ్యూనిస్టులపైనా, కమ్యూనిజంపైనా నిందా ప్రచారం ప్రారంభించారు. అసలు అంతర్జాతీయ విషయాలే పట్టించుకోని పత్రికలు సైతం ఈ కట్టుడు కథలకు ఫ్రంట్ పేజీల్లో ప్రాధాన్యతనిచ్చి పెట్టాయి. పదిహేనేళ్ల క్రితం వరకూ అంటే కమ్యూనిజానికి పశ్చిమదేశాల పాలకవర్గాలు అంత్యక్రియలు నిర్వహించినంత వరకు ఇటువంటి వేలాది కట్టుడు కథలు ప్రపంచమంతా ప్రచారం చేశారు. ఇప్పుడు మళ్లీ అటువంటి కథలు ప్రచారం చేయాల్సిన అవసరం వారికి వచ్చింది ఎందుకంటే కమ్యూనిజానికి, సోషలిజానికి, వామపక్షాలకు ప్రపంచంలో మళ్లీ ఆదరణ పెరుగుతోంది కాబట్టి. ఐరోపాలో, లాటిన్ అమెరికాలో, ఆసియాలో కమ్యూనిస్టు పార్టీల చుట్టూ శ్రామిక జనం సమీకృతమవుతున్నారు కాబట్టి.

ఇప్పుడీ కమ్యూనిస్టు భూతం మరోసారి ఐరోపా పాలక వర్గాలను ఎంతగా వణికిస్తోందంటే దాన్ని ప్రజలనుండి దూరం చేయడానికి ప్రత్యేక పథకాలు రచిస్తున్నారు. ఐరోపా పార్లమెంటరీ కౌన్సిల్‌లో కమ్యూనిజానికి వ్యతిరేకంగా ఒక తీర్మానం పెట్టి ఆమోదింపజేయడానికి జరిగిన ప్రయత్నం ఈ పథకాల్లో ఒకటి. కమ్యూనిస్టు పార్టీల, ముఖ్యంగా రష్యన్ కమ్యూనిస్టు పార్టీ యొక్క ప్రతిఘటన వల్ల ఈ కమ్యూనిస్టు వ్యతిరేక తీర్మానాన్ని తాత్కాలికంగా విరమించుకున్నప్పటికీ కమ్యూనిజంపై బురదజల్లే ప్రయత్నాలు మాత్రం కొనసాగుతున్నాయి.

అసలేం జరిగింది?

ఐరోపా పార్లమెంటరీ అసెంబ్లీ కౌన్సిల్ సమావేశం ఈ నెల (2005, అక్టోబర్) 3 నుండి 7 వరకు ఫ్రాన్స్‌లోని స్ట్రాస్‌బర్గ్ నగరంలో జరుగుతోంది. ఈ సమావేశం ఎజెండాలో చర్చించే అంశాల్లో పలు ఇతర తీర్మానాలతో బాటు కమ్యూనిజాన్ని ఖండించే తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టాలనుకున్నారు. "కమ్యూనిజం నేరాలను అంతర్జాతీయంగా ఖండిచాల్సిన అవసరం" అని తీర్మానానికి పేరు పెట్టారు. ఒక్క కమ్యూనిజానికి వ్యతిరేకంగా మాత్రమే తీర్మానం ప్రవేశపెడితే బాగుండదు కాబట్టి ఫాసిజాన్ని ఖండిస్తూ కూడా ఒక తీర్మానాన్ని దానికి జతచేశారు. "నాజీయిజాన్ని కీర్తించడానికి, సమర్ధించడానికి ఖండన" అనేపేరుతో తీర్మానం రూపొందించారు. ఇక్కడ నాజీయిజాన్ని, కమ్యూనిజాన్ని ఒకే గాట కట్టి తీర్మానాలు రూపొందించడంలోనే పెద్ద కుట్ర ఉంది. నాజీయిజం అనేది పెట్టుబడిదారీ వర్గపు బహిరంగ, పరమ కిరాతక నియతృత్వ రూపం. మానవత్వానికి వ్యతిరేకమైనంది. ఆర్య సంస్కృతి ఆధిపత్యం పేరుతో మైనారిటీ ప్రజలను ఊచకోత కోసిన ఫాసిస్టు రూపమది. దాన్నీ, మానవతకు మహోన్నత రూపమైన కమ్యూనిజాన్ని ఒకే గాట కట్టి రెంటినీ "టోటలటేరియనిజం" ప్రతిరూపాలుగా చూపడం ద్వారా కమ్యూనిజం పట్ల ప్రజల్లో మరో సారి భయోత్పాతం సృష్టించాలన్నదే ఐరోపా పాలక వర్గాల కుట్ర. విశేష మేమంటే ఐరోపాలో ఫాసిజంపై విజయం సాధించిన 60వ సంవత్సరం లోనే ఈ తీర్మానం చేయడం. ఫాసిజాన్ని ఓడించి ఐరోపాలో మానవతను రక్షించడంలో సోషలిస్టు సోవియట్ యూనియన్ ప్రధాన పాత్ర వహించిన సంగతి తెలిసిందే. హిట్లరు యొక్క నాజీయిజాన్ని ఓడించే యుద్ధంలో సుమారు రెండు కోట్ల మంది సోలియట్ ప్రజలు మరణించారు. వీరిలో కమ్యూనిస్టులు, ఎర్ర సైన్యం నిర్ణయాత్మక పాత్ర వహించారు. నాజీయిజానికి పూర్తిగా విరుద్ధమైన సిద్ధాంతం ఆచరణ కలిగిన కమ్యూనిజాన్ని నాజీయిజంతో జతచేయడం ద్వారా కమ్యూనిజంపై ప్రజల్లో అపోహలు కలిగించవచ్చునన్నదే ఈ కుట్రలో ప్రధానాంశం. జూన్-జూలై నెలల్లోనే తీర్మానం ముసాయిదా సిద్ధం చేశారు. దాన్ని గత నెల 13న ఫ్రాన్స్‌లో జరిగిన ఐరోపా పార్లమెంటరీ అసెంబ్లీ కౌన్సిల్ రాజకీయ కమిషన్ సమావేశంలో పెట్టి ముసాయిదా ఓకె అనిపించుకుని అక్టోబర్ 3-7 మధ్య స్ట్రాస్‌బర్గ్‌లో జరిగే కౌన్సిల్ సమావేశంలో చర్చకు పెట్టాలన్నది వారి ప్లాను. అయితే ఐరోపా పార్లమెంటులో ఇప్పుడు బూర్జువా పార్టీలే కాదు, కమ్యూనిస్టులు కూడా ఉన్నారు. వారికి జులై నెలలోనే కమ్యూనిస్టు

> **"అంతర్జాతీయంగా వచ్చిన నిరసన వల్లనైతేనేమి, జుగనోవ్ వంటివారి జోక్యం వల్లనైతేనేమి అక్టోబర్ సమావేశం ఎజెండాలో కమ్యూనిస్టు వ్యతిరేక తీర్మానం పెట్టకూడదని, నాజీయిజాన్ని ఖండించే తీర్మానాన్ని మాత్రం యథాతథంగా పెట్టవచ్చునని గతనెల 13న జరిగిన రాజకీయ కమిషన్ సమావేశం నిర్ణయించింది. ఇది కమ్యూనిస్టులకు విజయంగా పరిగణించవచ్చు."**

వ్యతిరేక తీర్మానం ముసాయిదా కాపీ లభ్యమైంది. రష్యన్ ఫెడరేషన్ కమ్యూనిస్టు పార్టీ ఛైర్మన్ గెన్నడీ జుగనోవ్ ఈ తీర్మానాన్ని ఖండిస్తూ ఒక ప్రకటన చేశారు. ఇటువంటి తీర్మానం రాబోతోందని, దీన్ని ముసాయిదా రూపంలోనే తిప్పికొట్టాలని ఆయన ప్రపంచంలోని సోదర కమ్యూనిస్టు పార్టీలన్నిటికీ ఈ-మెయిల్ పంపాడు. చాలా పార్టీలు ఈ కమ్యూనిస్టు వ్యతిరేక తీర్మానాన్ని ఖండిస్తూ ఐరోపా పార్లమెంటరీ అసెంబ్లీ కౌన్సిల్ ఛైర్మన్ రెనె వాన్ డెర్ లిండెన్‌కు నిరసన లేఖలు పంపాయి. గత నెల 13న పారిస్‌లో జరిగిన రాజకీయ కమిషన్ సమావేశంలో ఈ ముసాయిదా ఖరారు కోసం చర్చకు పెట్టినప్పుడు జుగనోవ్ దాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. కమ్యూనిజాన్ని, కమ్యూనిస్టు పార్టీలను సమర్థించమే కాకుండా ఈ తీర్మానం తీసుకు రావడం వెనుక ఐరోపా పాలక వర్గాల కుట్రను ఎండగడుతూ మాట్లాడాడు. ఆయన ఈ సందర్భంగా చెప్పిన సమాధానంలోని విషయాలను పత్రికా గోష్టి పెట్టి మరీ వివరించాడు. జుగనోవ్ ప్రసంగ పాఠాన్ని తరువాతి పేజీల్లో చూడవచ్చు. అంతర్జాతీయంగా వచ్చిన నిరసన వల్లనైతేనేమి, జుగనోవ్ వంటివారి జోక్యం వల్లనైతేనేమి అక్టోబర్ సమావేశం ఎజెండాలో కమ్యూనిస్టు వ్యతిరేక తీర్మానం పెట్టకూడదని, నాజీయిజాన్ని ఖండించే తీర్మానాన్ని మాత్రం యథాతథంగా పెట్టవచ్చునని గతనెల 13న జరిగిన రాజకీయ కమిషన్ సమావేశం నిర్ణయించింది. ఇది కమ్యూనిస్టులకు విజయంగా పరిగణించవచ్చు. అయితే కమ్యూనిస్టు వ్యతిరేక తీర్మానాన్ని ఇప్పటికి వాయిదా వేసినా తరువాతి సమావేశంలో పెట్టవచ్చునని అది తెలిపింది. ఈ అంశంపై రాజకీయ కమిషన్ సెప్టెంబర్ 13న పత్రికలకు విడుదల చేసిన ప్రకటన ఇలా ఉంది: "ఈ రోజు పారిస్‌లో 'కమ్యూనిజం నేరాలపై అంతర్జాతీయ ఖండన' అన్న తీర్మానంపై చర్చ జరిపిన తరువాత ఈ ముసాయిదా సిఫార్సును, తీర్మానాన్ని భవిష్యత్తులో మరో తేదీకి వాయిదా వేయాలని ఐరోపా పార్లమెంటు అసెంబ్లీ కౌన్సిల్‌కు చెందిన రాజకీయ వ్యవహారాల కమిషన్ నిర్ణయించింది. అందువల్ల అక్టోబర్ (స్ట్రాస్‌బర్గ్, 3-7 అక్టోబర్)లో జరిగే సమావేశం ఎజెండా నుండి ఈ ఐటమ్‌ను ఉపసంహరించాలని రాజకీయ కమిటీ అధ్యక్షుడు, కౌన్సిల్ బ్యూరోను కోరాడు. అయితే"నాజీయిజాన్ని కీర్తించడానికి, సమర్థించడానికి ఖండన" (మిఖాయిల్ మెర్గెలోవ్, రష్యా) మీద మాత్రం చర్చించాలని రాజకీయ వ్యవహారాల కమిటీ నిర్ణయించింది." ముసాయిదా తీర్మానాన్ని చర్చకు పెట్టకుండా ఎందుకు వాయిదా వేయాల్సి వచ్చిందన్న విషయాన్ని మాత్రం ఈ వార్తలో వివరించలేదు.


తీర్మానంలో ఏముంది?

కమ్యూనిస్టు వ్యతిరేక ముసాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టకుండా వాయిదా వేసినప్పటికీ వచ్చే జనవరిలో జరిగే సమావేశంలో దాన్ని ప్రవేశపెట్టే అవకాశముందని జుగనోవ్ పేర్కొన్నాడు. ముసాయిదాలో ఉన్న అంశాలను కూడా ఆయన ఈ-మెయిల్ ద్వారా అన్ని పార్టీలకు పంపాడు. తీర్మానాన్ని పరిశీలిస్తే కమ్యూనిజం, సోషలిజాలపై ఐరోపా పాలక వర్గాలు ఎంతటి నీచ ప్రచారానికి పాల్పడుతున్నాయో అర్థమవుతుంది. అసలు బెర్లిన్ గోడ కూలిపోయిన తరువాత 1995-96 లోనే కమ్యూనిజాన్ని ఖండిస్తూ తీర్మానం చేయాల్సిందని కాని అప్పుడా పని చేయలేకపోయామని ముసాయిదాలో పేర్కొన్నారు. దానికి కారణాల్లో ఒకటి, ఇంకా కొన్ని దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు అధికారంలో ఉండడం, యూరప్‌లోని పలు దేశాలకు ఆ దేశాలతో సంబంధాలుండడం అని పేర్కొన్నారు. సోవియట్ కాలంనాటి రాజకీయ నాయకులు కొందరు ఇప్పటికీ ప్రజాజీవితంలో పనిచేస్తుండడం మరో కారణమని చెప్పారు. అదేకాకుండా ఐరోపాలో నేడు అనేక దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు చురుకుగా ఉండడం కూడా ఇంకో కారణమని చెప్పారు. అంతేకాకుండా కమ్యూనిస్టు సిద్ధాంతమైన సమానత్వం, సామాజిక న్యాయం "ఇప్పటికీ చాలామంది రాజకీయ నాయకులను చెడగొడుతుండడం" దీనికి ఇంకో కారణమని కూడా ముసాయిదా తీర్మానంలో పేర్కొన్నారు.

గతంలో వదిలిపెట్టిన విషయాన్ని ఇప్పుడు పనిగట్టుకుని ప్రత్యేకంగా తీర్మానం ఎందుకు చేయాల్సి వచ్చిందంటే దానికి వారు చెప్పిన కారణాలు: 1. కమ్యూనిస్టు సిద్ధాంతమైన సామాజిక న్యాయం, సమానత్వానికి ఆకర్షితులై కమ్యూనిస్టుపార్టీల్లోకి కొత్తగా వస్తున్న తరాలకు కమ్యూనిస్టుల పాత 'నేర' చరిత్రను గుర్తు చేయడం ద్వారా పార్టీ నుండి వారిని దూరం చేయడం. 2. ఇప్పటికీ కమ్యూనిస్టు పార్టీలు అధికారంలో ఉన్న సోషలిస్టు దేశాలు -చైనా, ఉత్తర కొరియా, వియత్నాం, క్యూబా, లావోస్ లలో ఈ తీర్మానం వల్ల 'ప్రతిపక్షాల వాదనలకు మరింత బలం, ప్రతిష్ట లభిస్తుంది', కాబట్టి ఆ దేశాల్లో సోషలిస్టు వ్యవస్థలను దెబ్బతీయవచ్చు. 3. ఈ తీర్మానం ద్వారా కమ్యూనిస్టుల వర్గపోరాట సిద్ధాంతాన్ని దెబ్బతీయవచ్చు. 4. సోవియట్‌లో సోషలిజం విచ్చిన్నమై 15 ఏళ్లు పూర్తవుతున్నది. ఇది సోషలిజానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి మంచి సందర్భమవుతుంది. ఇప్పటికీ 'చాలా దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు చురుకుగా పనిచేస్తున్నాయి' కాబట్టి, చాలా దేశాల్లో 'కమ్యూనిస్టు చిహ్నాలను ఉపయోగిస్తున్నారు' కాబట్టి కమ్యూనిజానికి వ్యతిరేకంగా 'యువతరాన్ని ఎడ్యుకేట్ చేయాల్సిన' అవసరముందని ముసాయిదాలో పేర్కొన్నారు.

ముసాయిదాను రష్యన్ కమ్యూనిస్టు పార్టీతో బాటు ఐరోపాలోని పలు కమ్యూనిస్టు పార్టీలు వ్యతిరేకించాయి. ఇటలీ, గ్రీస్, స్లొవేకియా, ఆర్మీనియా, అజర్బయిజాన్ కమ్యూనిస్టు పార్టీలు నిరసన తెలపడంతో ముసాయిదాకు బలం తగ్గిపోయింది.రాజకీయ కమిషన్‌లో కేవలం ఐదుగురు సభ్యులు మాత్రమే ముసాయిదాను బలపరుస్తూ ఓటు వేశారు. 20 మందికి పైగా సభ్యులు దానికి వ్యతిరేకంగా ఓటు వేయడంతో కమిషన్ ముసాయిదాపై చర్చను 'భవిష్యత్ తేదీలకు' వాయిదా వేసింది. మన దేశంలో కూడా దీనికి నిరసన వ్యక్తమైంది. బెంగాల్ వామపక్ష సంఘటన వారం రోజుల నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఐరోపా కౌన్సిల్‌లో జుగనోవ్ వినిపించిన వాదాన్ని పక్కపేజీలో చదవండి !

ఈ విషప్రచారాన్ని ప్రతిఘటించాలి!



ఐరోపా పార్లమెంటరీ అసెంబ్లీ కౌన్సిల్ యొక్క రాజకీయ కమిషన్ సమావేశంలో కమ్యూనిస్టు వ్యతిరేక ముసాయిదా తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ రష్యన్ ఫెడరేషన్ కమ్యూనిస్టు పార్టీ ఛైర్మన్ గెన్నడీ జుగనోవ్ వినిపించిన వాదనలోని కొన్ని విషయాలు:

మిత్రులారా!

అమెరికా తరహా ప్రపంచీకరణ క్రమం కొత్త పుంతలు తొక్కుతోంది. ఈసారి అమెరికాకు ఉపగ్రహాలైన యూరప్‌దేశాల ద్వారా ఇది సాగుతోంది. ఐరోపా పార్లమెంటరీ అసెంబ్లీ కౌన్సిల్ రాజకీయ కమిషన్ ఎదుటకు "కమ్యూనిజం నేరాలను అంతర్జాతీయంగా ఖండించాల్సిన అవసరం" అన్న ముసాయిదా తీర్మానం వచ్చింది. వాస్తవానికి ఇది "కమ్యూనిజం నేరాలు" గా ఆరోపిస్తున్న వాటిని "ఖండించటం" కాదు- యూరప్ స్థాయిలో, మొత్తం ప్రపంచ స్థాయిలో కమ్యూనిస్టు వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకుద్దేశించినది. ఇది గనుక ఫలిస్తే ఈ ప్రపంచ సమాజమే పూర్తిగా అస్థిరీకరణకు గురియవుతుంది.

పార్లమెంటరీ అసెంబ్లీలో చర్చించి, సభ్య సామాజానికి ఒక కార్యాచరణ కార్యక్రమంగా అందజేయడానికి ఉద్దేశించిన ఈ పత్రం, ఆదిమకాలపు కమ్యూనిస్టు వ్యతిరేకతకు చిహ్నం. కౌన్సిల్‌కు చెందిన కొంతమంది నాయకులు కమ్యూనిజంపై అంతర్జాతీయ విచారణ జరపాలంటూ తమ హద్దులను, అధికార పరిధులను దాటి మాట్లాడుతున్నారు. కమ్యూనిజం, ఫాసిజాలను ఒకే గాటన కట్టే కాలం చెల్లిన వాదనలనే మళ్లీ ముందుకు తెస్తున్నారు. ఏమాత్రం విజ్ఞానం ఉన్నవారైనా ఈ రెంటి మధ్యగల మౌలిక భేదాలను గమనిస్తారు. ఉదాహరణకు: ఆర్థికరంగంలో కమ్యూనిస్టులు జాతీయకరణ కోరతారు. ఉత్పత్తిలో ప్రభుత్వ రంగాన్ని నిర్మించాలని వాదిస్తారు. ఫాసిస్టులు వాటికి వ్యతిరేకం. వారు నిర్మించే కార్పొరేట్ ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి సాధనాలపై ప్రైవేట్‌యాజమాన్యమే ప్రధానపాత్ర పోషిస్తుంది. సామాజిక రంగంలో కమ్యూనిస్టులు కార్మికవర్గానికి, ఇతర శ్రమజీవులకు మొదటిస్థానం ఇస్తారు. కాని ఫాసిస్టులు ప్రజలను జాతులుగా విభజించి, సంపన్న వర్గాలకు ప్రాధాన్యత నిస్తారు. సైద్ధాంతిక రంగంలో కమ్యూనిస్టులు శ్రామికవర్గ అంతర్జాతీయత ప్రాతిపదికగా శ్రమజీవుల ఐక్యతను కోరతారు. కాని ఫాసిస్టులు ఆర్యజాతి ఆధిపత్యాన్ని ఆరాధిస్తారు, ఇతర ప్రజలను బానిసలుగా పరిగణిస్తారు. అలాంటప్పుడు కమ్యూనిజానికి, ఫాసిజానికి సాపత్యమేమిటి?

కమ్యూనిజం అనేది మహత్తర ఫ్రెంచి విప్లవం నుండి ఉద్భవించిన మానవీయ సామాజిక ఆలోచనా వారసత్వం. దాన్నీ, ఫాసిజాన్ని ఒకే గాట కట్టడం అంటే ఈ వారసత్వాన్ని వమ్ముచేయడమే. మహత్తర కమ్యూనిజానికి మూలాలు - కొంతవరకు తొలిదశ క్రిస్టియానిటీలోని శ్రమ, సమానత్వ భావనల్లోనూ, యూరప్‌లోని పునర్వికాస ఉద్యమ బావాల్లోనూ, లౌకికమానవతా భావనల్లోనూ ఉన్నాయి. ఈ భావజాలాలనుండి అభివృద్ధి చెందిన కమ్యూనిజం నేడు వాటి భుజస్కంధాలపై నిలబడింది. ఈనాడు కమ్యూనిస్టు భావాలను ఖండించాలని ఇల్లెక్కి కూస్తున్న వారికి ఈ విషయాలన్నీ తెలుసు. అయినా వారిదంతా ఎందుకు చేస్తున్నారంటే వారికి ఈ పనిచేయమని అప్పగించారు, వారు చేస్తున్నారు అంతే. మానవత, ఆధునికత శక్తులను మానవతా - వ్యతిరేక శక్తులు నిరంతరం వ్యతిరేకిస్తూనే వున్నాయి. మానవతావాదం, అభివృద్ధి, నీతిలాంటి ఆశయాలు మానవ నాగరికతకు పుట్టిన రాక్షసపుండ్లుగా భావించేవారున్నారు. అందుకని వాటిని నాశనం చేయాలని వారు కోరుకుంటారు. ఇటువంటి ఆలోచన నుండే ఫాసిజం ఉద్భవించింది. విషయమేమిటంటే, ఈ ఫాసిస్టు భూతం నుండి నాడు ప్రపంచానికి విముక్తి ప్రసాదించిన కమ్యూనిజాన్ని ఖండించాలని నేడు ఎవరైతే ప్రయత్నిస్తున్నారో వారే ఈ ఫాసిస్టు శక్తులను తిరిగి పాతాళం నుండి బయటకు తీసి పునరావాసం కల్పించ జూస్తున్నారు. కమ్యూనిజాన్ని ఖండించడం, ధ్వంసం చేయడం అనే ఎత్తుగడలు నాజీ జర్మనీ నుండి స్వీకరించినవే. అటువంటి ప్రయత్నాలే నేడు తిరిగి చేయడమంటే సామాజిక ప్రగతిని, పునర్వికాస భావాలను, మానవత్వాన్ని అప్రతిష్ట పాలుచేయడమే. ఇలాంటి పనుల పర్యవసానం చరిత్రను చంపడం, మానవాళిని వ్యధ్య శిలపై పెట్టి నాశనం చేయడమేనని అనుభవం చెబుతోంది. అందువల్లనే కమ్యూనిజాన్ని, ఫాసిజాన్ని ఒకే గాటన కట్టే ఈ అసంబద్ధ పోలికలను రష్యన్ కమ్యూనిస్టుపార్టీ,

" ఆ ముసాయిదా తయారుచేసిన వారు ఒక విషయాన్ని అంగీకరి స్తున్నారు. అదే మంటే కమ్యూనిజం ప్రజలను ఆకర్షిస్తోంది, అది సజీవంగా ఉంది. ఆధునిక ప్రపంచ జీవితంలో ఒక అంతర్భాగంగా, ఆధునిక నాగరికత నుండి విడదీయ రానిదిగా అది ఉంది. కమ్యూనిస్టు భావం, ఆచరణ, దాని బలాన్ని చూసి వారు భయపడుతున్నారు. "

ఇతర ప్రగతిశీల రాజకీయ పార్టీలు సహించవు. ఇది కమ్యూనిస్టు వ్యతిరేకతను రెచ్చగొట్టే నీచమైన చర్యగా భావిస్తాయి.

కమ్యూనిస్టు వ్యతిరేకతను రెచ్చగొట్టే వారి ప్రధాన లక్ష్యాలు ఏమిటి? కమ్యూనిస్టు ఉద్యమ మొత్తం చారిత్రక వారసత్వాన్ని ధ్వంసం చేయడం, ప్రపంచ చరిత్రను మొత్తంగానే తిరిగి రాయడం. ఈ కమ్యూనిస్టు వ్యతిరేక తీర్మానం ప్రతిపాదించిన వారు ఒక చోట ఇలా రాసారు: "ఇటువంటి తప్పిదాలు భవిష్యత్తులో జరక్కుండా చూడాలంటే చరిత్ర గురించిన పరిజ్ఞానం మనకు అవసరం". నిజమే మరి గత నూటాయాభై సంవత్సరాలుగా కమ్యూనిజంతో ముడివడిన చరిత్ర మాటేమిటి? ఈ చరిత్రను విస్మరించడం ద్వారా ఈ దుష్ప్రచారకులు భవిష్యత్తును తమ సైద్ధాంతిక, రాజకీయ ఆలోచనా ధోరణిలో మలచ దలుచుకున్నారన్నమాట.

పెరుగుతున్న కమ్యూనిస్టు ప్రభావాన్ని సహించలేకే ఈ ప్రచారం

యూరప్ పార్లమెంటు రాజకీయ కమిషన్ నివేదిక రూపొందించిన వారు తమ అభిప్రాయాలను, చర్యలను దాచుకోవడం లేదు. గత కొద్ది సంవత్సరాలుగా కమ్యూనిస్టులను ఎంతగా వేధించినప్పటికీ కమ్యూనిజం భావం, ఆచరణ సజీవంగా వుండటం వారు మింగ లేక పోతున్నారు. ఆధునిక నాగరిక జీవితంలో కమ్యూనిస్టులు కీలకపాత్ర పోషిస్తున్నారు. వారి ముసాయిదా తీర్మానంలో ఒక వాక్యం ఇలా వుంది: "కొన్ని దేశాల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఇంకా వున్నాయి. కొన్ని దేశాల్లో కమ్యూనిస్టు కాలపు గతస్మృతులు ఇంకా బలంగా వున్నాయి. ఆ దేశాల్లో కమ్యూనిస్టులు తిరిగి వచ్చే ప్రమాదం వున్నది." కనుక ముసాయిదా ఆందోళనను వ్యక్తం చేసింది. "రాజకీయ రంగంలో ఇంకా క్రియాశీలంగా వున్న అనేక మంది రాజకీయ వేత్తలు ఎంతో కొంత మేరకు మాజీ కమ్యూనిస్టు ప్రభుత్వాలకు మద్దతునిస్తున్నారు." అని ముసాయిదా పేర్కొంది. "కమ్యూనిస్టు సిద్ధాంతంలోని సమానత్వం, సామాజిక న్యాయం అనేవి ఇప్పటికీ అనేక మంది రాజకీయ వేత్తలను ఆకర్షించుతున్నాయి." అని కూడా అది ఒప్పుకుంది. ఆ ముసాయిదా తయారుచేసిన వారు ఒక విషయాన్ని అంగీకరిస్తున్నారు. అదే మంటే కమ్యూనిజం ప్రజలను ఆకర్షిస్తోంది, అది సజీవంగా ఉంది. ఆధునిక ప్రపంచ జీవితంలో ఒక అంతర్భాగంగా, ఆధునిక నాగరికత నుండి విడదీయ రానిదిగా అది ఉంది.కమ్యూనిస్టు భావం, ఆచరణ, దాని బలాన్ని చూసి వారు భయపడుతున్నారు. అందు చేతనే ఎన్ని విపత్కర పరిణామాలు వచ్చినా ఫరవాలేదు కమ్యూనిస్టులను అణచివేయాలనే నిర్ధారణకు వారు వచ్చారు.

నివేదిక సమర్థకులు ఐరోపా చరిత్రను పూర్తిగా విస్మరించారు. ముఖ్యంగా 20వ శతాబ్దం మధ్యభాగంలో, ఫాసిజానికి వ్యతిరేకంగా సాగిన యుద్ధంలో పరిణామాలు వారి దృష్టిలో లేవు. ఫాసిజాన్ని ఓడించడంలో కమ్యూనిస్టు పార్టీల నిర్ణయాత్మక పాత్ర ఎలా విస్మరించగలరు? సోవియట్ కమ్యూనిస్టులు, సైనికులు, మార్షల్స్, ఇంకా ఆక్రమిత దేశాలలోని జాతీయ కమ్యూనిస్టు పార్టీలు, ప్రతిఘటనా శ్రేణుల పాత్రను చెరిపివేయలేరు. ఇటలీ, గ్రీస్, ఫ్రాన్స్, ఇతర ఐరోపా దేశాల్లో ఫాసిజానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు నిర్ణయాత్మక పోరాటాన్ని నిర్వహించారు. ఐరోపా ప్రజాస్వామ్య భవిష్యత్తుకు వారు చెల్లించిన మూల్యం అపారం. ఇటువంటి త్యాగం చేసిన ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీకి అపూర్వమైన రీతిలో సత్కారం జరిగింది. ఐరోపా అవతరణలో సోషలిస్టు దేశాలు ప్రముఖపాత్ర వహించాయి. ఒక అర్ధశతాబ్దం పాటు మరొక ప్రపంచ యుద్ధం జరగకుండా కమ్యూనిస్టులు నివారించారు. ఐరోపా భద్రత కోసం నికరంగా పోరాడింది సోవియట్ కమ్యూనిస్టులు. చివరి మాట, సోషలిస్టు, పెట్టుబడిదారీ సామాజిక వ్యవస్థల మధ్య జరిగిన పోటీయే పశ్చిమదేశాలు అనేక ప్రజాస్వామ్య సంస్థలను సృష్టించుకోడానికి, మెరుగుపరుచుకోడానికి కారణం. సామాజిక స్థిరత్వానికి అవి ప్రయత్నించడానికి కూడా ఈ పోటీమే కారణం. సోవియట్ అనుభవాల నుండి వారు చాలా నేర్చుకున్నారు.

అటువంటి ఐరోపా చరిత్రను అంత గొప్ప అనుభవాన్ని విస్మరించాలని ప్రపంచ ప్రజలకు ముసాయిదా తీర్మానం విజ్ఞప్తి చేస్తున్నది. కమ్యూనిస్టులను వారికిగల సైద్ధాంతిక విశ్వాసాల కారణంగా వెంటాడి వేధించమని పిలుపిస్తున్నది. అంతర్జాతీయ విచారణ, అంతర్జాతీయ ఖండనలు జరగాలని కోరుతున్నది. కమ్యూనిస్టు సిద్ధాంతం అనివార్యంగా భయోత్పాతం, నేరాలు, మానవ హక్కుల ఉల్లంఘనకు దారి తీస్తుందని దుష్ప్రచారం చేస్తున్నారు. కమ్యూనిజం నేరపూరితమైనదని, దాన్ని తుడిచిపెట్టాలని పిలుపునిస్తోంది. కొన్ని దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు బహిరంగంగా పనిచేస్తున్నాయని ముసాయిదాలో పేర్కొన్నారు. కమ్యూనిస్టు చిహ్నాన్ని బహిరంగంగా ఉపయోగిస్తున్నారని, కమ్యూనిజం చరిత్రలో ముడిబడిన స్మృతి చిహ్నాలు, వీధుల పేర్లు అన్నీ చెరిపి వేయాలని కోరుతున్నారు. అందుచేత కమ్యూనిస్టు చరిత్రను తిరగరాయాలని, వారితో సంబంధాలను తెంచుకోవాలని ముసాయిదా కోరుతున్నది. అంటే ఆధునిక యూరప్, యావత్ ఆధునిక ప్రపంచం, యావత్ నాగరికత, వారి చరిత్రను ఖండించాల్సిందిగా కోరుతున్నారన్న మాట.ఆ విధంగా వారు తమను తామే ఖండించుకుంటున్నారన్న మాట.

ఇది ప్రమాదకరమైన ప్రయత్నం. ఏదో ఒక రోజున ఇది వారికే ఎదురు తిరుగుతుంది. ఇక్కడ ఒక విషయాన్ని మీ దృష్టికి తీసుకువస్తున్నాను. ప్రధాన ఐరోపా రాజ్యాలు ఆసియా, ఆఫ్రికా, అమెరికాలలో సాగించిన వలస పాలన ఫలితంగా లక్షలు, కోట్లమంది వాటి పీడనకు గురయ్యారు. భారతదేశాన్నే చూడండి... ఇంగ్లాండు సాగించిన నరమేధం సంగతేమిటి? అమెరికాలో మూలవాసులను నిర్మూలించిన నరమేధం సంగతేమిటి? వియత్నాంలో అమెరికన్ ప్రజాస్వామ్యం సాగించిన యుద్ధం సంగతేమిటి? సోవియట్ రష్యాకు వ్యతిరేకంగా 14 ఐరోపా దేశాలు సాగించిన దురాక్రమణ పర్యవసానాలేమిటి? ఉత్తర రష్యాలో బ్రిటీష్ వారు నిర్మించిన నిర్బంధ శిబిరాలు ఎలా మర్చిపోగలం. 1920 దశకంలో పోలెండులో మృత్యు శిబిరాలను నిర్మించి వేల మంది సోవియట్ ఖైదీలను బలిగొన్నారు. స్వీడిష్ రాజులు ఉస్తావో అడాల్ఫ్, కారల్-12 ప్రష్యాకు చెందిన ఫ్రెడరిక్-2 , నెపోలియన్ - వీరందరూ ఐరోపాను

మృతదేహాలతో ముంచివేశారు కదా! ఆధునిక నాగరిక చరిత్రను తిరిగి రాయడానికి ఆ ముసాయిదా పరిమితం కాలేదు. కమ్యూనిస్టు ఉద్యమ చర్యలతో ఏమాత్రం సంబంధం లేని వారిని సైతం శిక్షించాలనే అంశాన్ని వారి ఎజెండాలో పెట్టారు. దానర్థం మానవాళి చరిత్రలో మొత్తం నాగరికతను తుడిచిపెట్టాలని వారు కోరుతున్నారన్నమాట. ఇది కనీవినీ ఎరుగని దుర్మార్గపు చర్య. ఈ ప్రక్షాళనా కార్యక్రమంలోకి అన్ని దేశాలను లాగి ఖండించాలని వారు చూస్తున్నారు. ఎందుకంటే కమ్యూనిస్టు ఉద్యమం సర్వాంతర్యామి. యావత్ నాగరికతకు అది పరివ్యాప్తమై వున్నది. అందువల్ల ప్రతీకార చర్యలకు అంతం లేకుండా పోతుంది.

ప్రపంచమంతటా కమ్యూనిస్టు పార్టీలు

కమ్యూనిస్టు పార్టీలు నేడు ప్రపంచమంతటా చట్టబద్ధంగా పనిచేస్తున్నాయి. మొనాకో లాంటి అతి కొద్ది దేశాలను మినహాయిస్తే ఐరోపా దేశాలన్నిటిలోనూ కమ్యూనిస్టు పార్టీలు పనిచేస్తున్నాయి. ఫ్రాన్స్, ఇటలీ, పోర్చుగల్, గ్రీస్, బల్గేరియా, స్పెయిన్, జక్‌రిపబ్లిక్, స్లోవాకియా, సైప్రస్, లాట్వియా, సాన్‌మారినో, రష్యా దేశాల పార్లమెంటులలో వారికి తగినంత ప్రాతినిధ్యం వున్నది. ఐరోపా పార్లమెంటులో దానికి ప్రాతినిధ్యమున్నది. ఐరోపా రాజకీయ కమిషన్‌లో కూడా వారు అంతర్భాగమే. డెన్మార్క్, నార్వే, ఫిన్లాండ్, స్వీడన్, ఫ్రాన్స్, స్పెయిన్, సైప్రస్, పోర్చుగల్, ఇటలీ, జక్‌రిపబ్లిక్, రష్యా, ఉక్రెయిన్, ఇతర దేశాలకు చెందిన కమ్యూనిస్టు, వామపక్షాల పార్లమెంటు సభ్యులు "ఐక్య వామపక్ష గ్రూపుగా వ్యవహరిస్తున్నారు. 1990 నుండి 20 వరకు ఒక దశాబ్దకాలం ఎన్నికల బలాబలాలను పరిశీలించండి. వారి బలం 7 శాతం నుండి 15.3 శాతానికి పెరిగింది. ప్రతి 5 మంది యూరప్ ఓటర్లకు ఒకరు కమ్యూనిస్టులకు ఓటు వేశారు. కమ్యూనిస్టుల, వామపక్షాల ప్రభావం పెరుగుతున్నది. మాల్డీవియాలో నేడు కమ్యూనిస్టులు అధికారంలో వున్నారు. సైప్రస్‌లో మిత్రమ మంత్రివర్గంలో వారు భాగస్వాములు. 11 మంది కేబినెట్‌లో నలుగురు కమ్యూనిస్టులున్నారు. జర్మనీ ఎన్నికల్లో కమ్యూనిస్టుల ప్రాతి నిధ్యం పెరిగింది.

ఆసియా ఖండాన్నే తీసుకోండి! ఆ దేశాల ప్రజా జీవితంలో కమ్యూనిస్టులు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తున్నారు. చైనా, ఉత్తర కొరియా, వియత్నాంలలో కమ్యూనిస్టులు అధికారంలో వున్నారు. భారతదేశంలో కమ్యూనిస్టులు బలమైన స్థానంలో వున్నారు. జపాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో క్రియా శీలంగా పనిచేస్తున్నారు. ఈ దేశాలన్నింటిలో చట్టసభలో వారికి స్థిరమైన ప్రాతినిధ్యమున్నది. ఆఫ్రికా, మధ్యప్రాచ్యం, ఆస్ట్రేలియాలో కమ్యూనిస్టు పార్టీలు క్రియాశీలంగా వున్నాయి. దక్షిణాఫ్రికాలో పాలకమిత్రమ మంత్రి వర్గంలో కమ్యూనిస్టులు భాగస్వామ్యంగా వున్నారు. సిరియా, మొరాకో, ఇజ్రాయిల్ పార్లమెంటులలో కమ్యూనిస్టులు క్రియాశీలంగా పనిచేస్తున్నారు. ఉత్తర, దక్షిణ అమెరికా దేశాల్లో మనకు అటువంటి దృశ్యమే సాక్షాత్కరిస్తున్నది. క్యూబాలో కమ్యూనిస్టులు అధికారంలో వున్నారు. ఉరుగ్వే, గౌతమాలా, బ్రెజిల్, వెనిజులా, పనామా దేశాల జాతీయ పార్లమెంటులలో కమ్యూనిస్టులకు ప్రాతినిధ్యం వున్నది. డజన్ల సంఖ్యలో కమ్యూనిస్టు పార్టీలను, లక్షలాది మంది కమ్యూనిస్టులను, కోట్లాదిమంది వారి మద్దతుదారులను మీరు వెలివేస్తారా? వారిపై విచారణ జరిపిస్తారా?

ముసాయిదా తీర్మానం రచయితలు ఒక వాస్తవాన్ని మర్చిపోయినట్లున్నారు. ప్రపంచ సమాజాన్ని ముక్కలు చేసే ఆలోచన వారికి వున్నదా? 1. యూరప్ దేశాలలో అటువంటి విభజన ఎక్కడకు దారితీస్తుంది. అక్కడ కమ్యూనిస్టు ఉద్యమం, ప్రజామద్దతు కలిగిన ఒక పెద్ద రాజకీయ ఉద్యమం. 2. పశ్చిమ దేశాలకు, చైనాకు మధ్య ఘర్షణను పెంచే ప్రయత్నమున్నది. చైనా తన కమ్యూనిస్టు లక్షణాలను విడనాడటానికి సిద్ధంగా లేదు. కమ్యూనిస్టు సిద్ధాంత పునాదులకు అది కట్టుబడివున్నది. 3. సోవియట్ అనంతర దశలో కొత్త సంఘర్షణలు సృష్టించడానికి ఈ ముసాయిదా ప్రయత్నిస్తోంది. ఎందుకంటే కమ్యూనిస్టు పార్టీలనేగాక ఆ తరువాత ఏర్పడిన రాజకీయ సంస్థలను కూడా దెబ్బతీయడం లక్ష్యంగా పెట్టుకున్నది.

సోషల్ డెమోక్రటిక్ పార్టీలపైన కూడా దాడి

ఈ పరిణామాల పర్యవసానమేమిటి? ఒక విషయం స్పష్టమౌతున్నది. ఫాసిస్టు మూడవ రీచ్ ఆలోచన, ఆచరణ తిరిగి పునరుద్ధరించబడుతున్నది. కమ్యూనిజంతో సంబంధం వున్న ప్రతిదాన్నీ ధ్వంసం చేయాలనే ఆలోచన ఈ విషప్రచారకులకున్నది. కేవలం కమ్యూనిస్టులపైనే దాడికి వారు సిద్ధం కావటం లేదు. సోషలిస్టు పార్టీలు, సోషల్ డెమోక్రటిక్ పార్టీలపైనా, రెండవ ఇంటర్నేషనల్‌పైనా కూడా దాడి ఎక్కుపెట్టారు. కమ్యూనిస్టు సిద్ధాంతం, కమ్యూనిస్టు ఉద్యమం నేరస్తులని ప్రకటించటంలో వారి అర్థం ఏమిటి? కమ్యూనిస్టు సిద్ధాంతానికి మూలమైన మార్క్సిజం కూడా నేరపూరితమైనదా? కాని మార్క్సిజం అనేది కమ్యూనిస్టులకు మాత్రమే కాకుండా సోషల్ డెమోక్రాట్లకు కూడా అది పునాదేకదా! మార్క్సిజం ఒక ప్రపంచ దృక్పథం. ఈ రోజున కమ్యూనిస్టులు రేపు సోషల్ డెమోక్రాట్లు. ఆ వరుసలో అందరూ నేరపూరిత ఉద్యమంలో భాగస్వాములేనా? చరిత్రకు వ్యతిరేకంగా వారు పోరాడు తున్నారు. వారనుకున్నట్లుగా, వారి పద్ధతిలో చరిత్రను తిరగరాయాలని ప్రయత్నిస్తున్నారు.

> **"కమ్యూనిజంతో సంబంధం వున్న ప్రతిదాన్నీ ధ్వంసం చేయాలనే ఆలోచన ఈ విషప్రచారకులకున్నది. కేవలం కమ్యూనిస్టులపైనే దాడికి వారు సిద్ధం కావటం లేదు. సోషలిస్టు పార్టీలు, సోషల్ డెమోక్రటిక్ పార్టీలపైనా, రెండవ ఇంటర్నేషనల్‌పైనా కూడా దాడి ఎక్కుపెట్టారు."**

ఇటువంటి ప్రపంచవ్యాపిత కమ్యూనిస్టు వ్యతిరేక ఉద్యమానికి తీవ్రమైన ప్రతిఘటన వస్తుందనే విషయంలో నాకు సందేహం లేదు. ఇప్పటికే ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీ, గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ, స్లొవేక్ కమ్యూనిస్టు పార్టీ, ఆర్మీనియా, అజర్‌బైజాన్, ఉక్రెయిన్, బైలోరష్యా కమ్యూనిస్టులు, సైప్రస్ పార్టీ, ఇంకా ఇతర పార్టీలువివిధ రూపాల్లో నిరసనలు తెలియజేశాయి. సోషల్ డెమోక్రటిక్ సంస్థలు, వర్కర్స్ పార్టీలు, ఉద్యమాలు ఈ పోరాటంలో భాగస్వాములవుతాయి. యూరప్ పార్లమెంటు అసెంబ్లీ కౌన్సిల్‌కు చెందిన రాజకీయ కమిషన్ రెచ్చగొట్టే చర్యలను ఎదుర్కొంటాం. నేటి వామపక్షం అప్రమత్తంగా వ్యవహరిస్తున్నది. అమెరికన్ తరహా ప్రపంచీకరణ నేటి అంతర్జాతీయ స్థితిలో ఫాసిజాన్ని పోషించే ప్రయత్నంలో వున్నది. ఈ ప్రయత్నాలను వమ్ముచేయటమే నేడు మనముందున్న సవాల్.

చర్చ

హరికేన్ కత్రినా నేర్పుతున్న పాఠాలు

ఎస్. వెంకట్రావు


కత్రినా విలయంపై ప్రపంచ వ్యాపితంగా మీడియాలో చర్చ జరుగుతున్నప్పటికీ అమెరికా మీడియాలో చర్చ చాలా ఆసక్తికరంగా నడుస్తోంది. అక్కడి పత్రికలు, టివి ఛానళ్లు, రాజకీయ వ్యాఖ్యాతలు చెబుతున్న విషయాలు, చర్చకు తెస్తున్న అంశాలు అగ్రరాజ్య వాస్తవరూపాన్ని గూర్చి అర్థం చేసుకోడానికి మనకు తోడ్పడతాయి.

ఇటీవల అమెరికా తీరాన్ని తాకి, మూడు రాష్ట్రాల్లో బీభత్సం సృష్టించిన హరికేన్ 'కత్రినా'పై ఆ దేశపు మీడియాలో జరిగిన చర్చ అమెరికా సమాజం నేడెదుర్కొంటున్న అనేక సమస్యలను ముందుకు తెచ్చింది. ఏకధృవ ప్రపంచంలో ఎదురులేని శక్తిగా, భూగోళాన్ని తన గుప్పెట్లో పెట్టుకుని ఆడించగల మహా శక్తిగా అందరూ భావిస్తున్న అమెరికా లోగుట్టును ఈ తుపాను ప్రపంచానికి నగ్నంగా చూపెట్టింది. ఆర్థికంగా, సైనికంగా, సాంకేతికంగా అజేయమైన శక్తిగా కనిపిస్తున్న ఆ సమాజం లోలోన ఎంతగా కుళ్లి పోతోందో లోకానికి వెల్లడించింది. కత్రినా విలయంపై ప్రపంచ వ్యాపితంగా మీడియాలో చర్చ జరుగుతున్నప్పటికీ అమెరికా మీడియాలో చర్చ చాలా ఆసక్తికరంగా నడుస్తోంది. అక్కడి పత్రికలు, టివి ఛానళ్లు, రాజకీయ వ్యాఖ్యాతలు చెబుతున్న విషయాలు, చర్చకు తెస్తున్న అంశాలు అగ్రరాజ్య వాస్తవరూపాన్ని గూర్చి అర్థం చేసుకోడానికి మనకు తోడ్పడతాయి. అమెరికాలో పేదరికం, జాతివివక్ష, ఆర్థిక పరిస్థితి, ఇరాక్ యుద్ధం, బుష్ నయా-ఉదార వాద విధానాల పర్యవసానాలు, అమెరికా సమాజంలో పతనమౌతున్న నైతిక విలువలు...ఒకటేంటి అనేక అంశాలపై చర్చ సాగుతోంది. బుష్ ప్రభుత్వమూ, ఆయనకు ముందున్న అమెరికా ప్రభుత్వాలూ ప్రపంచదేశాలకు, ప్రజలకు ఏవైతే ఉపదేశాలు చేస్తూవచ్చారో ఆ ఉపదేశాలు ఇప్పుడు అమెరికాకే చేయాల్సిన పరిస్థితిని కత్రినా మనకళ్లకు కడుతుంది. అమెరికా బాటలో నడవాలనుకుంటున్న వారికి, ఆ 'స్వర్గానికి' చేరుకోవాలనుకునే వారికి దీనినుండి చాలా గుణపాఠాలు కూడా లభిస్తాయి.

ఆగస్టు 29వ తేదీన 'కత్రినా' ప్రచండ వేగంతో సుడులు తిరుగుతూ అమెరికాలోని ల్యూసియానా రాష్ట్రానికి చెందిన న్యూ ఆర్లీన్స్ నగరాన్ని తాకింది. ల్యూసియానా, మిసిసిపి, అలబామా రాష్ట్రాలను ముంచెత్తిన కత్రినా విలయంలో వేలాదిమంది మరణించారు, సుమారు 10,000 కోట్ల డాలర్ల నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా. న్యూ ఆర్లీన్స్ నగరం 20 అడుగుల లోతు నీళ్లలో మునిగిపోయింది. ఈ నగరం సముద్రమట్టానికి పదడుగుల లోతులో ఉంది. దీనికి పక్కనే ఉన్న పోంచర్‌ట్రైన్ సరస్సులోని నీళ్లు నగరంలోకి ప్రవేశించకుండా నిర్మించిన కరకట్టలు ఎక్కడికక్కడ తెగిపోవడంతో నగరం ఒక పెద్ద సరస్సుగా మారిపోయింది. ఈ నగరం నుండి నీళ్లు బయటకు పోవాలంటే కనీసం రెండు మాసాలు పెద్దపెద్ద మోటార్లతో తోడాల్సి ఉంటుంది. కత్రినా సృష్టించిన విలయానికి మూడు రాష్ట్రాల్లోని ప్రజలు ముఖ్యంగా న్యూ ఆర్లీన్స్ నగర ప్రజలు శరణార్థులుగా మారిపోయారు. లక్షలాది కుటుంబాలు పిల్లాపీచుతో టెక్సాస్ తదితర రాష్ట్రాల్లో తలదాచుకోవలసిన పరిస్థితి ఎదురైంది. బహుశా రెండు సంవత్సరాల వరకు ఈ ప్రజలు తిరిగి తమ స్వస్థలాలకు రావడం కుదరకపోవచ్చు. చాలామంది శాశ్వతంగా రాకపోవచ్చు కూడా.

ఇంత పెద్ద ప్రకృతి విపత్తు సంభవించినప్పుడు ప్రజలు ఈతిబాధలు ఎదుర్కోవడం సహజమే. కాని కత్రినా విలయం సందర్భంగా జరిగిన మరికొన్ని ఘటనలు అసలు చర్చకు కారణమయ్యాయి. కత్రినా పెద్ద ఎత్తున ప్రజలపై విరుచుకు పడుతోందని అయిదు రోజుల ముందునుండే తెలిసినప్పటికీ బుష్ ప్రభుత్వం ప్రజలను రక్షించడానికి ఎటువంటి

చర్చలో పాల్గొన్న కొందరు పాత్రికేయులు



చర్యలూ తీసుకోలేదు. న్యూ ఆర్లీన్స్ ప్రజలు ఇళ్లు ఖాళీచేయాలని మేయర్ రే నాగిన్ 28వ తేదీన ప్రకటించి చేతులు దులుపుకున్నాడు. నగర ప్రజల్లో కార్లు, డబ్బు ఉన్న వారంతా పారిపోయారు. అవి లేనివారంతా ముఖ్యంగా పేద నల్లజాతివారు, మెక్సికో తదితర దేశానుండి వచ్చిన హిస్పయానిక్స్ ప్రజలు ఇళ్లలోనే ఉండిపోయారు. సముద్రం-నేల ఏకంకాగా శక్తి ఉన్న వారంతా భవనాల పైకి చేరుకున్నారు. శక్తిలేనివారు, ముసలివారు, రోగులు తామున్న మంచాలమీదనే జలసమాధి అయిపోయారు. ధనికులు పేద ప్రజలను వదిలిపెట్టి పారిపోతే, శక్తి ఉన్నవారు శక్తివిహీనుల్ని వదిలి పోయారు. చాలామంది ముసలివారు వీల్ ఛైర్లలో అలాగే చనిపోయారు. కత్రినా వెళ్లిపోయిన మూడు రోజుల వరకు ఈ జాతీయ విపత్తు పట్ల బుష్

ప్రభుత్వం చేష్టలుడిగి ఉండిపోయింది. ఒక వైపు లక్షలాది మంది ప్రజలు దాహం, ఆకలితో అల్లాడిపోతుంటే సెనెటర్ జాన్ మెక్కైన్ 69వ జన్మదిన ఉత్సవాల్లో అధ్యక్షుడు జార్జి బుష్ పాల్గొంటూ కేక్ కట్ చేసి మీడియాకు పోజులిస్తూ కనిపించారు. ఉపాధ్యక్షుడు డిక్ చెనీ, వయోమింగ్‌లో విశ్రాంతి తీసుకుంటూ 29లక్షల డాలర్ల ఎస్టేట్ కొనుగోలు కోసం బేరాలు సాగిస్తు న్నారు. అదే సమయంలో విదేశాంగ మంత్రి కండొలిజా రైస్ ఈవెనింగ్ షాపింగ్ చేస్తూ మీడియా కంటపడ్డారు. ప్రకృతి విలయం జరిగిన రెండు రోజులకు అధ్యక్షుడు బుష్ విమానం నుండి దిగకుండానే న్యూ ఆర్లీన్స్ నగరాన్ని విమానం కిటికీలగుండా చూస్తున్న దృశ్యాన్ని పత్రికలన్నీ ప్రముఖంగా ప్రచురించాయి. దానిపై తీవ్ర విమర్శలు వచ్చాక అయిదో రోజున ఆయన మరోసారి నగరానికి వచ్చి ఈసారి న్యూ ఆర్లీన్స్ నగరంలో దిగారు. అయితే విమానాశ్రయం టెర్మాక్‌మీద ఆయన వేసిన జోకులు నవ్వుపుట్టించకపోగా బాధపడు తున్న ప్రజలకు పుండుమీద కారం చల్లినట్ల యింది. ఇదంతా జరుగుతుండగా ప్రజలు ఆకలితో, అనారోగ్యంతో రోజులతరబడి అల్లాడిపోయారు. ఇళ్లులేనివారంతా సూపర్ డోమ్ స్టేడియంలో తలదాచుకున్నారు. ఆహారం కోసం, సరుకుల కోసం లూటీలు జరిగాయి, మహిళలపై అత్యాచారాలు, దౌర్జన్యాలు, కొట్లాటలు, దొమ్మీలతో నగరం రెండు రోజుల పాటు అట్టుడికిపోయింది. మృత్యు శయ్యలమీద ఉండి ఊపిరిపోక, బతకలేక నరకయాతన అనుభవిస్తున్న చాలామంది రోగులకు డాక్టర్లు హైడోస్ మార్ఫిన్ ఇంజక్షన్లు ఇచ్చి చంపేశారు. మూడు రోజులపాటు నగరంలో అరాచకం, ఆకలి, అనారోగ్యం రాజ్యమేలింది. నగరంలోని ఒక ఆసుపత్రిలోకి నీళ్లు వచ్చేయడంతో 40 మంది రోగులను అక్కడే వదిలి డాక్టర్లు, నర్సులు పారిపోయారు. రోగుల శవాలు ఆసుపత్రిలో అలాగే ఉండిపోయాయి. బతికి ఉన్నవారు, రోజుల తరబడి నీళ్లలో కుళ్లిపోయిన శవాలతో సహవాసం చేయాల్సివచ్చింది. ఈ విషయాలన్నీ అమెరికా మీడియాలోనూ, ప్రపంచ వ్యాపితంగానూ ప్రసారమయ్యాయి. ఆహారం కోసం బారులుతీరిన ప్రజలు, అరాచకం, లూటీలు, వీల్ ఛైర్లలో వదిలేయబడిన రోగుల శవాలు వీటన్నిటినీ అమెరికా ప్రజలు, ప్రపంచమంతా వీక్షించింది. ఈ మొత్తం వ్యవహారంపై అమెరికా మీడియా తీవ్రంగా స్పందించింది. ఈ సందర్భంగా మితవాద, అతివాద మీడియా అన్న తేడా లేకుండా బుష్ వ్యవహరించిన తీరును విమర్శించాయి. సెప్టెంబర్ నెలంతా అమెరికా పత్రికలు, టీవీలు ఈ అంశం మీద చర్చనడిపాయి. బహుశా ఈ చర్చ ఇప్పట్లో అంతం కాకపోవచ్చు. కాని ఇప్పటివరకు జరిగిన చర్చను పరిశీలిస్తే మనకు కొన్ని ముఖ్యమైన విషయాలు అర్థమవుతాయి.

“ ఆహారంకోసం బారులుతీరిన ప్రజలు, అరాచకం, లూటీలు, వీల్ ఛైర్లలో వదిలేయబడిన రోగుల శవాలు వీటన్నిటినీ అమెరికా ప్రజలు, ప్రపంచమంతా వీక్షించింది. ఈ మొత్తం వ్యవహారంపై అమెరికా మీడియా తీవ్రంగా స్పందించింది. ఈ సందర్భంగా మితవాద, అతివాద మీడియా అన్న తేడా లేకుండా బుష్ వ్యవహరించిన తీరును విమర్శించాయి. ”

చేష్టలుడిగిన ప్రభుత్వం

కత్రినా విలయం సందర్భంగా బుష్ ప్రభుత్వం పక్షవాతం వచ్చినట్లు చేష్టలుడిగి ఎలా ఉండిపోయిందో వివరిస్తూ సెప్టెంబర్ 5వ తేదీన న్యూయార్క్ టైమ్స్ ఎడిటోరియల్ కాలమిస్టు పాల్ క్రూగ్‌మాన్ ఇలా రాశారు: “కత్రినా విలయం తరువాత గడిచిన ప్రతిదినం మనకు కేంద్ర ప్రభుత్వ అధికారుల ప్రాణాంతక అలసత్వాన్నే తెలియజేస్తోంది. ఈ విషయంలో నేను రాష్ట్ర, స్థానిక అధికారులను నిందించ దలుచుకోలేదు. కాని కేంద్ర ప్రభుత్వాధికారుల దగ్గర వనరులున్నాయి. వాటిని ఉపయోగిస్తే ఇంత భయానక వాతావరణం ఉండేది కాదు.” బుష్ ప్రభుత్వాధికారులకు ‘విచిత్రమైన పక్షవాతం’ వచ్చింది అని న్యూస్ వీక్ రాసింది. న్యూ ఆర్లీన్స్ హరికేన్‌ను 1991 బంగ్లాదేశ్ తుపానుతో పోలుస్తూ సెప్టెంబర్ 6న న్యూయార్క్ టైమ్స్‌లో నికోలాస్ క్రిస్టాఫ్ ఈ విధంగా రాశాడు: “పేద అమెరికన్లకు సహాయ పడడంలో బుష్ ప్రభుత్వం తాత్సారం, అసమర్థత ప్రదర్శించింది. 1991లో బంగ్లాదేశ్‌లో ఇలాంటి తుపానే 1,30,000 మంది ప్రజలను పొట్టనబెట్టుకున్నప్పటి భయానక పరిస్థితిని న్యూ ఆర్లీన్స్ దృశ్యాలు నాకు గుర్తుకు తెచ్చాయి. కాని తేడా ఏమిటంటే ఆనాడు బంగ్లాదేశ్ ప్రభుత్వం పేద ప్రజలను కాపాడ్డానికి ఇప్పటికన్నా ఎక్కువగా ప్రయాసపడింది.” మారీన్ దౌద్ అనే వ్యాఖ్యాత సెప్టెంబర్ 3న అదే పత్రికలో “యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ షేమ్” (సిగ్గుమాలిన సంయుక్త రాష్ట్రాలు) అన్న శీర్షికకింద చాలా తీవ్రమైన పదజాలంతో బుష్ ప్రభుత్వ అలసత్వాన్ని విమర్శించింది. “పరిమిత ప్రభుత్వాన్ని, చేతగాని ప్రభుత్వంతో కలిపార నుకోండి అప్పుడు ప్రాణాంతకమైన ఫలితం వస్తుంది. అమెరికా మరోసారి పెద్ద నాగుపాము పుట్టలో పడిపోయింది. అరాచకం, హత్యలు, లూటీలు, రేప్‌లు, గూండాల స్వైరవిహారం, అమాయకుల హాహాకారాలు, చెదిరిపోయిన సదుపాయాలు, కకావికలమైన పోలీసుబలగాలు, సరిపడని సైన్యం, క్షంతవ్యంగాని ప్రభుత్వ నిర్లక్ష్యం....అన్నీ ఒక్కసారి కలగలిసి దేశాన్ని పెద్ద అగాథంలోకి నెట్టాయి” అని ఆమె రాస్తూనే ఆడలేక మద్దెల ఓడంటున్న బుష్ ప్రభుత్వాధి కారులను కడిగిపెట్టింది. న్యూ ఆర్లీన్స్‌లో “కరకట్టలకు గండ్లు పడతాయని ఎవరనుకుంటారు” అని ఉపాధ్యక్షుడు డిక్ చినే చేసిన వ్యాఖ్యానానికి ఆమె గట్టిగా బదులిస్తూ “విమానంతో భవనాన్ని ఢీకొట్టించి ఓసామాబిన్ లాడెన్ మన దేశం మీద దాడిచేస్తాడని ఎవరికి తెలుసు అనేవారు 9/11కు ముందు గూఢచారి నివేదికలు ఎప్పుడన్నా చదివారా? ఇరాక్‌లో అమెరికా దురాక్రమణ వల్ల అక్కడ ఉగ్రవాదం ప్రబలుతుందని ఎవరికి తెలుసు అంటున్నవారు యుద్ధానికి ముందు సిఐఎ తయారుచేసిన నివేదికలు చదివారా? తీవ్రమైన హరికేన్ వస్తే న్యూ ఆర్లీన్స్ కరకట్టలు తెగిపోతాయని ఎవరికి తెలుసు అంటున్నవారు అంతకుముందు ఏళ్లతరబడి అనేకమంది చేసిన హెచ్చరికలను చదివారా?” అని ప్రశ్నించింది. వాషింగ్టన్ పోస్ట్, యుఎస్ఎ టుడే, ఇంకా స్థానిక పత్రికలన్నీ బుష్ ప్రభుత్వ క్షంతవ్యంకాని నిర్లక్ష్యాన్ని ఎండగట్టి వదిలాయి. చివరికి బుష్ ప్రభుత్వానికి వంత పాడే వాల్‌స్ట్రీట్ జర్నల్ కూడా “ఇప్పుడు అమెరికన్లు కోరుకుం టున్నదేమిటంటే, తమ ప్రభుత్వం సవాలు

"నిజానికి న్యూ ఆర్లీన్స్‌లో ప్రజలకు సహాయ చర్యలు అందించడంలో బుష్ ప్రభుత్వం చూపించిన అశ్రద్ధకన్నా కూడా ఈ సందర్భంలో అమెరికా ప్రజలు ముఖ్యంగా నల్లజాతి వారు ఒక వర్ధమాన దేశంలోని పేద అభాగ్యుల మాదిరిగా ప్రపంచానికి దర్శనమివ్వడం చాలామంది అమెరికన్లను బాధించినట్లుంది. మీడియాలో ఈ అంశంపై పలువురి ప్రతి స్పందనలు చూస్తే మనకు అదే అనిపిస్తుంది."

తీవ్రతను అర్థంచేసుకుని దాన్ని ఎదుర్కొనడానికి గట్టిగా కృషి చేయాలని" అంటూ సున్నితంగా హెచ్చిరించింది. బుష్ ప్రభుత్వ చేతగాని తనం పట్ల ప్రజల్లో వస్తున్న నిరసనలే మీడియాలో ప్రతిఫలించాయి.

ఇరాక్ యుద్ధ ప్రభావం

కత్రినా విలయాన్ని ఎదుర్కోవడంలో బుష్ ప్రభుత్వం చేష్టలుడిగి ఉండిపోవడానికి కారణమేమిటి? ఒకటి కాదు రెండు కారణాలు. అందులో ఒకదాని గురించి న్యూయార్క్‌టైమ్స్ ఎడిటోరియల్ (సెప్టెంబర్ 2) ఇలా చెప్పింది: "లూసియానా నేషనల్ గార్డుల్లో మూడో వంతు మంది, వీరికన్నా ఎక్కువ సంఖ్యలో మిసిసిపి నేషనల్ గార్డులు ఇరాక్‌లో యుద్ధం చేస్తూ ఉన్నారు... ఈ నేషనల్ గార్డుల్లో చాలామంది రాష్ట్రాల్లోని పోలీసు, పారా మెడికల్, అగ్నిమాపక శాఖల్లో తమ పూరి కాలం ఉద్యోగాలను వదిలిపెట్టి పార్ట్‌టైమ్ ఉద్యోగులుగా అక్కడకు వెళ్లారు." ఇప్పటికే ఇరాక్‌లో దెబ్బతిన్నాం అనుకుంటున్న అమెరికన్లు స్వదేశంలోకూడా ప్రకృతి విపత్తుపై ప్రభుత్వం కదలకపోవడాన్ని జీర్ణించుకో లేకపోతున్నారు అని పత్రిక రాసింది. "మంచినీళ్లు లేక, వైద్యం అందక, సమయానికి రక్షించేవారు లేక ప్రజలు చచ్చిపోయారు. ముఖ్యంగా పేదలు, ముసలివారు చచ్చిపోయారు. పైగా వారంతా పేదలు, నల్ల జాతివారు కావడం విశేషం. రేప్‌లు, కొట్లా టలు, దౌర్జన్యాలు యథేచ్ఛగా సాగిపోయాయని నగర పోలీసు చీఫ్ చెప్పారు" అని పేర్కొంటూ ఇరాక్ వెళ్లిన నేషనల్ గార్డులు ఉండి ఉంటే కీలకమైన సమయంలో అనేక ప్రాణాలు కాపాడేవారని పత్రిక రాసింది. ఒక్క నేషనల్ గార్డులు మాత్రమే కాదు హై-వాటర్ వెహికిల్స్, ఇరత పరికరాలు కూడా ఇరాక్‌లో ఉండిపోవడం వల్ల ఉన్న నేషనల్ గార్డులుకూడా ఏమీ చేయలేక చూస్తూ ఉండి పోవలసి వచ్చింది. ఇరాక్ యుద్ధ ఖర్చులు, జాతీయభద్రతా (9/11 తరువాత పెరిగిన) ఖర్చుల వల్ల నగరంలో కరకట్టల పటిష్టీకరణకు డబ్బులేకుండా పోయిందని న్యూ ఆర్లీన్స్‌కు చెందిన 'టైమ్స్-పికయునె' పత్రిక రాసింది. నగరంలో వరద నివారణకోసం ఏర్పాటు చేసిన ఆర్మీ కాప్స్‌కు నిధులు తగ్గడం వల్ల చాలామంది నిపుణులైన వారు రాజీనామా చేయడం కూడా ఈ దుస్థితికి కారణం అని పత్రికలు రాశాయి. ఇరాక్‌యుద్ధంలో బుష్ ప్రభుత్వం చేసిన తప్పులను, కత్రినా సందర్భంగా చేసిన తప్పులతో పోలుస్తూ మారీన్ దౌద్ ఇలా రాసింది: "బుష్ ప్రభుత్వం తన విదేశాంగ శాఖ ప్రణాళికలనూ, తిరుగుబాటు లేస్తుందన్న సిఐఎ హెచ్చరికలనూ గాలికి వదిలి ఇరాక్‌లో దురాక్రమణకు పాల్పడి పీకల్లోతు ఊబిలో కూరుకుపోయింది. కాని అక్కడ పొరపాట్లవల్ల జరుగుతున్న మానవసంహారాన్ని అధ్యక్షభవనం కప్పిపుచ్చగలుగుతోంది. అమెరికా అధ్యక్షుడు సైనికుల అంతిమయాత్రలకు వెళ్లకుండా జాగ్రత్తపడుతున్నాడు. రక్షణ శాఖ కార్యాలయం ఇరాక్‌నుండి వస్తున్న శవపేటికల లెక్క బయటకు పొక్కకుండా వార్తలపై సెన్సార్ విధిస్తోంది. ఇక ఇరాక్‌లో ఎంతమంది పౌరులు మరణిస్తున్నారో బయటి ప్రపంచానికి వెల్లడించ డమే లేదు. ఈ విధంగా బుష్ ప్రభుత్వం శవాలమీద దుప్పటికప్పి ఇరాక్‌లో తమ తప్పిదాలను కప్పిపుచ్చుకోవచ్చుగాక కాని ఇక్కడ అలా తప్పించుకోడానికి లేదు. జలప్రళయంలో అధ్యక్షుని నిర్లక్ష్యం వల్ల చనిపోయిన వారి మృత దేహాలు మన కళ్లముందే తేలి యాడు తున్నాయి... ప్రపంచంలో అమెరికా ఆధిపత్యానికి తిరుగు లేదు అన్న భావన చుట్టూ అమెరికా విదేశాంగ విధానం మొత్తం తిరుగుతుంది. మనమే అందరికీ ఆదర్శం అని, మనలాగే ఉండాలని ప్రపంచంలో అందరూ భావిస్తు న్నారని అనుకుంటుంటాం. కాని ప్రపంచ ప్రజలు ఇరాక్‌ను చూస్తున్నారు. అక్కడ వారికి మనమెలాంటి స్వేచ్ఛ ఇచ్చామో చూస్తున్నారు. మనం సృష్టించిన గందరగోళం, భాతృహత్యలు చూస్తున్నారు. వారు న్యూ ఆర్లీన్స్‌లోకూడా అదే తంతు చూస్తున్నారు. అసమర్థత, జాతివివక్ష చూస్తున్నారు. ధనికులైన తెల్లజాతీయులు తప్పుకుపోయి పేద నల్లజాతి ప్రజలను దయ నీయమైన చావుల బారిన పడేసిన దృశ్యాలను చూస్తున్నారు."

పేదరికం, జాతి వివక్ష

విచిత్రంగా, కత్రినాపై చర్చ అమెరికాలో పేదరికంపైకి, దారుణంగా ఉన్న జాతివివక్షపైకి అందరి దృష్టిని మళ్లించింది. నిజానికి న్యూ ఆర్లీన్స్‌లో ప్రజలకు సహాయ చర్యలు అందించడంలో బుష్ ప్రభుత్వం చూపించిన అశ్రద్ధకన్నా కూడా ఈ సందర్భంలో అమెరికా ప్రజలు ముఖ్యంగా నల్లజాతివారు ఒక వర్ధమాన దేశంలోని పేద అభాగ్యుల మాదిరిగా ప్రపంచానికి దర్శనమివ్వడం చాలా మంది అమెరికన్లను బాధించినట్లుంది. మీడియాలో ఈ అంశంపై పలువురి ప్రతి స్పందనలు చూస్తే మనకు అదే అనిపిస్తుంది. "హరికేన్ కత్రినా ఫలానా వాళ్లనే దెబ్బ తీయాలని అనుకోలేదు. కాని హరికేన్ తరువాత ఎటువంటి సహాయం అందక అల్లాడుతున్న వారంతా నల్లజాతి వారు, పేదవారు కావడమే విశేషం. న్యూ ఆర్లీన్స్ నుండి వస్తున్న ఫోటోలలో కనిపిస్తున్న దృశ్యాలన్నీ ఒకేలాగా ఉన్నాయి- విచారంగా, నిరాశతో నిట్టూర్పులు విడుస్తున్న నల్లజాతి ప్రజలు" అని అసోసియేటెడ్ ప్రెస్‌కు చెందిన మార్థా మెండోజా పేర్కొన్నాడు. వాషింగ్టన్ పోస్ట్ ప్రతినిధి కెవిన్ సుల్లివాన్ లండన్‌నుండి సెప్టెంబర్ 4న వార్త ఈ విధంగా పంపాడు: "తాము చూస్తున్న విషయాన్ని ప్రపంచం నలుమూలల ప్రజలు నమ్మలేకపోతున్నారు. న్యూ ఆర్లీన్స్‌లో చనిపోయినవారి మృతదేహాలు, దయనీయమైన స్థితిలో ఉన్న పేద, నల్లజాతి ప్రజల దీన వదనాల ఫోటోలు పత్రికల మొదటిపేజీల్లో దర్శనమిస్తుంటే అర్జెంటీనా నుండి జింబాబ్వేవరకు వాటిని చూసిన వారంతా ఇదా అమెరికా నిజస్వరూపం అని ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రపంచంలో తిరుగులేని శక్తిగా ఉన్న, మహాశక్తివంతమైన, సంపద్వంతమైన అమెరికాలో ఇలా జరుగుతోందేమిటి అని ప్రశ్నిస్తున్నారు.

కత్రినా తుపానులో కొన్ని వేల మంది చిక్కుకోవచ్చు కాని పేదరికం అనే

తపానులో మరింత మంది అమెరికన్లు చిక్కుకుని బిక్కుబిక్కు మంటున్నారు అని నికోలాస్ క్రిస్టోఫ్ రాశాడు. "అమెరికన్లు పేదరికం అనే అంతంలేని తుపానులో చిక్కుకున్నారు" అని పేర్కొన్నాడు. బిల్ క్లింటన్ హయాంలో అమెరికాలో తగ్గిన పేదరికం బుష్ హయాంలో 17 శాతం పెరిగింది. "న్యూ ఆర్లీన్స్‌లో నీళ్లమీద శవాలు దిక్కులేనట్లు తేలియాడుతుండడం మనకు సిగ్గుచేటైన విషయమే కాని చైనా రాజధాని లోకన్నా అమెరికా రాజధానిలో శిశుమరణాల సంఖ్య ఎక్కువగా ఉన్నందుకు మనందరం మరింత సిగ్గుతో తలవంచు కోవాలి" అని ఆయన పేర్కొన్నాడు. 2002లో వాషింగ్టన్‌లో పుట్టిన వెయ్యిమంది బిడ్డల్లో మొదటి పుట్టినరోజు జరుపకముందే 11.5 శాతం మరణిస్తుండగా బీజింగ్‌లో 4.6 శాతం మంది మాత్రమే మరణిస్తున్నారు. "1958 తరువాత మళ్లీ బుష్ హయాంలోనే తొలిసారిగా జాతీయ శిశుమరణాల రేటు పెరగడం ప్రారంభించింది. శిశుమరణాల విషయంలో అమెరికా ప్రపంచం లో 43వ స్థానంలో ఉందని సిఐఎ వరల్డ్ ఫాక్ట్ బుక్‌లో తెలిపింది. దేశంలో 29 శాతం పిల్లలకు గత 12 మాసాలుగా వైద్యబీమా లేదు. వారికి వైద్యపరీక్షలు జరగడం లేదు. వ్యాక్సిన్‌లు వేయడం లేదు. ఆట్లమ్మకు టీకాలు వేయడంలో అమెరికా ప్రపంచంలో 84 స్థానంలో ఉంది, పోలియో వ్యాక్సిన్ వేయడంలో 89వ స్థానంలో ఉంది...." అని క్రిస్టోఫర్ పేర్కొన్నాడు.

"కింది 80 శాతం ప్రజల జీవితం" (న్యూయార్క్ టైమ్స్ ఎడిటోరియల్, సెప్టెంబర్ 1) "కత్రినా బాధితులంతా అమెరికా సగటుకన్నా పేదవారు" (ఫ్రాంక్ బాస్, అసోసియేటెడ్ ప్రెస్), "కత్రినా సహాయంలో జాతి పాత్ర" (మార్థా మెండోజా, అసోసియేటెడ్ ప్రెస్) "ఇంకా పెద్ద సిగ్గుమాలిన విషయం" (నికోలాస్ క్రిస్టో, న్యూయార్క్‌టైమ్స్).... అంటూ అమెరికాలో పేదరికంపై వివిధ పత్రికలు శీర్షికలు పెట్టాయి. న్యూయార్క్ టైమ్స్ అమెరికాలో పేదరికం గురించి ఎడిటోరియల్‌లో ఇలా తెలిపింది: "ఆర్థికాభి వృద్ధితోనే అంతా అయిపోదు. 2004లో ఆర్థికాభివృద్ధి 3.8 శాతం నమోద యింది. కాని ఆ ఏడాది కూడా సగటు కుటుంబ ఆదాయం పెరగకుండా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లు 44,389 డాలర్లదగ్గరే ఉంది. సగటు ఆదాయం ఇలా ఎదుగూ బొదుగూ లేకుండా ఉండటం ఇది వరుసగా అయిదో సంవత్సరమని గణాంక బ్యూరో

> **"వాతావరణ కాలుష్యం విషయంలో బుష్ ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యమే ఇప్పుడు కత్రినా విలయానికి ఒక కారణమని ప్రపంచ దేశాల నిపుణులే కాకుండా అమెరికాలోని పత్రికలు కూడా విమర్శించాయి. "గ్లోబల్ వార్మింగ్ వల్ల తుపానులు, హరికేన్లు మరింత తీవ్రతరంగా మారుతాయా అన్న చర్చను కత్రినా మరోసారి లేవనెత్తింది"**

తెలిపింది. మనకు తెలిసి ఇంత దీర్ఘకాలం ఆదాయం స్తబ్దతలో పడటం ఇదే ప్రథమం. ఒకవైపు ఆర్థికాభివృద్ధి ఉన్నా 2004లో 8 లక్షలమంది కార్మికులు అదనంగా ఆరోగ్య బీమా నుండి తొలగించబడ్డారు. దేశంలో ఇప్పుడు ఆరోగ్యబీమా లేనివారు 4.58 కోట్ల మంది ఉన్నారు. 2004లో మరో 11 లక్షలమంది ప్రజలు దరిద్ర రేఖ దిగువకు వెళ్లిపోయారు. దీంతో అమెరికాలో దరిద్రుల సంఖ్య 3.7 కోట్లకు చేరుకుంది." 2004లో ఆదాయ వ్యత్యాసం రికార్డు స్థాయికి పెరిగిందని అమెరికా గణాంక నివేదిక తెలిపింది. దేశంలోని 50.1 శాతం ఆదాయం ఎగువ 20 శాతం కుటుంబాలకు పోతోంది. ఇంకా ఆర్థిక విధాన సంస్థ అందించిన వివరాల ప్రకారం 2004లో పై స్థాయిలోని 5 శాతం కుటుంబాల ఆదాయంలో మాత్రమే నిజమైన పెరుగుదల ఉంది. మిగిలిన 95 శాతం కుటుంబాల ఆదాయాలు స్తబ్దంగా ఉండడం గాని, తగ్గడం గాని జరిగింది.

పగతీర్చుకుంటున్న పర్యావరణం

ప్రపంచంలోనే అన్ని దేశాలకాన్నా ఎక్కువగా పర్యావరణాన్ని పాడుచేస్తున్న అమెరికా ఇప్పుడు హరికేన్‌ల రూపంలో ఫలితాన్ని అనుభవిస్తోందని అనేకమంది వ్యాఖ్యాతలు పేర్కొన్నారు. పెట్రోలియం ఇంధనాన్ని అధికంగా ఉపయోగించడం వల్ల భూగోళం వేడెక్కి తుపానులు, హరికేన్లు గతంలో కన్నా ఎక్కువ తీవ్రంగా వస్తున్నాయని, ప్రపంచంలో పలుచోట్ల వరదలకు, మరికొన్ని చోట్ల దుర్భిక్షానికి ఇది కారణమవుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రపంచ జనాభాలో నాలుగు శాతం జనాభా కలిగిఉన్న అమెరికా ప్రపంచ ఇంధనంలో 25 శాతం వినియోగి స్తోంది. అందువల్ల 'గ్లోబల్ వార్మింగ్' అనే ఈ ప్రమాదానికి అమెరికా ప్రధాన కారణమవు తోంది. వాతావరణంలోకి ఇంధన వాయువుల విడుదలను తగ్గించు కోవాలని జపాన్‌లోని క్యోటోలో జరిగిన అంతర్జాతీయ సదస్సు అభివృద్ధి చెందిన దేశాలకు విజ్ఞప్తి చేసింది. దీని ప్రకారం అమెరికా ఇంధన వాయువుల విడుదలను 7 శాతం తగ్గించాలి. ఈ క్యోటో ఒప్పందంపై అన్ని దేశాలూ సంతకం చేశాయి గాని బుష్ ప్రభుత్వం మాత్రం సంతకం చేయలేదు. వాతావరణ కాలుష్యం విషయంలో బుష్ ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యమే ఇప్పుడు కత్రినా విలయానికి ఒక కారణమని ప్రపంచ దేశాల నిపుణులే కాకుండా అమెరికాలోని పత్రికలు కూడా విమర్శించాయి. "గ్లోబల్ వార్మింగ్ వల్ల తుపానులు, హరికేన్లు మరింత తీవ్రతరంగా మారుతాయా అన్న చర్చను కత్రినా మరోసారి లేవనెత్తింది" అని అసోసియేటెడ్ ప్రెస్‌కు చెందిన జోసఫ్ వెర్రెంగియా పేర్కొన్నాడు.

నయా-ఉదారవాద ఆర్థిక విధానాలు

చిన్న ప్రభుత్వమే ముద్దు, అసలు ప్రభుత్వమే వద్దు, ప్రభుత్వం అనేది సమస్యలు పరిష్కరించేది కాదు అదే ఒక సమస్య.... ఇవన్నీ ప్రభుత్వ వ్యవస్థపై నయా-ఉదార వాదుల అభిప్రాయాలు. ఈ అభిప్రాయాలకు అనుగుణంగానే బుష్ ప్రభుత్వం ప్రభుత్వ సర్వీసులను బాగా తగ్గించేసింది. న్యూ ఆర్లీన్స్‌లో కరకట్టల పటిష్టీకరణకు నిధులు తగ్గించింది. కేంద్రప్రభుత్వానికి చెందిన ఫెడరల్ ఎమర్జెన్సీ మెయింటెనెన్స్ ఏజెన్సీ (ఫెమా)ను నిర్వీర్యం చేసింది. బుష్ యుద్ధోన్మాదం వల్ల నేషనల్ గార్డులను ఇరాక్ యుద్ధానికి తరలించింది. వారికి ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేయలేక పోయింది. ఈ విధానాల ఫలితమే మూడు రాష్ట్రాల్లో సంభవించిన కత్రినా విలయం నుండి ప్రజలను రక్షించలేక పోవడమని దాదాపు పత్రికలన్నీ

"ఒకనాడు గొప్ప దేశంగా ఉండిన అమెరికా తన పేద ప్రజలపట్ల, నల్లజాతి వారిపట్ల ఇంత నిర్లక్ష్యాన్ని ఎలా ప్రదర్శించగలుగుతోందని ప్రపంచం ముక్కున వేలేసుకుని అడుగుతోంది. ఈ అక్రమాలన్నిటికీ ప్రధాన కారణం ఆర్థిక ఉదారవాదమే..."

రాశాయి. ఈ విషయంలో ఒక్క వాల్ స్ట్రీట్ జర్నల్ మాత్రం బుష్ ప్రభుత్వానికి రక్షణగా నిలిచింది. అన్నిటికీ మించి మితవాద బుష్ ప్రభుత్వం దేశంలో ధనికులకు పన్నుల్లో మినహాఇంపులు ఇచ్చి ఆ మేరకు పేదప్రజలకు ఇచ్చే సదుపాయాలపై కోత విధిస్తోంది. ఈ రోజు అమెరికాలో పేదరికం పెరుగుతోందన్నా, ప్రకృత్తి విపత్తుల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోందన్నా కారణం ఈ నయా-ఉదారవాద విధానాలే. మొదటిది, పేద ప్రజల పట్ల, వారి కష్టాలపట్ల, వారి అవసరాల పట్ల నయా-ఉదారవాదులకున్న ప్రతికూల దృక్పథం. రెండవది, ధనికులకు పన్నుల్లో రాయితీలు ఇచ్చి పేదల సదుపాయాల్లో కోతవిధిస్తున్న నయా-ఉదారవాద ప్రభుత్వ విధానాలు. ఈ రెండూ పేదలకే నష్టదాయకంగా పరిణమిస్తున్నాయి. సెప్టెంబర్ 5న న్యూయార్క్ టైమ్స్‌లో పాల్ క్రూగ్‌మాన్ ఈ విషయాన్ని విస్పష్టంగా ఇలా చెప్పాడు: "కేంద్ర ప్రభుత్వ క్షంతవ్యం కాని నిర్లక్ష్యానికి కారణం బుష్‌కు వ్యక్తిగతంగా సామర్థ్యం లేకపోవడం కాదు. ప్రభుత్వాన్ని ప్రజలబాగుకోసం ఉపయోగించడం మంచిది కాదు అన్న సైద్ధాంతిక ఆలోచనే దానికి కారణం. 25 సంవత్సరాలుగా మితవాద పక్షం ప్రభుత్వ రంగాన్ని దిగజారుస్తూ వచ్చింది. ప్రభుత్వం అనేది ఎప్పుడూ సమస్యే గాని పరిష్కారం కాదని మనకు చెబుతూ వచ్చింది. అలాంటప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకోవలసిన సమయంలో ఆ పని జరక్కపోవడం సహజమే కదా!" అని చెబుతూ, బుష్ నయా-ఉదారవాద విధానాలు అమెరికా ప్రజలకు ఎలా నష్టదాయంగా పరిణమించాయో క్రూగ్‌మాన్ వివరించాడు. ఈ విషయంలో వాషింగ్టన్ పోస్టులో హరాల్డ్ మేయెర్సన్ బుష్ ప్రభుత్వ విధానాన్ని ఉతికి ఆరేశాడు. "గత పాతిక సంవత్సరాలుగా రాడికల్-క్యాపిటలిస్టు కన్సర్వేటివ్‌లు ప్రజాశ్రేయస్సుకోసం ఖర్చు తగ్గించడమే కాదు, అసలు ప్రజాశ్రేయస్సు అనేదొకటుందన్న విషయాన్ని కూడా మరిచిపోయారు. డచ్‌వారు ధనికులపై పన్నువేసి పేదలకు ఖర్చుచేయడం అనే సోషలిస్టు పద్ధతిలో వారి కాలువకట్టలు నిర్మించుకుంటున్నారు. కాని అమెరికా పద్ధతి అదికాదు. ఇక్కడ ప్రభుత్వ పనేమిటంటే ప్రయివేటు రంగం సంపద సృష్టించేట్లు చేయడం. ఆ సంపద ఎవరికి ఎక్కువ అవసరమో వారికి అందకపోయినా ఫరవా లేదు. బుష్ ప్రభుత్వం కుబేరులైన అమెరికన్లకు లక్షల కోట్ల డాలర్లు పన్ను మినహాయింపు రూపంలో పందారాలు చేసింది కాని వారు అమెరికాకు ఏమిచ్చారు?....ట్రికిల్ డౌన్ (సంపద పైనుండి కిందికి ప్రవహిస్తుందన్న సిద్ధాంతం) గురించి చెప్పే రిపబ్లికన్లు మనకేం ఇచ్చారు? వరదలు మినహా. ఒకనాడు గొప్ప దేశంగా ఉండిన అమెరికా తన పేద ప్రజలపట్ల, నల్లజాతి వారిపట్ల ఇంత నిర్లక్ష్యాన్ని ఎలా ప్రదర్శించగలుగుతోందని ప్రపంచం ముక్కున వేలేసుకుని అడుగు తోంది. ఈ అక్రమాలన్నిటికీ ప్రధాన కారణం ఆర్థిక ఉదారవాదమే..." నయా-ఉదారవాద విధానాలు ఎంత నష్టదాయకమైనవో చెబుతూ న్యూయార్క్ టైమ్స్‌లో నికొలాస్ క్రిస్టాఫ్ ఇలా రాశాడు: "...అమెరికా, ముఖ్యంగా బుష్ ప్రభుత్వం సంపదను పేద ప్రజలనుండి తీసుకుని ధనికులకు పంచడం ద్వారా ప్రజల సామాజిక జీవనాన్ని ఒక పద్ధతి ప్రకారం ఛిద్రం చేసింది. న్యూ ఆర్లీన్స్‌కు వెళ్లాల్సిన నిధులు ఇరాక్ యుద్ధానికి పోయాయన్న విషయమొక్కటే కాదు, చిన్నపిల్లల వాక్సినేషన్‌కు వెళ్లాల్సిన నిధులు పన్ను మినహాయింపుల రూపంలో ధనికులకు చేరుకున్నాయి."

అమెరికాలో పేదరికం పెరగడానికి, శిశుమరణాలు అధికం కావడానికి, ప్రాథమిక సదుపాయాలు దెబ్బతినడానికి, వైపరీత్యాలు వచ్చినప్పుడు యంత్రాంగం ప్రజలను పట్టించుకోకపోడానికి రోనాల్డ్ రీగన్ హయాం నుండి అమలవుతూ ఇప్పుడు బుష్ హయాంలో విశ్వరూపం ప్రదర్శిస్తున్న నయా- ఉదారవాద ఆర్థిక విధానాలే కారణమని అమెరికా మీడియాలో పెద్ద భాగం విశ్లేషిం చింది. అంతేకాదు ప్రజలమధ్య సామాజిక సంబంధాలు దెబ్బతినడానికి కూడా ఈ నయా-ఉదారవాద ఆర్థికవిధానలే కారణం. కత్రినా లాంటి వైపరీత్యం రావడంతోనే ఎవరికి వారు తమ స్వంత వ్యవహారం చూసుకుని తోటి మానవులను పట్టించుకోకపోగా వారిని దోచుకుతినే సిగ్గుమాలిన సంస్కృతిని తెచ్చింది ఈ విధానాలే. ఆర్థిక శాస్త్రంలో నోబుల్ బహుమతి గ్రహీత, ప్రపంచ బ్యాంకు మాజీ అధ్యక్షుడు జోసెఫ్ స్టిగ్లిట్జ్ కూడా ఇటీవల ఒక వ్యాసంలో కత్రినా విషయంలో బుష్ అనుసరించిన వైఖరిని తీవ్రంగా విమర్శిం చాడు. మార్కెట్ ఆర్థిక విధానాలు ప్రజల, ముఖ్యంగా పేదల క్షేమాన్ని పట్టించు కోవని చెప్పాడు: "మార్కెట్లు సహజంగానే సంక్షోభాల సమయంలో సరిగ్గా పనిచేయవు. నిజానికి అత్యవసర సమయాల్లో మార్కెట్లు ఎదురుతిరుగుతాయి. ప్రజలను ఖాళీ చేయాల్సి వస్తే పెద్దఎత్తున బస్సులు పంపించే పనిని మార్కెట్టూ ఎన్నడూ చేయదు. అలాంటి ఎమర్జెన్సీల్లో మార్కెట్లు హోటల్ అద్దెలు పెంచి కూర్చుంటాయి..." అని స్టిగ్లిట్జ్ వివరించాడు.

నాటి రొనాల్డ్ రీగన్ నుండి నేటి జార్జి బుష్ వరకు అనుసరిస్తూ వస్తున్న నయా- ఉదారవాద ఆర్థిక విధానాలు, మార్కెట్ విధా నాలు అమెరికాలాంటి అభివృద్ధి చెందిన ఆర్థికవ్యవస్థలోనే ప్రజాకంటకంగా మారిపోతే మనలాంటి వర్ధమాన దేశాలనేం చేస్తాయో ఊహించవచ్చు. ఆ వినాశనకర విధానాలే భారత దేశానికీ, మన రాష్ట్రానికీ మంచి వంటున్న మన 'దేశవాళి రీగన్‌లూ, బుష్‌లూ' కత్రినా విలయం నుండైనా గుణపాఠాలు తీసుకుని వంఢా మార్చుకోవాలి!

రాజకీయ పరిణామాలపై సిపిఐ(ఎం) నివేదిక

సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సమావేశం సెప్టెంబర్ 2వ తేదీ నుండి 4 వరకు న్యూఢిల్లిలో జరిగింది. గత కేంద్ర కమిటి సమావేశం తరువాత జరిగిన రాజకీయ పరిణామాలపై సమావేశం కింది తీర్మానం చేసింది

అంతర్జాతీయ పరిణామాలు

ఏప్రిల్‌లో జరిగిన 18వ మహాసభల తరువాత జరిగిన అంతర్జాతీయ పరిణామాలు రాజకీయ తీర్మానంలోని అంతర్జాతీయ విభాగంలో పేర్కొన్న అభిప్రాయాలను ధృవీకరించాయి. రాజకీయ తీర్మానం ఈ విధంగా పేర్కొంది:

"బుష్ అధ్యక్షుడిగా తిరిగి ఎన్నికయిన తరువాత అమెరికా పాలకవర్గాల్లోని అభివృద్ధి నిరోధక శక్తులు నయా-ఉదారవాద సామ్రాజ్యవాదాన్ని మరింత ముందుకు తీసుకెళతాయి. సామ్రాజ్యవాదం తన కర్రపెత్తనంతో ప్రపంచ పరిణామాల్లో జోక్యం చేసుకొని తనదైన శైలిలో ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛా మార్కెట్లను ఏర్పరుస్తుంది."

అమెరికా దుందుడుకు చర్యలు:

ఇరాక్ ఊబిలో కూరుకుపోయిన తరువాత కూడా అధ్యక్షుడు బుష్ ఇరాక్ దురాక్రమణను నిసిగ్గుగా సమర్ధించుకుంటూనే ఉన్నాడు. అమెరికా తన సైన్యాలను ఇరాక్ నుండి ఉపసంహరించుకునే సూచనలు కన్పించడం లేదు. అదే సమయంలో అమెరికా ఆక్రమణకు వ్యతిరేకంగా ప్రతిఘటన పెరుగుతోంది. జనవరి ఎన్నికలు, కొత్త ప్రభుత్వ ఏర్పాటు తరువాత అమెరికా సేనలచే శిక్షణ పొందిన ఇరాక్ భద్రతా దళాలపై దాడులు పెరిగాయి. ప్రభుత్వంలోని ముఖ్య వ్యక్తులు లక్ష్యాలుగా మారారు. ఇరాక్‌లోని అధిక ప్రాంతాలు కొత్త ప్రభుత్వ నియంత్రణలో లేకుండా పోయాయి.

ఇరాక్ నూతన రాజ్యాంగం, సున్నీల మద్దతు పొందడంలో విఫలమయింది. ఎన్నో ఏళ్లుగా ఉన్న ఇరాక్ రాజ్య లౌకిక స్వభావాన్ని కొత్త రాజ్యాంగం వమ్ముచేసింది. ఇస్లామిక్ చట్టాలతో విభేదించే చట్టాలు చెల్లవని చెప్పింది. మహిళలకు హక్కులు లేవని పేర్కొంది. వలసవాద వ్యతిరేక పోరాటంలో ఉద్భవించిన ఇరాక్ ఐక్యతను అమెరికా సామ్రాజ్యవాదం వమ్ముచేసింది. ఇరాక్‌ను మూడు ముక్కలుగా - ఉత్తరాదిన కుర్దులు మెజారిటీగా గల ప్రాంతం, మధ్య ఇరాక్ సున్నీలకు, దక్షిణాదిన షియాల ఆధిపత్యంలోని భాగంగా విభజించడం ద్వారా దేశాన్ని అమెరికా బానిస దేశంగా మార్చేస్తోంది. చనిపోయిన అమెరికా సైనికుల సంఖ్య 1800 దాటిపోవడంతో అమెరికాలో మరోసారి యుద్ధ వ్యతిరేక భావాలు ఉధృతమవుతున్నాయి. ఇరాక్‌లో బుష్ ప్రభుత్వ నిర్వాకాన్ని ఆమోదించే అమెరికా ప్రజల సంఖ్య మొదటిసారిగా 34 శాతానికి పడిపోయింది.

అమెరికా-బ్రిటీష్ దురాక్రమణ వల్ల ఇరాక్‌లో హింస, ఛాందసవాద పోకడలు ఒక్కసారిగా పెచ్చరిల్లాయి. లౌకిక వాదానికి మారుపేరుగా ఉన్న ఇరాక్‌లో రోజూ ఆత్మహుతి దాడులు చోటుచేసుకుంటున్నాయి. ఇరాక్ నీలి నీడలు ప్రస్తుతం లండన్‌కు పాకాయి. ఇరాక్ దురాక్రమణలో బ్లెయిర్ ప్రభుత్వ పాత్రకు ప్రతిఫలంగానే జులై 7న లండన్ నగరంపై ఆత్మాహుతి దాడుల ఘోరకలి చోటు చేసుకుంది.

అమెరికా చైనానూ లక్ష్యంగా చేసుకోవడం ప్రారంభించింది. మిలటరీ ఖర్చు పెరిగిందంటూ విమర్శిస్తోంది. పెరుగుతున్న చైనా ఆయుధ సంపత్తి, ఆర్థిక శక్తి పట్ల బుష్ పాలనా యంత్రాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది. అమెరికాలోని ప్రముఖ ఆయిల్ కంపెనీ యునోకాల్‌ను చైనా ఆయిల్ కంపెనీ కైవసం చేసుకోకుండా అమెరికా అడ్డుకుంది. అలాగే ఇతర చైనా కంపెనీల వృద్ధినీ అడ్డుకుంటోంది. క్యూబా, వెనుజులాలకు వ్యతిరేకంగా కూడా అమెరికా ద్వేషపూరిత చర్యలు కొనసాగిస్తోంది. గాజా నుండి వైదొలిగిన తరువాత వెస్ట్‌బ్యాంక్‌ను ఇజ్రాయిల్లో కలుపుకోవాలనుకున్న షరోన్ ప్రభుత్వ కుట్రలకు బుష్ అనుమతిచ్చాడు. ఉత్తరకొరియా శాంతియుత అవసరాల కోసం అణుశక్తిని అభివృద్ధి చేసుకోవచ్చునని దక్షిణ కొరియా అంగీకరించినప్పటికీ అమెరికా మాత్రం దానితో సహేతుకమైన ఒడంబడిక చేసుకునేందుకు నిరాకరిస్తోంది.

యూరోపియన్ యూనియన్ రాజ్యాంగం:

యూరోపియన్ యూనియన్ ముసాయిదా రాజ్యాంగాన్ని రిఫెరండంలో ఫ్రాన్స్ తిరస్కరించడం అనేది ఈ కాలంలో జరిగిన మరో ముఖ్యపరిణామం. ఈ నిర్ణాయాత్మక తిరస్కారం తరువాత నెదర్లాండ్స్ కూడా వద్దు అదేబాటలో అన్న తీర్పు వెలువరించింది. ఈ పరిణామం ముసాయిదా రాజ్యాంగాన్ని శ్మశానానికి పంపింది. బడా వ్యాపారసంస్థలు, ఫైనాన్స్ పెట్టుబడి ఆధారంగా యూరోప్‌ను ఐక్యం చేసే ప్రయత్నాలను వ్యతిరేకించే శక్తులకు ఇది పెద్ద విజయం. ఈ రాజ్యంగం గనుక ఆమోదించబడి ఉంటే సాంఘిక సంక్షేమ వ్యవస్థను నాశనం చేసేవారు, ప్రభుత్వ రంగాన్ని లేకుండా చేసేవారు. జాతీయ సార్వభౌమత్వాన్ని కోల్పోతామని ప్రజల్లో ఏర్పడిన భయం కూడా ముసాయిదా రాజ్యాంగానికి వ్యతిరేకంగా వారిచేత ఓటు వేయించింది.

ఆధిపత్య వ్యతిరేక దోరణులు:

పార్టీ మహాసభల తీర్మానంలో పేర్కొన్నట్లుగా అమెరికా పెత్తందారీ తనానికి వ్యతిరేకంగా ప్రతిఘటన పెరుగుతోంది. లాటిన్ అమెరికాలో క్యూబా, వెనుజులా మధ్య దగ్గరి సంబంధాలు ఏర్పడటం అమెరికాకు ఆందోళన కల్గిస్తోంది. అమెరికాలోని అభివృద్ధి నిరోధక వర్గం వెనుజులా ప్రభుత్వాన్ని కూలదోయాలని బహిరంగంగానే ప్రకటించింది. బుష్‌కు దగ్గరగా ఉండే క్రిస్టియన్ మత గురువు ఒక టీ.వి. కార్యక్రమంలో వెనుజులా అధ్యక్షుడు చావెజ్‌ను హతమార్చాలని పిలుపునిచ్చాడు. వెనుజులా సోషలిస్టు పంధాను ఎన్నుకుంటుందని, క్యూబాతో మంచి సంబంధాలు పెట్టుకొని లాటిన్ అమెరికాలోని నయా-ఉదారవాద నమూనాకు ప్రత్యామ్నాయాన్ని చూపిస్తుందని చావెజ్ బహిరంగంగా ప్రకటించాడు. భారీస్థాయిలో ఉన్న సహజ వాయువు నిక్షేపాలను జాతీయం చేయాలని బొలివియాలో సాగుతున్న ప్రజా ప్రదర్శనలు, ధర్నాలతో ఆ దేశాధ్యక్షుడు రాజీనామా చేశాడు. ఇంధనం, విద్యుత్, రక్షణ రంగాల్లో పరస్పర సహకారానికి రష్యా, చైనాలు పలు ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. ఈ రెండు దేశాలు ఉమ్మడిగా ఇటీవలే సైనిక విన్యాసాలు నిర్వహించాయి.

"జిన్నా గురించి అద్వానీ చేసిన వ్యాఖ్యలు ఆర్‌ఎస్‌ఎస్‌తోపాటు పార్టీలోని వృద్ధ నేతలకు ఆగ్రహాన్ని కల్గించాయి. అద్వానీ తన వ్యాఖ్యలను సమర్థించుకున్నాడు. పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశాడు. రాజీనామాను ఉపసంహరించుకోవాలన్న పార్లమెంటరీ బోర్డు విజ్ఞప్తిని అద్వానీ తిరస్కరించాడు."

జులైలో కజికిస్తాన్‌లో షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశం జరిగింది. అందులో చైనా, రష్యా, కజికిస్తాన్, కిర్గిస్తాన్, తజికిస్తాన్, ఉజ్బెజికిస్తాన్ సభ్య దేశాలుగా ఉన్నాయి. వాళ్ల దేశాల్లో ఉపయోగిస్తున్న విదేశీ తాత్కాలిక మిలిటరీ మౌలిక సదుపాయాలను తొలగించేందుకు గడువును పెట్టుకోవాలని ఆ సమావేశంలో నిర్ణయించారు. తన దేశం నుండి సైనిక స్థావరాలను ఉపసంహరించు కోవాల్సిందిగా ఇప్పటికే అమెరికాను ఉజ్బెజికిస్తాన్ కోరింది. మరో ముఖ్యపరిణామం, ఇరాన్ అధ్యక్ష ఎన్నికలలో మతవాద ఇస్లామిక్ వర్గానికి చెందిన మహమ్మద్ అహ్మదినెజాద్ పూర్తిస్థాయి మెజార్టీతో విజయం సాధించాడు. పౌర అవసరాల కోసం అణుశాస్త్ర విజ్ఞానాన్ని ఉపయో గించడంలో అమెరికా, యూరోపియన్ యూని యన్ ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని ఇరాన్ కొత్త అధ్యక్షుడు పేర్కొన్నారు. అయితే ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు విధిస్తూనే ఉంది. ఇరాన్‌పై దాడి చేసే అవకాశాన్ని త్రోసిపుచ్చలేనని బుష్ ప్రకటించాడు.

దక్షిణాసియా ప్రాంతం:

మన ఇరుగుపొరుగు దేశాల్లోనూ ముఖ్యమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. సునామీ పునరావాస చర్యల్లో ఎల్‌టిటిఇకి కూడా భాగస్వామ్యం కల్పించడాన్ని నిరసిస్తూ శ్రీలంక ప్రభుత్వం నుండి జనతా విముక్తి పెరుమన (జెవిపి) వైదొలిగింది. ప్రభుత్వానికి పార్లమెంట్‌లో బలం లేకపోయినప్పటికీ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు యుఎన్‌పి పార్టీ సిద్ధంగా లేదు కనుక అది కొనసాగుతోంది. విదేశాంగశాఖా మంత్రి లక్ష్మణ్ కదిర్‌గమర్ హత్య దిగ్భ్రాంతికరం. ఈ ఘటనలో ఎల్‌టిటిఇ హస్తం సుస్పష్టం. ఇప్పటికే కాల్పుల విరమణపై పరిస్థితి ఆందోళనకరంగా ఉండగా లక్ష్మణ్ హత్య చర్చల ప్రక్రియ ప్రారంభానికి సమస్యగా మారవచ్చు. తమ విధానాన్ని అంగీకరించని తమిళ నాయకులపై ఎల్‌టిటిఇ దాడులను కొనసాగిస్తూనే ఉంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నవంబర్‌లో అధ్యక్ష ఎన్నిలు జరుగుతాయి. అప్పటి వరకు శాంతి ప్రక్రియలో ఎటువంటి పురోగతి ఉండకపోవచ్చు.

బంగ్లాదేశ్ వ్యాప్తంగా జరుగుతున్న బాంబు పేలుళ్ల ఆ దేశంలో ఇస్లామిక్ ఛాందసవాద శక్తుల అరాచకం పెరుగుతోందని సూచిస్తోంది. 64 జిల్లాలకు గాను 63 జిల్లాల్లోని 500 ప్రాంతాల్లో బాంబు పేలుళ్ల జరిగాయి. జమాతుల్ ముజాహిదీన్ లాంటి ఛాందసవాద సంస్థలు బాంబు పేలుళ్ల ద్వారా తమ శక్తి చాటు తున్నాయని భావిస్తున్నారు. తీవ్రవాదుల హెచ్చరికల వట్ల ఖలేదా ప్రభుత్వం ఇంకా మెతకవైఖరే కొనసాగిస్తోంది. నేపాల్‌లో ప్రజాస్వామ్య పునరుద్దరణకు చర్యలు తీసుకుంటానంటూ జకార్తాలో భారత ప్రధానమంత్రికి హామీ ఇచ్చినప్పటికీ ఆ దేశ రాజు అందుకోసం ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. రాజకీయ నాయకుల అణిచివేత, అరెస్టులు కొనసాగుతూనే ఉన్నాయి. చాలా మంది విద్యార్థి నాయకులను జైళ్లకు పంపించారు. ప్రభుత్వ ఉద్యోగ సంఘాలను నిషేధించారు. అసలు నేపాల్లో రాచరిక వ్యవస్థ అవసరమేముందని ప్రజాతంత్ర శక్తులు ప్రశ్నిస్తున్నాయి. కొత్త రాజ్యాంగ రూపకల్పనకు అసెంబ్లీని ఏర్పరచాలనే ఏడు రాజకీయ పార్టీల కూటమి డిమాండ్‌కు ఆదరణ పెరుగుతోంది. నేపాల్ రాజకు సైనిక సహకారాన్ని నిలిపివేయాలని మన పార్టీ డిమాండ్ చేస్తోంది.

జాతీయ పరిస్థితి:

మూడు నెలల క్రితం జులైలో జరిగిన పార్టీ సమావేశం నాటికి బిజెపిలో వివాదం ముదురుతోంది. నాయకత్వ సమస్యను అది పరిష్కరించుకోలేకపోతోంది. యుపిఎ ప్రభుత్వం సిపిఎంపిని ఉల్లఘించలేదని సిపిఎంతోపాటు వామపక్షాల అంచనా. ఇందుకు బిహెచ్ఇఎల్‌లో పెట్టుబడుల ఉపసంహరణపై వెనక్కి తగ్గడం ఓ ఉదాహరణ. ఈ కాలంలో సాధించిన ఒక ముఖ్య విజయం గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఆమోదించడం. ఈ చట్టంకోసం వామపక్షాలు యుపిఎ ప్రభుత్వంపై ఎంతో ఒత్తిడి తెచ్చాయి. రక్షణ రంగంలో భారత్ అమెరికా మధ్య జరిగిన ఒప్పందం అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా చేసుకున్నదనీ అన్నివైపుల నుండి విమర్శలు వస్తున్నాయి. నానావతి నివేదికను ప్రవేశపెట్టడంలోనూ, నివేదికకు అనుగుణంగా చర్యలు చేపట్టడంలోనూ, మహిళా రిజర్వేషన్ బిల్లుపైనా, ప్రయివేట్ వృత్తి కళాశాలలకు అనుకూలంగా వచ్చిన సుప్రీంకోర్టు తీర్పుపై చర్చను జరపడంతో సహా అన్ని ముఖ్య అంశాల విషయంలోనూ మన పార్టీతోపాటు మిగిలిన వామపక్షాలు కీలకపాత్ర పోషించాయి.

బిజెపిలో ముసలం:

ఎల్‌కె అద్వానీ పాకిస్తాన్ పర్యటన తరువాత బిజెపిలో పుట్టిన ముసలం మరో ప్రముఖ పరిణామం. జిన్నా గురించి అద్వానీ చేసిన వ్యాఖ్యలు ఆర్ఎస్ఎస్‌తోపాటు పార్టీలోని వృద్ధ నేతలకు ఆగ్రహాన్ని కల్గించాయి. అద్వానీ తన వ్యాఖ్యలను సమర్ధించుకున్నాడు. పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశాడు. రాజీనామాను ఉపసంహరించుకోవాలన్న పార్ల మెంటరీ బోర్డు విజ్ఞప్తిని అద్వానీ తిరస్కరించాడు. నాలుగు రోజుల పాటు సంక్షోభం కొనసాగింది. చివరికి జిన్నా ఎడలా, దేశ విభజన ఎడలా ఆర్ఎస్ఎస్ వైఖరితో ఏకీభవిస్తూ బిజెపి తీర్మానం చేసింది. తన వైఖరికి ఎక్కువ మద్దతు పొందలేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అద్వానీ రాజీనామాను వెనక్కి తీసుకున్నాడు.

అద్వానీ రాజీనామా ఉపసంహరణ సంక్షోభాన్ని పూర్తిగా పరిష్కరించలేదు. సూరత్‌లో జరిగిన ఆర్ఎస్ఎస్ వార్షిక ప్రచార సభలో హిందూత్వ సిద్ధాంతం నుండి వైదొలగేది లేదని, బిజెపిలో ఒక వ్యక్తికి ఒకే పదవి విధానాన్ని అమలుపరిచి తీరాలని నిర్ణయించారు. దీనర్థం అద్వానీ పార్టీ అధ్యక్ష పదవీ నుండైనా లేక ప్రతిపక్షనేత పదవి నుండైనా వైదొలగాల్సి ఉంది. ఆర్ఎస్ఎస్ నిర్ణయం బిజెపిలో మరోసారి చిచ్చుకు దారీ తీసింది. చివరగా ప్రస్తుతానికి అద్వానీ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతారని సర్దిచెప్పుకున్నారు.+ ఈ పరిణామం పార్టీపై అద్వానీ పట్టు తగ్గుతుందనేది స్పష్టం చేస్తోంది. పార్లమెంట్ సమావేశాలు పూర్తయ్యేవరకు, బీహార్ ఎన్నికలు

ముగిసేవరకు బిజెపి ఐక్యంగా ఉండేందుకు ఆర్ఎస్ఎస్ అంగీకరించింది.

ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తే వైవిధ్యమైన ప్రజాస్వామ్య పార్టీగా పదేపదే చెప్పుకునే బిజెపి అసలు రంగు బయటపడింది. అదొక ఆర్ఎస్ఎస్ ఉపాంగం మాత్రమేనని స్పష్టమయింది. ఎన్‌డిఎ పక్షాల పాత్ర కూడా బట్టబయలయింది. ఎన్డీయే కన్వీనర్ జార్జ్ ఫర్నాండేజ్ బిజెపి, ఆర్ఎస్ఎస్ మధ్య సయోధ్య కోసం బ్రోకర్‌లా పని చేశాడు. బిజెపి, ఆర్ఎస్ఎస్ మధ్య సంబంధాలను ఎత్తి చూపిన ఈ వ్యవహారం వారిని రక్షణాత్మక స్థితిలోకి నెట్టింది.

బిజెపి పాలిత రాష్ట్రాల్లోనూ ఆ పార్టీ రాష్ట్ర శాఖల్లోనూ అసమ్మతి బయట పడింది. గుజరాత్‌లో మోడీకి వ్యతిరేకంగా 40 మంది శాసనసభ్యులు తమ నిరసనను బహిరంగంగా ప్రకటించారు. మధ్యప్రదేశ్, జార్ఖండ్‌లోనూ అసమ్మతి నేతల కార్య కలాపాలు పెరిగాయి. ఇతర రాష్ట్రాల్లోనూ సమస్యలు పెరిగాయి. కర్నాటక, కేరళలో విభేధాలు బయటపడ్డాయి. ఎల్‌కె అద్వానీని విమర్శించినందుకు సీనియర్ నేత మదన్‌లాల్ ఖురానాను పార్టీ నుండి సస్పెండ్ చేశారు. ++ ఈ మొత్తం వ్యవహారం ప్రజల్లో బిజెపి ప్రతిష్టను దిగజార్చింది. సైద్ధాంతిక గందరగోళం, క్రమశిక్షణా రాహిత్యం అందరికీ కళ్ళకు కట్టినట్లు కన్పిస్తోంది. గత పార్లమెంట్ సమావేశాలను బహిష్కరించిన బిజెపి ఈసారి పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వంపై వాడివేడి దాడులు చేయడం ద్వారా జరిగిన నష్టాన్ని కొంత మేరకు పూడ్చుకోవచ్చునని భావిస్తోంది. కానీ సమర్ధవంతమైన ప్రతిపక్షంగా వ్యవహరించడంలో బిజెపి తనకు తానుగా విఫలమయింది.

గ్రామీణ ఉపాధి హామీ చట్టం:

పార్లమెంట్‌లో గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఆమోదింపజేయడం ప్రధాన విజయం. తద్వారా కనీస ఉమ్మడి కార్యక్రమంలో ఇచ్చిన హామీని యుపిఎ ప్రభుత్వం నెరవేర్చింది. ఈ చట్టం ప్రకారం కనీస వేతనం 60 రూపాయలుగా గ్రామీణ ప్రాంతంలోని ప్రతి కుటుంబంలో ఒక సభ్యుడికి 100 రోజులపాటు ఉపాధి ఖచ్చితంగా దొరుకుతుంది. ఈ పథకం ప్రస్తుతం 200 జిల్లాల్లో ప్రారంభమై రానున్న ఐదేళ్లకాలంలో దేశమంతటా అమలవుతుంది. ఈ చట్టం ముసాయిదా బిల్లులో లోపాలను సవరించడంలో, కొన్ని మంచి అంశాలను చేర్చడంలో మన పార్టీతోపాటు వామపక్షాలు కీలకపాత్ర నిర్వహించాయి. రానున్న ఐదేళ్ల కాలంలో ఈ పథకాన్ని దేశమంతటా అమలు చేయడం, మహిళలకు మూడోవంతు రిజర్వేషన్లు, కనీస వేతనం 60 రూపాయలుగా నిర్ణయించడం వంటి వాటిని వామపక్షాల ఒత్తిడి కారణంగానే చట్టంలో చేర్చారు. పార్టీతోపాటు ప్రజాసంఘాలు కూడా 200 జిల్లాల్లోనూ ఈ పథకం సమర్ధవంతంగా అమలయ్యేలా కృషి చేయాలి. అవసరమైన చోట ఆందోళనలు నిర్వహించి సమర్ధవంతంగా అమలు చేయించాలి.

“ముసాయిదా బిల్లులో లోపాలను సవరించడంలో, కొన్ని మంచి అంశాలను చేర్చడంలో మన పార్టీతోపాటు వామపక్షాలు కీలకపాత్ర నిర్వహించాయి. రానున్న ఐదేళ్ల కాలంలో ఈ పథకాన్ని దేశమంతటా అమలు చేయడం, మహిళలకు మూడోవంతు రిజర్వేషన్లు, కనీస వేతనం 60 రూపాయలుగా నిర్ణయించడం వంటి వాటిని వామపక్షాల ఒత్తిడి కారణంగానే చట్టంలో చేర్చారు.”

భారత్ – అమెరికా సంబంధాలు:

అమెరికాకు ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రథమ పర్యటన ఏర్పాట్ల నిమిత్తం మన రక్షణశాఖ మంత్రి అమెరికా పర్యటించారు. తన పర్యటనకు ముందు ఆయన మాట్లాడుతూ ఇది అవకాశాలను అన్వేషించే పర్యటన అని పేర్కొన్నారు. కానీ పర్యటన సమయంలో భారత్ అమెరికా రక్షణ చట్రం ఒప్పందాన్ని వచ్చే పదేళ్లపాటు కొనసాగించే పత్రంపై ఆయన సంతకం చేశారు. అమెరికా వ్యూహంలో భారత్ పావుగా మార్చడమే ఈ ఒప్పందం ఉద్దేశ్యమని, ఈ ఒప్పందాన్ని సమీక్షించిన మన పార్టీ అభిప్రాయపడింది. నాలుగు అంశాలపై ఈ ఒప్పందాన్ని పార్టీ తీవ్రంగా విమర్శించింది. మొదటిది, ఐక్యరాజ్యసమితి అనుమతి లేకుండా రెండు దేశాల్లోనూ ఉమ్మడి సైనిక విన్యాసాలు నిర్వహించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. దీనర్థమేమంటే అమెరికా పర్యవేక్షణలో ఉమ్మడి సైనిక విన్యాసాలు జరుగుతాయి. రెండో అంశం, రెండు దేశాలు క్షిపణి రంగంలో పరస్పరం సహకారాన్ని అందించుకుంటాయి. తన క్షిపణి రక్షణ విధానంలో భారత్‌ను భాగస్వామ్యం చేసేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలకు ఇది దోహదపడుతుంది. మూడోది, రక్షణ సామాగ్రిని ఉమ్మడిగా ఉత్పత్తి చేయాలనే ప్రతిపాదన. ఇది ఖచ్చితంగా ఎఫ్ 16 విమానాలు భారత్ కొనేందుకు అమెరికా వేసిన ఎర. అమెరికా ఆయుధాలకు భారత మార్కెట్ తలుపులు తెరిచేందుకు ఇది ఉద్దేశించింది. నాల్గవది, సముద్ర తీర ప్రాంతాల భద్రతకు భారత్ హామినివ్వడం. దీని ద్వారా మలక్కా జల సంధితోపాటు ఇతర అంతర్జాతీయ సముద్రాలకు భారత్ నౌకాదళం గస్తీ తిరిగేట్లు చేయాలని అమెరికా ప్రయత్నిస్తోంది. ఇది ఈ ప్రాంతంలో అమెరికా ప్రయోజనాలకు అవసరమైన చర్య. విస్తరిస్తున్న చైనా సైనిక సామర్థ్యాన్ని అడ్డుకోవాలని అమెరికా గట్టిగా ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో ఈ ఒప్పందం జరిగిందనే విషయాన్ని మనం గమనించాలి.

ఈ ఒప్పందానికి అనుగుణంగా ప్రధాని పర్యటన సమయంలో ఉమ్మడి ప్రకటన వెలువడింది. దీనిపై మన పార్టీ సమగ్ర ప్రకటన చేసింది. అమెరికాకు భారత్ వ్యూహాత్మక భాగస్వామిగా మారుతున్న క్రమంలో ఈ ఒప్పందం జరిగిందనే వాస్తవాన్ని మన పార్టీ పేర్కొంది. మూడో ప్రపంచ దేశాల్లో ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరుస్తాం అన్న పేరుతో అమెరికా చేపట్టిన ‘ప్రపంచ ప్రజాస్వామ్య ఉద్ధరణ’ కార్యక్రమంలో భాగస్వామిగా మారేందుకు భారత ప్రభుత్వం అంగీకరించడాన్ని మనం వ్యతిరేకిస్తున్నాము. ప్రజాస్వామ్య విస్తరణ పేరుతో ఇతర దేశాలపై దాడులు చేయడానికి, దేశాల సౌరభౌమాధికారాన్ని కాజేయడానికి అమెరికా కుట్ర చేస్తోంది. ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో అమెరికా ముందు భాగాన ఉన్నదని, అందులో తాను భాగాస్వామినవుతానని భారత ప్రభుత్వం ఆ ఒప్పందంలో హామీ ఇచ్చింది. కాని ఇప్పటవరకు మనకు వచ్చిన అనుభవం దీనికి భిన్నంగా ఉంది. అమెరికా జోక్యం ఉగ్రవాదాన్ని నిర్మూలించకపోగా పెంచింది. ఇరాక్‌లో అమెరికా జోక్యం ఈ విషయాన్నే తెలుపుతోంది. అణు సహకారానికి సంబంధించి అంతర్జాతీయ

“ శాంతియుత అవసరాల కోసం భారత్ నిర్వహించే స్వతంత్ర అణు సాంకేతిక అభివృద్ధి ప్రయత్నాలకు అమెరికాతో ఒప్పందం అవరోధంగా మారకూడదని మన పార్టీ హెచ్చరిస్తోంది. దీనికి సంబంధించి ప్రతి దశలోనూ భారత్ ప్రభుత్వం జాగరూకతతో ఉండాలి. ఏకపక్షంగా ఎటువంటి రాయతీలు ఇవ్వకూడదు. ”

భద్రతాప్రమాణాలకు అనుగుణంగా ఏర్పరిచిన భారత అణురియాక్టర్లకు అణు ఇంధనాన్ని సరఫరా చేసేందుకు అమెరికా అంగీకరించింది. 1998లో పోఖ్రాన్ పరీక్షల తరువాతన మన పార్టీ అణ్వాయుధీకరణను వ్యతిరేకిస్తోంది. అణ్వాయుధాల అభివృద్ధిపై ఆంక్షలు విధించవద్దనే అణు ఉన్మాదులతోనూ, బిజెపి వాదనలతోనూ మనం ఏకీభవించడం లేదు. అయితే శాంతియుత అవసరాల కోసం భారత్ నిర్వహించే స్వతంత్ర అణు సాంకేతిక అభివృద్ధి ప్రయత్నాలకు అమెరికాతో ఒప్పందం అవరోధంగా మారకూడదని మన పార్టీ హెచ్చరిస్తోంది. దీనికి సంబంధించి ప్రతి దశలోనూ భారత్ ప్రభుత్వం జాగరూకతతో ఉండాలి. ఏకపక్షంగా ఎటువంటి రాయతీలు ఇవ్వకూడదు.

చివరిగా మనకు అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తానని ఈ ఉమ్మడి ప్రకటనలో అమెరికా ఎక్కడా అంగీకరించలేదు. పైగా ఇచ్చిన హామీల్లో చాలా మట్టుకు గందరగోళంగానూ, అమలుకు నోచుకోని విధంగానూ ఉన్నాయి. ఉమ్మడి ప్రకటన ద్వారా అమెరికా భారత్‌కు వ్యూహాత్మక భాగాస్వామి హోదా నిచ్చిందని, అంతర్జాతీయంగా చైనాను నిలువరించేందుకు భారత్‌ను పోటీగా నిలిపిందనే భావన కలుగుతోంది. భారత్- అమెరికా సైనిక ఒప్పందానికి వ్యతిరేకంగానూ, అమెరికాకు భారత్ వ్యూహాత్మక, రాజకీయ భాగస్వామిగా మారుతున్న క్రమానికి వ్యతిరేకంగానూ మన పార్టీ ప్రచారం నిర్వహించాలి.

సిక్కు వ్యతిరేక దాడులపై నానావతి కమీషన్ నివేదిక:

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో నానావతి నివేదికను, చర్యల నివేదికను ప్రవేశపెట్టారు. సిక్కు మతస్థులపై పథకం ప్రకారం దాడులు నిర్వహించిన ఒక్కరిని కూడా బాధ్యులు చేయకుండా వెలువడిన జస్టిస్ నానావతి జరిపిన న్యాయవిచారణ నివేదిక చాలా నిరాశపర్చింది. నానావతి కమిషన్ చేసిన చిన్న పాటి సిపార్సులను కూడా ప్రభుత్వం తీవ్రంగా తీసుకోలేదు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన చర్యల నివేదిక వీటిని ఆమోదించ లేదు. ఇది అంగీకార యోగ్యం కాదని ప్రభుత్వానికి మన పార్టీ తెలిపింది. బిజెపి వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టిన తరుణంలో నానావతి కమీషన్ సిఫార్సులను ఆమోదించాలని, వాటిని అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మన్మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాం. తరువాతి క్రమంలో మా డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించింది. 1984లో సిక్కు మతస్థులపై జరిగిన దాడులకు ప్రధాని మన్మోహన్ సింగ్ క్షమాపణలు చెప్పారు. పార్లమెంట్‌లో మనపార్టీ, ఎంపీలు తీసుకున్న వైఖరిని లౌకిక, ప్రజాతంత్ర శక్తులు హర్షించాయి.

పెట్రోల్-డీజిల్ ధరల పెంపు:

కేంద్ర ప్రభుత్వం పెట్రోధరలు పెంచితే, వామపక్షాలు అఖిల భారత నిరసన దినం నిర్వహించాల్సి ఉంటుందని జూన్‌లో జరిగిన కేంద్ర కమిటీలో నిర్ణయించాం. జూన్ 20న పెట్రోల్ ధరలను పెంచగానే జూన్ 28న నిరసన దినం నిర్వహించాలని వామపక్షాలు పిలుపునిచ్చాయి. పెట్రోల్ ధర లీటరుకు రెండున్నర రూపాయలు, డీజిల్ ధర రెండు రూపాయలు పెంచారు. జూన్ 28 తేదికి పూర్వమే కొన్ని ప్రాంతాల్లో ధర్నాలు, ప్రదర్శనలు జరిగాయి. పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొని జూన్ 28న నిరసన పాటించారు. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ప్రజల ఆగ్రహం స్పష్టంగా కన్పించింది. యుపిఎ ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతింది.

అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 60 డాలర్లు దాటుతున్న దశలో మరోసారి పెట్రోల్ ధరలు పెంచాలని కేంద్రం యోచిస్తోంది. +++ ఇటీవల కాలంలో ప్రభుత్వరంగ చమురు కంపెనీలు పొందిన నష్టాన్ని పూడ్చుకోవడం తక్షణ ప్రాధాన్యతగా కన్పిస్తోంది. పెట్రోల్ ఛార్జీలు పెంచేందుకు బదులుగా వామపక్షాలు చూపిన ప్రత్యామ్నాయ సూచనలు అమలు చేయాల్సిందిగా మన పార్టీ డిమాండ్ చేస్తోంది. గత బడ్జెట్‌లో పెంచిన ఎక్సైజ్ పన్నులను సవరించాలని, రోడ్‌సెస్‌ను తగ్గించాలని, చమురు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని, ప్రయివేట్ ఆయిల్ కంపెనీల రిఫైనరీలకు ఇస్తున్న రాయితీలను తొలగించాలని సూచించాము.

మహిళా రిజర్వేషన్ బిల్లు:

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఎటువంటి మార్పులు లేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని ఒక ప్రకటనలో వామపక్షాలు యుపిఎ ప్రభుత్వాన్ని కోరాయి. కానీ హోంశాఖామంత్రి, తాజా డెలిమిటేషన్ ఆధారంగా పార్లమెంట్, శాసనసభల్లో మూడోవంతు సీట్లను అదనంగా పెంచాలని చెబుతూ ఒక ప్రత్నామ్నాయ ప్రతిపాదన పెట్టారు. కొత్తగా పెరిగిన సీట్లలో మూడోవంతు సీట్లు మహిళలకు రిజర్వ్ చేస్తారట. ఈ ప్రతిపాదన ఆచరణయోగ్యం కాదని పార్టీ భావించింది. డిలిమిటేషన్, కొత్తగా సీట్లు పెంచడం సుదీర్ఘ ప్రక్రియ. దీంతో మహిళా రిజర్వేషన్ మరింత జాప్యమవుతుంది. మహిళా రిజర్వేషన్‌లోనే ఓబిసి రిజర్వేషన్ కావాలని కోరుతున్న పార్టీలను హోంమంత్రి ప్రతిపాదన సంతృప్తి పరచలేదు. చర్చల కోసం యుపిఎను, మద్దతునిచ్చే పార్టీలను ప్రధానమంత్రి పిలిచినపుడు, పాత బిల్లునే తీసుకోవాలని పార్టీ కోరింది. అయితే అందరూ అంగీకరించినప్పుడు కొత్త ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకోవచ్చునని మన పార్టీ వైఖరిని స్పష్టంగా చెప్పాం. అత్యధిక పార్టీలు పాత బిల్లునే కోరుకుంటున్నాయి. ప్రతిపక్ష పార్టీలతో జరిపిన సమావేశంలో, బిజెపి పాత బిల్లును సమర్థించాలనే తన పాత వైఖరిని మార్చుకొని రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల జాబితాలో రిజర్వేషన్‌ను పాటించాలని కొత్త మెలిక పెట్టింది. ఇటువంటి పరిస్థితుల్లో సిపిఎం, ఇతర వామపక్షాలు పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పాత బిల్లును ముందుకు తీసుకురావాల్సి ఉంది.

గుజరాత్ పరిస్థితి:

గుజరాత్‌లో మైనార్టీ మతాలకు చెందిన ప్రజలను రెండో తరగతి పౌరులుగా చూడటం కొనసాగుతూనే ఉంది. వారి

గృహాల్లో పునరావాసం, వారి వృత్తులను తిరిగి చేపట్టే హక్కు, వారి వ్యాపారాలు వాళ్లు చేసుకునే పరిస్థితి ఇంకా రాలేదు. పోటా చట్టం కింద అరెస్టు చేయబడిన వారిపై పోటా సమీక్షా కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేసేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం నిరాకరిస్తోంది. తీవ్రమైన కేసులు పెట్టిన ఘటనలపై విచారణలు జరిగేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలనూ తీసుకోవాలి. సరైన ఆధారాలను సుప్రీంకోర్టు ముందు పెట్టడం ద్వారా ఆ కేసులను సిబిఐకి అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలి.

> **"గుజరాత్‌లో మైనార్టీ మతాలకు చెందిన ప్రజలను రెండో తరగతి పౌరులుగా చూడటం కొనసాగుతూనే ఉంది. వారి గృహాల్లో పునరావాసం, వారి వృత్తులను తిరిగి చేపట్టే హక్కు, వారి వ్యాపారాలు వాళ్లు చేసుకునే పరిస్థితి ఇంకా రాలేదు. పోటా చట్టం కింద అరెస్టు చేయబడిన వారిపై పోటా సమీక్షా కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేసేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం నిరాకరిస్తోంది."**

మహిళా హక్కులపై దాడి:

ఇటీవలి కాలంలో మత పెద్దలు విడుదల చేస్తున్న ఫత్వాలు మహిళల ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఉన్నాయి. తన మామ చేత అత్యాచారానికి గురైన ఇమ్రానా ఆ కారణంగా భర్త నుండి విడిపోవాలని ఫత్వా విడుదల చేయడం దిగ్భ్రాంతికరం. ఈ అరాచకాన్ని మానవ హక్కుల ఉల్లంఘనగా, బాధితురాలిని బాధించడంగా పార్టీ పేర్కొంది. స్థానిక ఎన్నికల్లో ముస్లిం మహిళలు పాల్గొనడంపై షరతులు, నియంత్రణలు విధిస్తూ మరో ఫత్వా విడుదల చేశారు. అటువంటి ఫత్వాలను ముస్లిం మతస్థులే గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. ప్రాథమిక హక్కుల ఉల్లంఘనను వ్యతిరేకించడంలో, ముస్లిం మహిళల హక్కులకు మద్దతు తెలపడంలో ఇతర ప్రజాస్వామ్య శక్తులతో కలిసి మనపార్టీ ఎప్పుడూ ముందుండాలి.

ప్రొఫెషనల్ విద్యా సంస్థలపై:

ప్రయివేట్ అన్‌ఎయిడెడ్ వృత్తి విద్యా సంస్థలు అడ్మిషన్ విధానాన్ని స్వేచ్ఛగా నిర్ణయించుకోవచ్చని, ఫీజులను నిర్ణయించుకోవచ్చునని ఏడుగురు సభ్యులతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పునిచ్చింది. ఈ అంశాల్లో రాష్ట్రాలకు ఎటువంటి పాత్రలేదని పేర్కొంది. ప్రవాస భారతీయుల కోటా కింద 15 శాతం సీట్లను ప్రత్యేకంగా ఉంచాలని ఆదేశించింది. ఎస్‌సి, ఎస్‌టి, బిసీలకున్న రిజర్వేషన్లను రద్దు చేసింది. టిఎంఎ పాయ్ ఫౌండేషన్ కేసు తీర్పుతో గతంలోనే దెబ్బతిని ఉన్న పరిస్థితిని ప్రస్తుత తీర్పు మరింత దారుణం చేసింది. ఎవరికి సీట్లు ఇవ్వాలి, ఎంత ఫీజు నిర్ణయించాలనే స్వేచ్ఛను ప్రయివేట్ సంస్థలకు ఇచ్చిన కారణంగా అత్యధిక ప్రజానీకం ఉన్నత విద్యకు దూరమౌతారు. ఈ తీర్పు విద్య వ్యాపారీ కరణకు పూర్తిగా తలుపులు తెరిచింది. అడ్మిషన్లను, ఫీజులను నియంత్రించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకురావాలని ఇప్పటికే పార్టీ, ఇతర ప్రజాతంత్ర శక్తులు డిమాండ్ చేశాయి. తాజా తీర్పుతో ఈ చట్టం మరింత తొందరగా తీసుకురావడం అవసరం. ఆ చట్టాన్ని తెచ్చేందుకు అంగీకరించిన ప్రభుత్వం వ్యాపారీకరణను నియంత్రించేలా, రిజర్వేషన్లు పునరుద్ధరించేలా చట్టాన్ని తేవాలి.

మహారాష్ట్రలో వరదలు:

మహారాష్ట్రలో సంభవించిన వరదల కారణంగా వెయ్యిమంది ప్రాణాలు కోల్పోగా ముంబాయి, థానే, రాయ్‌ఘఢ్ బాగా నష్టపోయాయి. ముంబాయిలో పౌరజీవనం పూర్తిగా స్తంభించింది. రాష్ట్ర పరిపాలనా యంత్రాంగం, ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ చేష్టలుడిగి చూస్తూ ఉండిపోయాయి. తక్షణ సహాయక చర్యలు తీసుకొని పరిస్థితిని చక్కదిద్దడంలోనూ, విద్యుత్, మంచినీటి సరఫరా లాంటి అత్యవసర సేవలను పునరుద్ధరించడంలోనూ అధికార యంత్రాంగం విఫలమయింది. పంటలు, పశువులు దెబ్బతినడం వల్ల రైతులు భారీగా నష్టపోయారు. ఇప్పుడైనా ముంబాయి వైపరీత్యం నుండి పాఠాలు నేర్చుకోవాలి. రియల్ ఎస్టేట్ ప్రమోటర్లు, బిల్డర్ల లాబీల ప్రయోజనాలకు తలొగ్గకుండా పట్టణాల అభివృద్ధికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలి. ప్రణాళికాయుత పట్టణాభివృద్ధికి, వైపరీత్యాల నియంత్రణ విధానాలు రూపొందించడానికి కేంద్ర ప్రభుత్వం అవసరమైన మేరకు సహాయ, సహకారాలు అందించాలి.

అయోధ్యలో తీవ్రవాదుల దాడులు:

నలుగురు సభ్యులతో కూడిన ఆత్మాహుతి దళం అయోధ్యలోని వివాదస్పద స్థలంలోకి జొరబడటానికి ప్రయత్నించగా పారామిలిటరీ బలగాలు వారిని హతమార్చారు. భద్రతా దళాలు జాగరూకతతో ఉండి దాడిని తిప్పికొట్టారు. ఈ ఘటన జరిగిన తరుణంలో బిజెపిలో అద్వానీపై వివాదం జరుగుతోంది. తీవ్రవాదుల దాడిని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవాలనుకున్న బిజెపి దేశవ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చింది. బిజెపి పాలిత రాష్ట్రాల్లోని రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లోనూ, చత్తీస్‌ఘఢ్, జార్ఖండ్‌లోని కొన్ని ప్రాంతాల్లోనూ బంద్ నిర్వహించారు. మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకు జరిపిన తీవ్రవాదుల దాడిని పార్టీ ఖండించింది. భద్రత దళాల సాహసాన్ని కొనియాడింది.

జమ్ము, కాశ్మీర్ పరిస్థితి:

సైనికులను, సామాన్యులను లక్ష్యంగా చేసుకొని తీవ్రవాదులు దాడులు జరపడం కాశ్మీర్ లోయలో నిత్యకృత్యమయింది. పాకిస్తాన్ నుండి చొరబాట్లు జరిగేందుకు కూడా ఈ దాడులు ఉపయోగపడుతున్నాయి. అయితే గతం కంటే చొరబాట్ల సంఖ్య తక్కువ. కుప్వారా ఘటనలో తీవ్రవాదులనే పొరబాటు అవగాహనతో సైన్యాలు ముగ్గురు బాలలను కాల్చి చంపడం దిగ్భ్రాంతికరం. స్థానిక ప్రజల నుండి వేరుపడకుండా ఉండేందుకు ఇటువంటి పొరబాటు ఘటనలను పూర్తిగా నివారించాల్సిన అవసరాన్ని ఈ విషాద సంఘటన తెలుపుతోంది. జమ్ముకాశ్మీర్‌లోని అన్ని రాజకీయ పార్టీలతో, అన్ని శక్తులతో రాజకీయపరంగా చర్చలు ప్రారంభించడానికి కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. ఈ రాజకీయ చర్చల్లో భారత్-పాక్ చర్చలూ ఒక భాగం కావాలి. అటువంటి రాజకీయ చొరవ లేకుండా ప్రస్తుత పరిస్థితిలో ఎటువంటి పురోగతి ఉండదు. రాజకీయ పరమైన పరిష్కారానికి అడ్డంకులు ఏర్పడితే ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతుంది.

మణిపూర్:

గ్రేటర్ నాగాలాండ్ డిమాండ్ సాధన కోసం నాగాలాండ్ స్టూడెంట్ యూనియన్ రెండు జాతీయ రహదారులను దిగ్బంధనం చేసిన తరువాత మణిపూర్‌లో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. దీంతో రాష్ట్రానికి

> "అక్రమ వలసలను నియంత్రిం చాలనేది మన పార్టీ వైఖరి. అయితే ఆ పేరుతో భారత పౌరులుగా ఉన్న ముస్లిమ్ ప్రజల హక్కులకు భంగం కల్గించకూడదు. వారిపై ఎటువంటి వేధింపులు ఉండకూడదు. వారి హక్కుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం సరైన చర్యలు చేపట్టాలి."

నిత్యావసర వస్తువుల సరఫరా తగ్గిపోయి తీవ్ర మైన కొరత ఏర్పడి అమాంతం ధరలు పెరిగి పోయాయి. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని దిగ్బంధనం ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రికి మన పార్టీ లేఖ రాసింది.

ఐఎమ్‌డిటి చట్టం రద్దు:

ఐఎమ్‌డిటి చట్టం (ఇల్లీగల్ మైగ్రేంట్స్ - డిటర్మినేషన్ బై ట్రిబ్యునల్స్ చట్టం)ను సుప్రీంకోర్టు త్రోసిపుచ్చింది. గవర్నర్ నివేదికను ఆసరాగా చేసుకొని అతిగా స్పందించి చట్టాన్ని రూపొందించారని సుప్రీంకోర్టు పేర్కొంది. అక్రమ వలసలను నియంత్రిం చాలనేది మన పార్టీ వైఖరి. అయితే ఆ పేరుతో భారత పౌరులుగా ఉన్న ముస్లిమ్ ప్రజల హక్కులకు భంగం కల్గించకూడదు. వారిపై ఎటువంటి వేధింపులు ఉండకూడదు. వారి హక్కుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం సరైన చర్యలు చేపట్టాలి. బంగ్లాదేశ్‌తో ఒప్పందం చేసుకోవడం ద్వారానే ఇకనుండైనా అక్రమ వలసలు జరగకుండా నిరోధించగలం.

వ్యవసాయ సంక్షోభం:

వ్యవసాయ రంగంలో సంక్షోభం కారణంగా గ్రామీణ ప్రాంతంలో ఏర్పడ్డ నిరుద్యోగం, అనిశ్చితి ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల కరవు ఏర్పడింది. పౌష్టికాహారం లేమితో మహారాష్ట్రతోపాటు ఇతర రాష్ట్రాల్లోని గిరిజన ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో పిల్లలు చనిపోవడం దిగ్భ్రాంతికరం. ఈ ప్రాంతాల్లో ప్రజాపంపిణీ వ్యవస్థ నిర్వీర్యం కాబట్టే మరణాలు సంభవిస్తున్నాయి.

భూమి, ఆహారం (రేషన్ కార్డులు) కోసం సెప్టెంబర్‌లో నిర్వహించాల్సిన పోరాటాల ప్రాధాన్యతను పై ఘటన తెలుపుతోంది.

రాజస్థాన్ రైతుల పోరాటం:

రాజస్థాన్ ప్రభుత్వం కాల్వలకు నీరు విడుదల చేయాలన్న ఒప్పందాన్ని తిరస్కరించడంతో గంగానగర్, హనుమంత్‌గర్ జిల్లాల్లోని రైతాంగం పోరాటం ప్రారంభించింది. కిసాన్‌సభ, పార్టీతోపాటు ఇతర ప్రజాతంత్ర శక్తుల ఆధ్వర్యంలో జరిపిన పోరాటంపై ప్రభుత్వం పెద్ద ఎత్తున దమనకాండ సాగించింది. గత రెండునెలల కాలంలో వందలకొద్ది నాయకులు, కార్యకర్తలు జైళ్ళ పాలయ్యారు. కస్టడీలోకి తీసుకున్న తరువాత పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడైన హెత్రామ్ బెనివాల్‌ను చావబాదారు.

ఈ పోరాటానికితోడు పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా జైపూర్‌లో పెద్దఎత్తున రైతులు రోడ్లపై బైఠాయించారు. రాజస్థాన్ చరిత్రలోనే అత్యధిక మంది రైతులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ ఉద్యమానికి కేంద్రకమిటీ పూర్తి మద్దతు పలికింది. న్యాయమైన డిమాండ్లను అంగీకరించాల్సిందిగా ఆ రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజాస్వామ్య శక్తులన్నీ ఒత్తిడి తేవాలని కోరింది.

గుర్గావ్ అణిచివేత-కార్మిక వర్గంపై దాడులు:

ఢిల్లీకి సమీపంలో గుర్గావ్‌లో ఉన్న హోండా ఫ్యాక్టరీ కార్మికులపై జరిపిన క్రూరమైన దాడులకు అన్ని వైపుల నుండి వ్యతిరేకత వ్యక్తమయింది. జిల్లా అధికారుల ఆదేశంతో పోలీసులు పథకం ప్రకారం చేసిన దాడిలో వందలాది కార్మికులు గాయపడ్డారు. పార్లమెంట్‌లో ఈ అంశంపై గట్టిగా పట్టుబట్టిన వామపక్షాలు ఆ రాష్ట్ర ప్రభుత్వ వాదనలకు అనుకూలంగా హోంశాఖామంత్రి చేసిన ప్రకటనను నిరసిస్తూ పార్లమెంట్‌నుండి వాకౌట్ చేశాయి. గుర్గావ్ దాడులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరిగాయి. ప్రజావ్యతిరేకత వెల్లువలా రావడంతో రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి తొలగించిన కార్మికులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకుంది. జైళ్లలో ఉన్న వారిని విడుదల చేసింది.

సంఘాన్ని ఏర్పరుచుకునే తమ ప్రాథమిక హక్కు కోసం హోండా కార్మికులు ఉద్యమం చేపట్టారు. బహుళజాతి సంస్థలు, భారత్ కంపెనీలు నడిపే పరిశ్రమల్లో కార్మిక చట్టాలను ఉల్లఘించడం, కార్మిక వర్గ హక్కులను కాలదన్నడం సర్వసాధారణ అంశంగా మారిపోయింది. పంజాబ్‌లోని లూధియానాలో గత రెండేళ్లుగా తమ సంఘాన్ని రిజిస్టర్ చేయించుకునేందుకు వేలాది మంది సైకిల్ పరిశ్రమ కార్మికులు అధికారులపై పోరాడుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ అద్దాలు, గాజుల పరిశ్రమల కార్మికులు, కనీస వేతనం, ఎనిమిది గంటల పని విధానం లాంటి చట్టం కల్పించిన హక్కుల సాధన కోసం సంఘటితం కావాలనుకొన్నందుకు అణిచివేతకు గురవుతున్నారు. కార్మిక చట్టాల్లో పేర్కొన్న కనీస హక్కులను కూడా ఉల్లంఘిస్తున్నారు. చట్టాలను సంస్కరించే పేరుతో ఉన్న కనీస భద్రతను కూడా తొలగించేందుకు ఒత్తిళ్లు పెరుగుతున్నాయి.

విద్యుత్ రంగ ప్రయివేటీకరణ:

ఢిల్లీలో విద్యుత్ పంపిణీ ప్రయివేటీకరణ దుష్ఫలితాలు ఒక్కొక్కటీ బయటపడుతున్నాయి. ప్రయివేటీకరణ తరువాత సర్వీసులో ఎటువంటి మెరుగుదల లేదని, ఛార్జీలు మాత్రం పెరిగాయని ప్రజలు గ్రహించారు. విద్యుత్ పంపిణీని అప్పగించిన రెండు పెద్ద కంపెనీలు తమ జోన్లలో మెరుగైన సేవలను అందించడంలో విఫలమై పరిస్థితిని మరింత దిగజార్చాయి. అయితే అవి ఢిల్లీ ప్రభుత్వం నుండి మాత్రం అనేక ప్రయోజనాలు పొందాయి. ఇటీవల పదిశాతం పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజల నుండి నిరసన రావడంతో ఒత్తిడికి తలొగ్గిన ఢిల్లీ ప్రభుత్వం ఛార్జీల పెంపును రద్దు చేసింది. ఆ తరువాత కూడా ఛార్జీల తగ్గింపులో ఐదుశాతం మేరకు ప్రయివేట్ కంపెనీలకు సబ్సిడీ ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ముంబాయిలో సంభవించిన వరదల వైపరీత్యానికి దెబ్బతిన్న విద్యుత్ సరఫరాను ప్రభుత్వరంగ కంపెనీలు వెంటనే పునరుద్ధరించగా రిలయన్స్ కంపెనీ సరఫరా చేస్తున్న ప్రాంతాలకు మాత్రం చాలా రోజులపాటు జాప్యం జరిగింది. విద్యుత్, మంచినీటి సరఫరాల ప్రయివేటీకరణను, ప్రయివేటీకరణ ప్రయత్నాలను వ్యతిరేకించాలి. ప్రజాఉద్యమాలను నిర్వహించాలి.

యుపిఎ - వామపక్షాల సమన్వయ కమిటి:

బిహెచ్ఇఎల్‌లో పెట్టుబడుల

(మిగతా 35వ పేజీలో)

యూరోపియన్ కార్మికవర్గం

'సామాజిక ఒప్పందపు' సంకెళ్లను ఛేదించాలి

అస్బజర్న్ వాల్హ్

యుద్ధానంతర కాలంలో కార్మిక వర్గాకీ పెట్టుబడికీ మధ్య కుదిరిన 'సామాజిక ఒప్పందం', కార్మిక సంఘాలూ, యజమానుల మధ్య శాంతియుత సహజీవనం అన్న విధానాలు తుత్తునియలయ్యాయి. 'సామాజిక ఒప్పందం' నుండి పెట్టుబడి తనంతట తానుగా ఉపసంహరించుకొని సంఘటిత కార్మికవర్గంతో ఘర్షణ మార్గం ఎంచుకుంది.

యూరోప్ కార్మికోద్యమం నేడు ఆత్మరక్షణలో పడింది. తీవ్రమైన రాజకీయ, సైద్ధాంతిక సంక్షోభంలో మునిగింది. నేడు కార్మికసంఘాలు తమ సభ్యుల ఆర్థిక, సామాజిక ప్రయోజనాల పరిరక్షణకోసం నిర్వహించాల్సిన పాత్ర పోషించలేకపోతున్నాయి. అన్ని రంగాలలో, అన్ని పరిశ్రమలలో యూనియన్లు పునాది కోల్పోయాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతరకాలంలో పెట్టుబడిదారీ ప్రపంచంలోనే అత్యంత బలోపేతమైన, ప్రభావవంతమైన కార్మికోద్యమం నేడు బహిరంగంగానే గందరగోళంలో పడింది. స్పష్టమైన దృక్పథం లోపించింది. నూతన సామాజిక,రాజకీయ అవగాహన కల్పించు కోవడానికి సందేహిస్తోంది. రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో ఏ సిద్ధాంతాలు, విశ్లేషణలు, విధానాలు కార్మికసంఘాలకు బలం చేకూర్చాయో, చిత్రంగా నేడు అవే ఆ సంఘాల పాలిట భారంగా పరిణమించాయి. 'సామాజిక ఒప్పందా'నికి సంబంధించిన సైద్ధాంతిక వారసత్వమే కార్మికోద్యమాన్ని దారీతెన్నూ లేని ప్రయాణానికి పురికొల్పింది.

నయా ఉదారవాదం ఎదురుదాడి

మన సమాజాలు నయా ఉదార వాదానికి గురికావడమే ఈ పరిణామాలకు కారణం. ఆ మొత్తం క్రమాన్ని సవివరంగా విశదీకరించడం ఈ వ్యాసం ఉద్దేశ్యం కాదుకానీ కొన్ని ముఖ్యమైన అంశాలను మాత్రం చెప్పుకోవాలి. గత ఇరవై ఏళ్లుగా మనం నయా ఉదారవాద శక్తుల పెను దాడులు ఎదుర్కోవాల్సి వచ్చింది. పెట్టుబడిదారీ శక్తులు ఎదురుదాడికి దిగడంతో కార్మికులకూ, పెట్టుబడికీ మధ్య బలాబలాల పొందికలో పెనుమార్పులు సంభవించాయి. ఈ ప్రక్రియను బహుళజాతి కంపెనీలు ముందుపీఠిన ఉండి నడిపించాయి. ఫలితంగా యుద్ధానంతర కాలంలో కార్మిక వర్గాకీ పెట్టుబడికీ మధ్య కుదిరిన 'సామాజిక ఒప్పందం', కార్మిక సంఘాలూ, యజమానుల మధ్య శాంతియుత సహజీవనం అన్న విధానాలు తుత్తునియలయ్యాయి. 'సామాజిక ఒప్పందం' నుండి పెట్టుబడి తనంతట తానుగా ఉపసంహరించుకొని సంఘటిత కార్మికవర్గంతో ఘర్షణ మార్గం ఎంచుకుంది. బహుళజాతి కంపెనీలూ, వాటి రాజకీయ సేవకులూ తమకు కొత్తగా వచ్చిన అధికారాన్ని పదిలపరుచు కోవడానికి, సంస్థాగతం చేయడానికి ఈ విధమైన మార్గాన్ని ఎన్నుకున్నాయి. ఈ మొత్తం వ్యవహారాన్ని నడిపించడానికి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలనూ, ప్రపంచ వాణిజ్య సంస్థద్వారా ముందుకు తెచ్చిన ఒప్పందాలనూ, 'యూరోపియన్ యూనియన్' వంటి ప్రాంతీయ అధికార కేంద్రాలనూ ఉపయోగపెట్టుకున్నాయి. స్థానిక, రాష్ట్ర ప్రభుత్వాలతో పోలిస్తే పై సంస్థలకు ప్రజాస్వామ్యం పట్ల మక్కువ తక్కువ. అందుకే అవి కార్పొరేట్ అధికారాన్ని సంస్థాగతం చేయడానికి అత్యంత ఉపయుక్తమైన, ప్రభావవంతమైన సాధనాలుగా ఉపయోగపడుతున్నాయి. ఈ రోజున నయా ఉదారవాద సామాజిక, ఆర్థిక నమూనాను యూరప్ ఖండమంతటా సంస్థాగతం చెయ్యడానికే 'యూరోపియన్ యూనియన్' అన్న భావాన్ని చలామణిలోకి తెచ్చారు. యూరోపియన్ యూనియన్ కానివ్వండి మరే ఇతర ప్రాంతీయ బహుళ దేశ కూటమి కానివ్వండి-వాటి నిర్మాణానికి కీలకం బలాబలాల పొందికలోని మార్పే. కాబట్టి కార్మికవర్గం ప్రస్తుత బలాబలాల పొందికను తనకు అనుకూలంగా మార్చు కోకుండా ఈ కూటములను ప్రజాస్వామీ కరించడం గాని, మార్చడం గాని లేక ఓడించడంగాని చేయజాలదు. ఇలాంటి మార్పు సాధించాలంటే ప్రజాతంత్ర, కార్మికవర్గ అధికార సాధనే దీర్ఘకాలిక లక్ష్యంగా కార్మికోద్యమం ముందుకు సాగాలి.

నూతన పరిస్థితులు, పాత విధానాలు

దురదృష్టవశాత్తూ ఈ రోజున యూరప్ కార్మికోద్యమం ముందు, కార్మికవర్గ శక్తిని సమీకరించే ప్రణాళికలు ఏమీ లేవు. కార్మికసంఘాలు పనిచేస్తున్న ఆర్థిక, రాజకీయ

వ్యాసరచయిత నార్వే మున్సిపల్, హెల్త్ వర్కర్స్ కార్మిక సంఘ ప్రతినిధి. అంతర్జాతీయ రవాణారంగ కార్మిక ఫెడరేషన్‌లో రోడ్డు రవాణా కార్మిక విభాగానికి ఉపాధ్యక్షుడు. సంక్షేమ రాజ్యం, సామాజిక హక్కుల పరిరక్షణ కోసం ప్రైవేటీకరణ – నియంత్రణల సడలింపులకు వ్యతిరేకంగా సాగే కార్మికోద్యమాల సమన్వయ కేంద్రానికి కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు.

“ కార్మికవర్గంతో పెట్టుబడి 'సామాజిక ఒప్పందం' ద్వారా రాజీ కుదుర్చుకోవడానికి ప్రధాన కారణం కార్మిక సంఘాల, కార్మికోద్యమాల యొక్క బలమేనన్న విషయాన్ని మనం ఇక్కడ ముఖ్యంగా గమనించాలి. తాము కార్మిక సంఘాలను ఎన్నటికీ ఓడించలేమని యజమానులు, వారి సంఘాలు గుర్తించాయి. ”

వాతావరణంలో విస్తారమైన మార్పులు వచ్చినప్పటికీ యూనియన్లు మాత్రం ఇంకా 'సామాజిక ఒప్పంద'కాలం నాటి పని పద్ధతులకే పరిమితమయిపోవడం కార్మికవర్గం ఎదుర్కొంటున్న విచిత్ర పరిస్థితి. ప్రపంచీకరణ అనేదాన్ని వారు- వర్గసంబంధాల్లోనూ, అధికార బలాబలాల్లోనూ మార్పువల్ల, పకబ్బందీ ఎత్తుగడలవల్ల వచ్చిన పరిణామంగా గుర్తించడం లేదు. అనివార్యమైన సంస్థాగత, సాంకేతిక మార్పుల పర్యవసానంగా ఈ పరిణామాలు సంభవించినట్లు కార్మికసంఘాలు భావిస్తున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే మార్గరేట్ థాచర్ చెప్పినట్లు 'ఇంతకుమించి ప్రత్యామ్నాయం లేదు' అన్న ధోరణికి లోనయ్యాయి. 'సామాజిక ఒప్పందాన్ని' జాతీయస్థాయి నుండి ప్రాంతీయస్థాయికి, ప్రపంచస్థాయికి కొనిపోవాల్లని అవి భావించాయి. యజమానుల సంఘాలతోనూ, రాజ్యంతోనూ, బహుళజాతి సంస్థలతోనూ 'సామాజిక చర్చ' నెరపడం – అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల్లోనూ, వాణిజ్య సంస్థల్లోనూ ఐఎల్ఓ తీర్మానాలకు అనుగుణమైన కార్మిక ప్రమాణాలు నెలకొల్పాలని ఆందోళన నిర్వహించడం – కార్పొరేట్ సామాజిక బాధ్యత నియమావళిని అమలుచేయాలని అడగడం – బహుళజాతి కంపెనీలతో పద్ధతులకు సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకోవడం – వంటి 'అడిగే' పద్ధతులకు అలవాటుపడ్డాయి. ఐఎల్ఓ తీర్మానాలకు అనుగుణంగా వారడిగే కార్మిక ప్రమాణాలు ఎలాంటివంటే, బలవంతపు చాకిరి నిషేధించడం, స్వతంత్ర సంఘాలు పెట్టుకునే హక్కు, ఉమ్మడి బేరసారాలకు అవకాశం.....మొదలైనవి. బహుళజాతి, కార్పొరేట్ కంపెనీలతో ప్రమాణాలకు సంబంధించిన ఒప్పందాలన్నీ ఆ కంపెనీలు స్వచ్ఛందంగా అమలు చెయ్యాల్సినవి, ఎటువంటి కట్టుబాట్లూ లేనివి, చట్టపరంగా మనలేనివి-ఎందుకంటే వీటిని బహుళజాతి కంపెనీలే రూపొందించాయి కాబట్టి. నిజానికి ఈ ప్రమాణాలేవీ ఇంతవరకూ కార్పొరేట్ కంపెనీల పనితీరుమీద గుర్తించదగ్గ ప్రభావం చూపించలేకపోయాయి. అనేక బహుళజాతి కంపెనీలు ఈ ప్రమాణాలను అడ్డం పెట్టుకొని తమపట్ల ప్రజల్లో ఉన్న ప్రతికూల భావాన్ని రూపుమాపుకోవడానికి చూస్తున్నాయి. యూరప్ కార్మికవర్గం- 'సామాజిక మార్పు' సాధించడానికి ప్రజాబాహుళ్యాన్ని, వర్గ శక్తుల్ని సమీకరించాలన్న విషయాన్ని గుర్తించకుండా, అధికార బలాబలాల పరిస్థితిని నిర్దిష్టంగా అంచనావేయకుండా – ఈ 'సామాజిక చర్చ' అన్న వ్యూహాన్ని అనుసరించింది. ఇవ్వాళ్టి పరిస్థితులను సరిగా అంచనా వెయ్యాలంటే యూరోపియన్ కార్మికోద్యమ చరిత్రను మనం మరింత నిశితంగా పరిశీలించాలి. మరీ ముఖ్యంగా 'సామాజిక ఒప్పందం' అనే విధానానికి దారితీసిన చరిత్రను పరిశీలించాలి. ఎందుకంటే యూరప్ కార్మికోద్యమం నేడు ఎదుర్కొంటున్న రాజకీయ, సైద్ధాంతిక సంక్షోభాన్ని అర్థం చేసుకోవాలంటే ఈ సామాజిక ఒప్పందం ప్రభావాన్ని ముఖ్యంగా అర్థం చేసుకోవాల్సి ఉంది.

కార్మికవర్గానికి పెట్టుబడికి కుదిరిన చారిత్రక రాజీ

ఇరవయ్యవ శతాబ్దంలో పశ్చిమ యూరప్ కార్మికోద్యమం క్రమంగా పెట్టుబడిదారీ ప్రయోజనాలతో శాంతియుతంగా సర్దుబాటుచేసుకునే ధోరణికి లోనయ్యింది. 1930వ దశకంలో ఉత్తరయూరప్‌లోని అనేకచోట్ల యజమానుల సమాఖ్యలతో కార్మికసంఘాలు ఒప్పందాలు కుదుర్చుకోవడంతో ఈ రకమైన సర్దుబాటు తొలుత సంస్థాగతమైంది. రెండవ ప్రపంచయుద్ధం తరువాత పశ్చిమ యూరప్ అంతటా ఇవే పరిణామాలు చోటు చేసుకున్నాయి. పెట్టుబడికి-కార్మికవర్గానికి మధ్యన కుదిరిన 'సామాజిక ఒప్పందం' పునాదిగా సంక్షేమ రాజ్యం అభివృద్ధి చెందింది. వేతనాలు, పని పరిస్థితులు క్రమంగా మెరుగయ్యాయి. పెట్టుబడికి-కార్మికవర్గానికి నిరంతర ఘర్షణ ఉంటుందన్న కాలం నుండి ద్వైపాక్షిక, త్రైపాక్షిక చర్చలు, ఏకాభిప్రాయ సాధన విధానాల ద్వారా పౌర సమాజాలు 'సామాజిక శాంతి' కాలంలోకి ప్రవేశించాయి. సంక్షేమం, వేతనాలు, పని పరిస్థితులలో మెరుగుదల మూలంగా ఈ విధానానికి కార్మికవర్గం నుండి భారీ మద్దతు లభించింది. పర్యవసానంగా కార్మికవర్గానికి ఉండాల్సిన పెట్టుబడిదారీ వ్యతిరేక, అతివాద పార్శ్వాలు క్రమంగా మొద్దుబారిపోయాయి. ఆ రకంగా కార్మికవర్గం రాజకీయ రాహిత్యానికి, సమరశీల స్వభావాన్ని కోల్పోవడానికి దారితీసి, కార్మిక సంఘాలు బ్యూరోక్రటిక్ ధోరణులకు లోనయ్యాయి. సోషల్ డెమొక్రాటిక్ పార్టీలు ఈ వర్గ సామరస్య విధానాన్ని అమలు చెయ్యడంలో చారిత్రక పాత్ర పోషించాయి. అందుకే నేడు కార్మికసంఘాలను పట్టి పీడిస్తున్న సమస్యలే సోషల్ డెమొక్రాట్ పార్టీలను కూడా పట్టి పీడిస్తున్నాయంటే అందులో ఆశ్చర్యపోవాల్సింది ఏమీ ఉండదు.

కార్మికవర్గంతో పెట్టుబడి 'సామాజిక ఒప్పందం' ద్వారా రాజీ కుదుర్చుకోవడానికి ప్రధాన కారణం కార్మికసంఘాల, కార్మికోద్యమాల యొక్క బలమేనన్న విషయాన్ని మనం ఇక్కడ ముఖ్యంగా గమనించాలి. తాము కార్మికసంఘాలను ఎన్నటికీ ఓడించలేమని యజమానులు, వారి సంఘాలు గుర్తించాయి. కార్మికసంఘాలను కార్మికుల ప్రతినిధులుగా గుర్తించి వాటితో చర్చలు జరపడం వాటికి అనివార్యం అయ్యింది. ఒక్కమాటలో చెప్పాలంటే పెట్టుబడికీ-కార్మికవర్గానికీ మధ్య కుదిరిన 'శాంతి ఒప్పందానికి' మూలం బలమైన కార్మికోద్యమ పునాదే. ఇంకో ముఖ్యమైన అంశం ఏమిటంటే-రెండవ ప్రపంచ యుద్ధానంతరం పెట్టుబడిదారీ విధానం ఒక ఇరవైయ్యేళ్ల పాటు నిలకడయిన, బలమైన ఆర్థికాభివృద్ధి సాధించింది. దీనివల్ల వచ్చిన లాభాన్ని కార్మికవర్గం, పెట్టుబడి, ప్రజాసంక్షేమాల మధ్య పంచడానికి అవకాశం ఏర్పడింది. 'సామాజిక ఒప్పందం'లో నిర్ణయాత్మక భాగం ఏమిటంటే పెట్టుబడి, మార్కెట్లు జాతీయ నియంత్రణలో ఉండడం. అన్ని దేశాలలోనూ పెట్టుబడులమీద నియంత్రణ ఉన్నకాలం అది. పెట్టుబడికి –

కార్మికవర్గానికి మధ్య దేశ సరిహద్దుల లోపలే శాంతియుతంగా ఒప్పందాలు జరిగిపోయేవి. ఫలితంగా కార్మికోద్యమం మరింతగా జాతీయవాద దృక్పథాన్ని అలవరచుకున్నది. కార్మికోద్యమానికి కీలకంగా ఉండవలసిన 'అంతర్జాతీయత' క్రమేపీ సన్నగిల్లి అదికాస్తా (ఐఎల్ఓ వంటి) అంతర్జాతీయ సంఘాలతో నెరపే రాయబారాల స్థాయికి, ట్రేడ్ యూనియన్ 'టూర్ల' స్థాయికి దిగజారింది. కార్మిక సంఘాల్లోని సభ్యుల తక్షణావసరాలు, ప్రయోజనాలతో ట్రేడ్ యూనియన్లకు సంబంధం లేకుండా పోయింది. అయితే అంతర్జాతీయతకు సంబంధించిన వాగాడంబరత మాత్రం వాటిదగ్గర మిగిలిపోయింది.

'సోషలిజం' గురించిన ప్రగల్భాలు పక్కన పెడితే, 'సామాజిక ఒప్పందా'నికి కార్మికసంఘాలు సిద్ధపడ్డాయంటే అర్థం అవి పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమాన్ని అంగీకరించాయన్నమాటే. ఉత్పత్తి సాధనాలమీద ప్రైవేటు యాజమాన్యాన్నీ, కార్మిక సంవిధానాలను యజమానులు తీర్చిదిద్దే వాక్కులనూ అంగీకరించాయన్నమాటే. పని పరిస్థితుల్లోనూ, సంక్షేమ కార్యక్రమాల్లోనూ కొంత మెరుగుదల సాధించిన కార్మికసంఘాల సమాఖ్యలు అందుకు బదులుగా పారిశ్రామిక శాంతికి, వేతనాల చర్చలలో 'సహనం' పాటించడానికి అంగీకరించాయి. దీన్నే మరోలా చెప్పాలంటే, కార్మికవర్గం తన సోషలిస్టు కర్తవ్యాన్ని వదులుకుని, దానికి మారుగా సంక్షేమ రాజ్యాన్ని, పని పరిస్థితులలో క్రమ మెరుగుదలనూ పొందింది. ఇవాళ ఉన్న ప్రత్యేక చారిత్రక సందర్భంలో కార్మికవర్గం సాధించుకున్నది స్వల్పకాలిక ప్రయోజనాలే. ఇందుకుగాను కార్మికవర్గం తన సమరశీలతను, రాజకీయ అవగాహనను పణంగా పెట్టాల్సి వచ్చింది.

సోవియట్ యూనియన్‌లోనూ, తూర్పు యూరప్ దేశాల్లోనూ పోటీ ఆర్థిక వ్యవస్థ ఉనికిలో ఉండటమే ఈ రకమైన పరిస్థితి తలెత్తడానికి కారణం. బ్రిటీష్ చరిత్రకారుడు ఎరిక్ హాబ్స్‌వామ్ చెప్పినట్లు, దీనివల్లనే పశ్చిమదేశాల పెట్టుబడిదారులు రాజీకి ఆమోదించారు. ఈ రాజీ ఆధారంగానే, రెండవ ప్రపంచ యుద్ధానంతరం మూడు దశాబ్దాల్లో అనేక సంక్షేమ సంస్కరణలు, సంస్థలు పుట్టుకొచ్చాయి. 1930వ దశకంలో ఏర్పడ్డ 'మహా మాంద్యం' నుండి, యుద్ధం నుండి సమరశీలతతో బయటపడ్డ కార్మికవర్గాన్ని దాని ప్రత్యర్థులైన పెట్టుబడిదారీ శక్తులు తెలివైన వ్యూహంతో ఎదుర్కొన్నారు. పెట్టుబడిదారులే స్వచ్ఛందంగా కార్మికులతో 'సామాజిక ఒప్పందం' చేసుకోవడానికి ముందుకు వచ్చారు. కార్మికోద్యమంలో సోషలిజం పట్ల అనురక్తిని దెబ్బతియ్యడానికి, కొంతకాలం పొద్దుపుచ్చడానికి కార్మికుల సామాజిక, ఆర్థిక డిమాండ్లు అనేకం పరిష్కరించారు. నేడు కార్మికవర్గం ఉన్న మూల మలుపు నుండి పరిశీలిస్తే పెట్టుబడిదారుల 'కార్పొరేట్ వ్యూహం' ఫలించిందనే చెప్పుకోవచ్చు. వర్గ సామరస్య విధానాల మూలంగా కార్మికవర్గంలోనే కొట్టొచ్చేట్లు తీవ్ర విభజన ఏర్పడింది. శ్రమని అమ్మడాన్ని, కొనడాన్ని కార్మికోద్యమం చర్చలద్వారా నియంత్రించగా – నిరుద్యోగులకు సామాజిక రక్షణ కల్పించడం వంటి సమస్యలను సోషల్ డెమొక్రట్ పార్టీలు పార్లమెంటులో చేపట్టాయి. ఫలితంగా కార్మికోద్యమం సంకుచిత ఆర్థికవాద దృక్పథానికి లోనయింది. ఇదే నేడు కార్మికసంఘాలను బలహీనపరిచింది. సోషల్ డెమొక్రాట్ పార్టీలు తమ పాత సంస్కరణవాద రాజకీయాల నుండి కూడా మరింతగా వైదొలగడానికి కారణమైంది.

“ వర్గసామరస్య విధానాల మూలంగా కార్మికవర్గంలోనే కొట్టొచ్చేట్లు తీవ్ర విభజన ఏర్పడింది. శ్రమను అమ్మడాన్ని, కొనడాన్ని కార్మికోద్యమం చర్చలద్వారా నియంత్రించగా - నిరుద్యోగులకు సామాజిక రక్షణ కల్పించడం వంటి సమస్యలను సోషల్ డెమొక్రట్ పార్టీలు పార్లమెంటులో చేపట్టాయి. ఫలితంగా కార్మికోద్యమం సంకుచిత ఆర్థికవాద దృక్పథానికి లోనయింది. ”

'సామాజిక ఒప్పందపు' సైద్ధాంతిక సారం

సామాజిక ఒప్పందాల శకంలో కార్పొరేట్ వ్యూహం కార్మికోద్యమాన్ని కబోదిగా మార్చేసింది. ఇరవై ఏళ్లపాటు జీవన పరిస్థితులు, పని ప్రమాణాలలో నిరంతర మెరుగుదల కనిపించింది. దాంతో వర్గ పోరాటం, సామాజిక ఘర్షణలతో నిమిత్తం లేకుండా పౌర సమాజం అభివృద్ధి చెందడానికి, సామాన్య ప్రజలకు కూడా సంపద పంపిణీలో వాటావచ్చే అవకాశం ఉందని కార్మికోద్యమం నమ్మింది. పెట్టుబడిదారీ సమాజం అత్యున్నత నాగరికతను అబ్బించుకున్నాదని భావించింది. క్రమానుగత సంస్కరణల ద్వారా కార్మికోద్యమం ఆర్థికవ్యవస్థమీద ప్రజాతంత్రయుతంగా పట్టు చేజిక్కించుకోవడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని అనుకుంది. సంక్షోభ రహిత పెట్టుబడిదారీ సమాజం సత్యమని నమ్మింది. 1930ల నాటి ఆర్థిక మాంద్యం లాంటి సంక్షోభాలు పునరావృతం కావని, మూకుమ్మడి నిరుద్యోగానికి తావు ఉండదని, సామాజిక అశాంతికి చోటే ఉండదని, ప్రజల దౌర్భాగ్యం తొలగిపోతుందని ఆశించింది. సామాజిక రంగాలన్నీ అభివృద్ధి పంథానే నడుస్తాయనీ – సోషలిజం సాధించడానికి ఇది సంస్కరణల బాటని, ఇది ఫలితాలను కూడా ఇస్తుందని కార్మికోద్యమంలోని వారెంతోమంది భావించారు. అప్పటిదాకా సాధించిన సామాజిక ప్రగతి 'సామాజిక ఒప్పందాలు' కుదుర్చుకోవడానికి ఆధారమైంది. ఆ రకంగా 'సామాజిక భాగస్వామ్యం' యూరప్ కార్మిక సంఘాలలో లోతుగా పాతుకుపోయింది. 1980 ప్రాంతంలో నార్వే ట్రేడ్ యూనియన్స్ కాన్ఫెడరేషన్ అధ్యయన విభాగం నిర్వహించిన కార్మికసంఘ శిక్షణా కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్ళిన నేను స్వయంగా అనేకమంది నోట మొదటిసారిగా ఈ భావాలే విన్నాను. ఇంకా అక్కడ నాకు నేర్పింది ఏమిటంటే – ఇరవయ్యవ శతాబ్దంలో తొలి మూడు దశాబ్దాల కాలం పెట్టుబడికి, కార్మికవర్గానికి మధ్య తీవ్రమైన ఘర్షణ జరిగింది. లాకౌట్లు, సంఘటిత కార్మికుల సమ్మెలమీద పోలీసు మిలిటరీ బల ప్రయోగాలూ...ఒకటేమిటి అనేక విధాలా విధ్వంసకాలం ఇది. చివరికి (1930కి) ఇంతా చేసి కార్మికవర్గానికి ఒరిగిందేమీ లేదు. ఈ ఘర్షణాత్మక పంథాని విడిచిపెట్టి కార్మికసంఘాలు, ఉద్యమాలు సామాజిక బాధ్యతను తలకెత్తుకున్నాకే నిజమైన ప్రగతి సాధ్యమయ్యింది. పని పరిస్థితులు

“అనేక కార్మిక సంఘాల నాయకత్వాలు వర్గ సామరస్య - సామాజిక శాంతి విధానాలతో పీకలలోతు కూరుకుపోయి ఉన్నందువల్ల ఇటువంటి దాడులను ప్రతిఘటించేందుకు ఏమాత్రం సిద్ధంగా లేవు. 'సామాజిక ఒప్పందపు' చట్రంలో ఇటువంటి నయా-ఉదారవాద దాడులను ఊహించనైనా లేదు. కార్మికసంఘాల నాయకత్వం నిర్లిప్తంగా ఉండిపోయింది. కార్మికోద్యమం అనివార్యంగా ఆత్మరక్షణలో పడింది.”

మెరుగుయ్యాయి. జీతాలు పెరిగాయి. సంక్షేమ పథకాలు వెలిశాయి. అంటే యజమానులతో ఘర్షణ వైఖరిని ఎంచుకుంటే వినాశనమూ, వాళ్లతో శాంతియుత సహజీవన పంథాను ఎంచుకుంటే అభివృద్ధివైపు పయనమూ సంభవిస్తాయి......ఇదీ 1980లలో మాకు నేర్పిన పాఠం. ఈ పాఠం అప్పటికీ, ఇప్పటికీ ముమ్మాటికీ తప్పుడు పాఠమే. ఈ తప్పుడు పాఠాన్ని కార్మికసంఘాలు ఒంటబట్టించు కున్నాయి. ఉన్న కొద్దిపాటి సామాజిక ఒప్పందం కూడా కుప్పకూలిపోయాక దీని పర్యవసానాలు మరింత తీవ్రంగా మారాయి. అసలు గుణపాఠం ఏమిటంటే, రెండవ ప్రపంచ యుద్ధానంతరం పెట్టుబడిదారులతో - వర్గ సామరస్య విధానాలతోనైనా - ఏదో ఒక మేరకు సంక్షేమం సాధించడం అనేది గతంలో జరిగిన పోరాటాల ఫలితంగానే జరిగింది. అంతకుముందు మూడు దశాబ్దాల తీవ్ర పోరాటాలద్వారా పెట్టుబడికి-కార్మికవర్గానికి మధ్య ఉన్న బలాబలాల పొందికను శ్రామికవర్గం తనకు అనుకూలంగా మలచుకోవడం వల్ల మాత్రమే ఆ తర్వాతకాలంలో ప్రగతి సాధించడం సాధ్యమయింది (చివరికి రష్యా విప్లవం కూడా దీనికి తోడ్పడింది). చెప్పాలంటే గతకాలపు ఘర్షణాత్మక పోరాటాలే తదనంతర కాలంలో శాంతియుత చర్చలద్వారా లాభాలు పొందడానికి కారణమయ్యాయి.

కుప్పకూలిన సామాజిక ఒప్పందం

వర్గ సామరస్య విధానమనేది గాజు కట్టడం లాంటిది. పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ స్థిరంగానూ, అత్యధికంగానూ వృద్ధిరేటు సాధిస్తున్నంతకాలమే దీని మనుగడకు అవకాశం. 1970లలో పశ్చిమదేశాల పెట్టుబడిదారీ విధానంలో తీవ్ర సంక్షోభం తలెత్తడం మొదలవడంతోనే వర్గ సామరస్యం క్రమంగా తెరమరుగయ్యింది. ఉప్పెనలా ఎగసిన సంక్షోభం పెట్టుబడిదారులను (కార్మికవర్గంపై) ఎదురుదాడికి పురికొల్పింది. కార్మికసంఘాల హక్కులు, జీతభత్యాలు, ప్రజారంగానికి చేసే ఖర్చులు-వీటన్నిటిమీద దాడి మొదలయ్యింది. సంక్షేమ రాజ్య భావనను వమ్ము చేసారు. సమరశీల రాజకీయాలు లేని కార్మికసంఘాలు, కార్మికోద్యమాలు ఈ పరిణామాలతో నివ్వెరపోయాయి. యజమానులతో చర్చలలో అసంఘటితంగా ప్రవర్తించసాగారు. గతంలో చర్చలు వేతనాల గురించి, పని పరిస్థితులలో మెరుగుదల గురించి జరిగితే నేడు ఆ పరిస్థితిని తలక్రిందులు చెయ్యడానికి, నియంత్రణలు నీరుగార్చడానికి యాజమాన్యాలు ఉపయోగ పెట్టుకున్నాయి. అనేక కార్మిక సంఘాల నాయకత్వాలు వర్గ సామరస్య - సామాజిక శాంతి విధానాలతో పీకలలోతు కూరుకుపోయి ఉన్నందువల్ల ఇటువంటి దాడులను ప్రతిఘటించేందుకు ఏమాత్రం సిద్ధంగా లేవు. 'సామాజిక ఒప్పందపు' చట్రంలో ఇటువంటి నయా-ఉదారవాద దాడులను ఊహించనైనా లేదు. కార్మికసంఘాల నాయకత్వం నిర్లిప్తంగా ఉండిపోయింది. కార్మికోద్యమం అనివార్యంగా ఆత్మరక్షణలో పడింది. అనేక దేశాల్లో కార్మికులు తమ ప్రయోజనాలను ఏమాత్రం కాపాడలేని యూనియన్ల సభ్యత్వానికి రాం రాం చెప్పారు. ఆ రకంగా కార్మికోద్యమానికి 1980లలో తీవ్ర నష్టం వాటిల్లింది. పశ్చిమ యూరప్ దేశాల్లోని సంఘటిత రంగ కార్మికుల యూనియన్ సభ్యత్వం దిగజారిపోవడం ఈ విషయాన్నే స్పష్టం చేస్తుంది. బ్రిటీష్ గని కార్మికుల సంఘంలా నయా-ఉదారవాద విధానాలను ప్రతిఘటించిన కొద్దిపాటి సంఘాలకు కూడా పరాజయమే దక్కింది. బ్రిటీష్ గని కార్మికులు పోరాటంలో పరాజయం పాలవడానికి కారణం థాచర్ పరిపాలన, గనుల యజమానులు చేసే దాడులు మాత్రమే కాదు. తమ సమరశీల పోరాటాలు 'సామాజిక ఒప్పందానికి' భంగం కలిగిస్తాయేమో అని భావించిన బ్రిటీష్ ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్ గని కార్మికుల సమ్మెకు మద్దతు పలకకపోవడం ప్రధాన కారణం. తరువాత కాలంలో ఆ రకంగా మద్దతు ఇవ్వకపోవడం పొరబాటే అని గుణపాఠం తెలుసుకుంది. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. విశేషం ఏమిటంటే బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ కాన్ఫడరేషన్ 'సామాజిక ఒప్పందం' పట్ల తన వైఖరిని, మద్దతును మార్చుకోలేదు. 1990ల మధ్యకాలంలో తూర్పు యూరప్‌లోని (సోషలిస్టు) ఆర్థికవ్యవస్థలు కుప్పకూలిపోవడంతో పశ్చిమదేశాల పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయం అదృశ్యమైపోయింది. పెట్టుబడిదారీ విధానం అన్ని రంగాలా ఆధిపత్యం సంపాదించింది. ఇక కార్మికులతో యజమానులకు రాజీ కుదుర్చుకోవాల్సిన అవసరం లేకపోయింది. నేడు పెట్టుబడిదారీ శక్తులు తమ సంకుచిత రాజకీయ ఆర్థిక ప్రయోజనాలకోసం ఎటువంటి మొహమాటానికి తావులేకుండా ఎంతకైనా తెగించడానికి అవకాశం దక్కింది. అందువల్లనే పశ్చిమ ఐరోపా దేశాలన్నింటా వర్గ సామరస్య నమూనాలను కాలరాయడం జరిగింది. ఇంకా జరుగుతోంది. అసలు వర్గ సామరస్య విధానానికి దారితీసిన నాటి చారిత్రక, ఆర్థిక పరిస్థితులు ఈనాడు లేవు. దాంతో 'సంక్షేమరాజ్యం' నానాటికీ తీవ్ర ఒత్తిడికి లోనవుతోంది. ఇరవై ఏళ్లక్రితమే నయా ఉదారవాద దాడులు మొదలయి, సామాజిక భాగస్వామ్య పాలసీని యజమానులు క్రమంగా నీరుగారుస్తుంటే కార్మిక సంఘాల బ్యూరోక్రటిక్ నాయకత్వాలు ఇంకా ఏకాభిప్రాయ సాధన విధానాలను వట్టుకొని వేళ్లాడుతున్నాయి. కొన్ని సంఘాలైతే యజమానులు తిరిగి సామాజిక ఒప్పందం కుదుర్చుకోవడానికి ముందుకు రావాలని అర్థిస్తున్నాయి. కార్మికోద్యమ విధానాలు బలమైన జాతీయవాద దృక్పథంతో రూపొందాయి. కార్మిక సంఘాలు ఈ దృక్పథాన్ని పునః పరిశీలించుకుని, గతంలోకన్నా నేడు మరింత దూకుడుగా ఉన్న పెట్టుబడిదారీ ప్రయోజనాలతో ఘర్షణకు సిద్ధపడాల్సిందిపోయి సంకుచిత జాతీయవాదము, సామాజిక భాగస్వామ్య విధానాలను పట్టుకుని వేలాడుతున్నాయి. కార్మికోద్యమం పెట్టుబడితో చెట్టాపట్టాల్ వేసుకొని ఉండాలని చూస్తోంది. అంతర్జాతీయ పోటీకి ధీటుగా 'జాతీయ పెట్టుబడి' నిలబడాలి

" దీన్నిబట్టి ఈ అంతర్జాతీయ కార్మికసంఘాలు కార్పొరేట్ ప్రపంచీకరణకు వ్యతిరేకంగా సాగే నూతన ఉద్యమంలో తాము భాగస్వాములు కాదని భావిస్తున్నట్లు అర్థం చేసుకోవచ్చు. ఈ నూతన ఉద్యమం రాజకీయ, అతివాద ప్రేరేపితం అని ఆ సంఘాలు భావిస్తున్నాయి. "

అన్న సాకుతో కార్మికవర్గం పెట్టుబడికి సేవకుడిగా మారిపోతోంది. జర్మనీలో 'స్టాండోర్ట్ వెట్‌బివెర్ద్' అన్న నినాదం మాటున యూనియన్లు కంపెనీలతో మిలాఖతు అవ్వడమే కాదు, ఇతర ప్రపంచ దేశాలతో పోటీ పడేందుకు వీలుగా రాజ్యం కూడా జర్మనీ జాతీయ పెట్టుబడికి మద్దతుగా నిలవాలన్న వైఖరి అనుసరిస్తున్నాయి.

కార్మికోద్యమం ఆర్థికవాద దృక్పథంలోనూ, లీగల్ పోరాటాల్లోనూ పీకలలోతు కూరుకుపోయిందే తప్ప బలాబలాల పొందికను అంచనా వెయ్యడానికి, మార్పు సాధించడానికి అవసరమైన వర్గ విశ్లేషణగానీ, దాని ఆధారం చేసుకున్న వ్యూహంకానీ రూపొందించుకోలేకపోయింది. 1990 మధ్య దశకంలో జర్మనీ కార్మికోద్యమం 'పనికోసం ఐక్యత' అన్న నినాదంతో యజమానులతో జాతీయస్థాయిలో జట్టుకట్టింది. 'సామాజిక ఒప్పందాన్ని' తిరగరాయడానికి ఇదొక లాంఛనప్రాయమైన ప్రతిపాదన. జర్మనీ కార్మికసంఘాల కాన్ఫెడరేషన్ దాన్ని ప్రతిపాదించింది. ఉద్యోగ భద్రతకోసం దుర్భర పని పరిస్థితులను అంగీకరించడానికి సిద్ధపడింది. (ఐతే యజమానులు దీన్ని తిరస్కరించారు). ఇదేవిధంగా అంతర్జాతీయ కార్మికోద్యమం కూడా గత పదేళ్లుగా డబ్ల్యుటివో (ప్రపంచ వాణిజ్యసంస్థ)లో కనీస కార్మిక ప్రమాణాల కోసం చేసిన పోరాటమూ సాపేక్షంగా సంకుచిత దృక్పథంతో కూడుకున్నదే. పెట్టుబడికి - కార్మికవర్గానికి మధ్య ఉన్న బలాబలాల పొందిక గురించి సరయిన విశ్లేషణ లేకుండా చేసిన సాధారణ 'లీగల్' పోరాటానికి అదొక ఉదాహరణ. ఇప్పటికీ కార్మికసంఘ బ్యూరోక్రటిక్ నాయకత్వం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో పెట్టుబడికి - కార్మికవర్గానికి నడుమ మధ్యవర్తిగా వ్యవహరించాలనే చూస్తున్నది. నేడు పెట్టుబడిదారీ శక్తులు చేస్తున్న దాడులు అంతర్జాతీయంగా ప్రజాబాహుళ్య సంఘీభావ, న్యాయ పోరాటాలు అభివృద్ధి అయ్యేందుకు అవకాశాలు కల్పిస్తుంటే, కార్పొరేట్ ప్రపంచీకరణవ్యతిరేక పోరాటాలు జరుగుతూ ఉంటే అంతర్జాతీయ కార్మికోద్యమం మాత్రం ఈ ఉద్యమాలకు, కార్పొరేట్ ప్రయోజనాలకు నడుమ మధ్యవర్తిత్వం పోషించే పాత్రలో ఒదిగిపోవాలని చూస్తోంది. రాజకీయ, ఆర్థిక కూలీనుల ఆధ్వర్యంలో స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు (వరల్డ్ ఎకనమిక్ ఫోరం)కు సమాంతరంగా జనవరి 2003లో బ్రెజిల్‌లోని పోర్ట్ అలెగ్రేలో జరిగిన ప్రపంచ సామాజిక సదస్సు (వరల్డ్ సోషల్ ఫోరం)లో కూడా ఈ ధోరణులే ప్రతిధ్వనించాయి. "ప్రపంచీకరణను ప్రజాస్వామీకరించడం-ప్రపంచ ఆర్థిక సదస్సు, ప్రపంచ సామాజిక సదస్సు (2003)లకు కార్మికసంఘాల ప్రకటన" పేరిట అంతర్జాతీయ కార్మికసంఘాలు ఒక ఉమ్మడి ప్రకటన జారీచేశాయి. మిగతా అంశాలతోపాటు ఆ ప్రకటనలో ఇలా పేర్కొన్నారు.

"పోర్ట్ అలెగ్రే, దావోస్‌లకు అంతర్జాతీయ కార్మికోద్యమం ఒక ఉమ్మడి సందేశం ఇస్తోంది. ఈ రోజున దుర్భర పరిస్థితులలోనూ, దారిద్ర్యంలోనూ, మెరుగైన భవిష్యత్తుకు అవకాశం లేని స్థితిలో జీవిస్తున్న లక్షలాదిమంది కార్మికులకు హుందా అయిన జీవితాన్న ఇచ్చేందుకు, పనికి గ్యారంటీ గల అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలి. దీనికగాను తగిన దూరదృష్టిని, రాజకీయ నిబద్ధతనూ, సామర్థ్యాన్ని ప్రదర్శించే శక్తులను కూడదీయాలి. ఇందుకు వనరుల కేటాయింపుతోపాటు వ్రాతపూర్వక కట్టుబాటు కూడా అవసరం. మనందరి హక్కులను, ప్రజాస్వామ్యాన్ని, పెంపొందించడం కోసం తగిన పరిపాలన విధానాలు అవసరం. దీనికోసం ప్రజాస్వామిక విధానాలు, చర్చలు చోటు చేసుకునేలా చూడాలి. 'సామాజిక న్యాయాన్ని' ప్రపంచీకరించమని మేం ప్రపంచ ఆర్థిక సదస్సును ఒత్తిడి చేస్తాం. కార్మిక ప్రజల ప్రయోజనాల రీత్యా ప్రపంచీకరణను ప్రజాస్వామికరించే నిర్మాణాత్మక పాత్ర పోషించేలా ప్రపంచ సామాజిక సదస్సు కృషి చేస్తుంది"

దీన్నిబట్టి ఈ అంతర్జాతీయ కార్మికసంఘాలు కార్పొరేట్ ప్రపంచీకరణకు వ్యతిరేకంగా సాగే నూతన ఉద్యమంలో తాము భాగస్వాములు కాదని భావిస్తున్నట్లు అర్థం చేసుకోవచ్చు. ఈ నూతన ఉద్యమం రాజకీయ, అతివాద ప్రేరేపితం అని ఆ సంఘాలు భావిస్తున్నాయి. అంతర్జాతీయ స్వతంత్ర కార్మిక సంఘాల సమాఖ్య (లేక గ్లోబల్ కార్మిక సంఘాలు) ప్రపంచ సామాజిక సదస్సుకు హాజరయినప్పటికీ ప్రపంచీకరణ వ్యతిరేకోద్యమ శక్తులతో కలవకుండా విడిగా మీటింగులు నడుపుకున్నది. అంతే కాకుండా ప్రపంచ ఆర్థిక సదస్సుకు కూడా అత్యున్నత ప్రతినిధి బృందాన్ని పంపింది. "మేం ఎప్పుడేం సాధించినా చర్చల ద్వారానే" అన్న ధోరణిని పునరావృతం చేసింది.

పాలకవర్గాలతో సంబంధం లేని స్వతంత్ర విధానాలు

కార్మికసంఘాలు శిక్షణగరిపే క్రమంలో అధికారసంబంధాలు, యూనియన్ల ఎత్తుగడలు అనే రెండు అంశాలూ పూర్తిగా లుప్తమైపోతున్నాయి. పశ్చిమ ఐరోపాలోని అనేక కార్మికసంఘాలు, కాన్ఫెడరేషన్లు నిర్వహించే కార్మిక శిక్షణ- తూర్పు యూరప్ దేశాల, అభివృద్ధి చెందుతున్న దేశాల సోదర సంఘాలతో నిర్వహించే సంఘీభావ కార్యక్రమాలుగా మాత్రమే జరుగుతున్నది. ఈ శిక్షణా కార్యక్రమాలన్నింటా 'సామాజిక ఒప్పందాన్ని' పశ్చిమ దేశాల కార్మికసంఘాలు సాధించిన ఘనవిజయంగా చెప్పుకొస్తున్నాయి. మిగతా ప్రపంచదేశాల్లోని కార్మికసంఘాల ఉద్యమాలు కూడా 'సామాజిక ఒప్పందాల' ద్వారా లబ్ధిపొందవచ్చు కాబట్టి ఆ దిశగా కృషి చేయాలని నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తున్నాయి. పాలకవర్గాలతో నేడు ఉన్న సంబంధాల రీత్యా చూసినా, తూర్పు యూరప్, వర్ధమాన దేశాలలో యాజమాన్యాల దుందుడుకు, ఘర్షణ వైఖరుల రీత్యా చూసినా ఇలాంటి సలహాలు ప్రతికూల ఫలితాలనిస్తాయి. పైన పేర్కొన్న పరిణామాలన్నీ ప్రభుత్వ రంగ పరిశ్రమలు, రవాణా రంగాలకన్నా ఎక్కువగా వస్తూత్పత్తి రంగంలోని

> **❝ వివిధ యూరప్ దేశాలలో నేడు మనం రిట్రెంచ్‌మెంట్లను చూడొచ్చు. సంక్షేమ పథకాలయిన 'సిక్ పే'లోనూ, పెన్షన్లలోనూ కోత మొదలయింది. నిరుద్యోగ భృతిని కత్తిరించారు. విద్యా, వైద్యం, సామాజిక సేవల రంగాల్లో వసూలుచేసే ఫీజులు, ఛార్జీలు పెంచారు. లాభదాయకంగాలేవన్న పేరుతో గృహనిర్మాణ పథకాలను అటక ఎక్కించారు. ❞**

కార్మికసంఘాల మీద ప్రతికూల ప్రభావం చూపించాయి. అందుకే వస్తూత్పత్తి రంగం నేడు ప్రత్యక్షంగానూ, బలంగానూ, అంతర్జాతీయ పోటీకి ఎరయింది. ఫలితంగా ఈ రంగంలో పనిచేసే సంఘాలలో రాజకీయ, సైద్ధాంతిక ధోరణులు స్పష్టంగా మితవాదంవైపు మొగ్గడం మనం గమనించవచ్చు.

'సామాజిక భాగస్వామ్యానికి' పునాదిగా ఉన్న ఆర్థిక, సామాజిక పరిస్థితులు మారిపోయినా, యూరప్ కార్మికసంఘాల బ్యూరోక్రటిక్ నాయకత్వం మాత్రం, ముఖ్యంగా యూరోపియన్ ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్ మాత్రం, ఇంకా పాత విధానాలనే పట్టుకు వెళాడుతోంది. దీని వల్లనే గత కొన్నేళ్లుగా శ్రామిక మార్కెట్లలో సామాజిక భాగస్వాములుగా భావించిన వారి మధ్య చర్చలు, 'లాబీయింగులు' పెరగడాన్ని మనం గమనించవచ్చు. పర్యవసానంగా యూరప్ కార్మికోద్యమంలో బ్యూరోక్రటిక్ ధోరణులు మరింతగా బలపడ్డాయి. "యూరోపియన్ యూనియన్ స్థాయిలో జరుగుతున్న చర్చలు" అని పొరపాటుగా చిత్రీకరించుకుంటూ సాగిస్తున్న సామాజిక చర్చలలో పారిశ్రామిక సమ్మె హక్కు గురించిన ఊసేలేదు. ఇక అంతర్జాతీయ స్థాయిలో చూస్తే, తాను 'సామాజిక భాగస్వామ్య' దృక్పథానికి కట్టుబడి ఉన్నట్లు ఐసిఎఫ్‌టియు స్పష్టంగా ప్రకటించింది. ఇతర విషయాల సంగతి పక్కనపెడితే ఐక్యరాజ్యసమితితో కలిసి ఉమ్మడి ప్రకటన ఇవ్వడమే గొప్పగా చెప్పుకుంటోంది. గమనించాల్సిన అంశం ఏమిటంటే ఉమ్మడి ప్రకటనగా చెప్పుకుంటున్న దీన్లో ఉపయోగించిన కీలకమైన భాష ఐక్యరాజ్య సమితి- అంతర్జాతీయ వాణిజ్యసంఘాలు జమిలిగా ఉపయోగించిన భాషనే పోలి ఉంది.

"ప్రపంచ మార్కెట్‌కి ప్రపంచ నియమావళే ఉండాలని అంగీకరిస్తున్నాం. మార్కెట్ల ప్రపంచీకరణ వల్ల రూపాంతరం చెందుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రపంచీకరణ ప్రతిఫలాలు ప్రజలందరికీ అందడానికి వీలుగా ప్రభావవంతమైన బహుళపక్ష నియమావళి చట్రాన్ని నిర్మించుకోవాలన్న లక్ష్యంతో ఉన్నాం. ఈ ప్రపంచ సాహచర్య సమావేశం వాణిజ్యానికి, కార్మికవర్గానికి మధ్య సామాజిక భాగస్వామ్యాన్ని నిర్మించేదానికి దోహదం చేస్తుందని అంగీకరిస్తున్నాం".

కార్మికసంఘాల్లో సింహభాగం వర్గసామరస్య విధానాలవైపే మొగ్గుచూపడం వల్ల ఫలితాలు దారుణంగా ఉన్నాయి. అంచెలంచెలుగా సంక్షేమం, పని పరిస్థితులు కుంచించుకుపోతున్నాయి. చర్చల ద్వారా కార్మిక సంఘాలు క్రమంగా పనిని సరళీకరించడానికి అంగీకరించాయి. వివిధ యూరప్ దేశాలలో నేడు మనం రిట్రెంచ్‌మెంట్లను చూడొచ్చు. సంక్షేమ పథకాలయిన 'సిక్ పే', పెన్షన్లలో కోత మొదలయింది. నిరుద్యోగ భృతిని కత్తిరించారు. విద్యా, వైద్యం, సామాజిక సేవల రంగాల్లో వసూలుచేసే ఫీజులు, ఛార్జీలు పెంచారు. లాభదాయకంగాలేవన్న పేరుతో గృహనిర్మాణ పథకాలను అటక ఎక్కించారు. కార్మిక చట్టాలను, ఒప్పందాలను కాలదన్ని పని పరిస్థితులను దుర్భరం చేసేశారు. నియమిత పనిగంటలను నీరుగార్చేశారు. ఓవర్‌టైమ్ చెల్లింపులలో కోత విధించారు. అనేక పరిశ్రమలలో షిఫ్టు పద్ధతిని ప్రవేశపెట్టారు. ఉద్యోగ భద్రతకు తూట్లు పొడిచారు. ఉద్యోగితను కాంట్రాక్టు, తాత్కాలిక, లీజు తరహా పద్ధతులకు మార్చేశారు. బేరసారాల హక్కును మరింత వికేంద్రీకరించారు. వీటన్నింటి పర్యవసానంగా కార్మికవర్గం నైతిక స్థైర్యం సడలిపోయింది. కార్మికుల ప్రయోజనాలు కాపాడటంలో నాయకత్వం విఫలం కావడం వల్ల కార్మిక సంఘాల సభ్యత్వం పడిపోయింది. కార్మిక సంఘాలు అనుసరించిన దివాళాకోరు విధానాల వల్ల మితవాద రాజకీయ పార్టీలు బలం పుంజుకున్నాయి.

వ్యూహాత్మక ప్రతిపాదనలు

మరయితే కార్పొరేట్ సంస్థల దాడులను ఎదుర్కోవడానికి కార్మికసంఘాల ఉద్యమాలు ఏం చేయాలి? ఒక విషయం మాత్రం స్పష్టం. అతివాద ప్రగల్భాలు ఇక చెల్లవు, ఎందుకంటే అంతర్జాతీయ సమావేశాల్లో ఇదొక పరిపాటి అయిపోయింది. ఇటలీలోని ఫ్లోరెన్స్ నగరంలో 2002 నవంబరులో జరిగిన ఐరోపా సామాజిక సదస్సు అనుభవం మనకొక ఉదాహరణ. ఇక్కడ మనం కార్మిక సంఘాల రెండు ధోరణులను గురించీ విన్నాం. ఒకటి - ప్రతినిధేతర చిన్నసంఘాల సమరశీల వాణి. రెండవది - యూరప్ కార్మిక సంఘాల ప్రధాన స్రవంతి ప్రతినిధుల బాణి. వాస్తవానికి కార్మికసంఘాల ప్రతినిధులు ఎవరూ నేడు ఐరోపాలో కార్మికోద్యమం ఎదుర్కొంటున్న నిజమైన సమస్యల పరిష్కారం గురించి చర్చించలేదు. అసలు జరగాల్సిందే ఇది. సరైన కార్మికసంఘ వ్యూహం రచించడానికి పునాది అదే కదా.

తొలుత గుర్తించాల్సిన అంశం ఏమిటంటే - బహుళజాతి కంపెనీలు, పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం పనిచేసే ఇతరత్రా శక్తులు నేడు అవలంబిస్తున్న ఘర్షణాత్మక విధానాలతో కార్మికసంఘాలు ఢీ అంటే ఢీ అంటూ తలపడేందుకు సిద్ధపడాలి. ఐతే కార్మికోద్యమంలో స్థానిక, జాతీయ, అంతర్జాతీయస్థాయిలలో ఈ అంశంమీద ఏకాభిప్రాయం లేదు. కాబట్టి ఏ కార్మిక సంఘాలయితే తమ యూనియన్లను పునరుత్తేజంతో నడపాలని నిర్ణయించు కుంటాయో అవి కార్మికోద్యమంలోని సమరశీల శక్తులతో కొత్తగా భాగస్వామ్యం నిర్మించు కోవాలి. అనేక మినహాయింపులు ఉన్నప్పటికీ ఇటువంటి సంఘాలు ప్రభుత్వరంగంలోనూ, రవాణారంగం లోనూ, ఇతరత్రా కొన్ని ప్రైవేటు సర్వీసు రంగాలలోనూ, స్థానికంగానూ తోడుగా నిలిచే అవకాశం ఉంది.

బహుళజాతి కార్పొరేషన్లతో తలపడాల్సి వచ్చినపుడు జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ అదే కంపెనీలో పనిచేసే కార్మికుల మధ్య సహకారం పెరిగేందుకు తగిన నిర్మాణాన్ని (నెట్‌వర్క్) రూపొందించుకోవాలి. అంతర్జాతీయ వర్గ సంఘీభావాన్ని పెంపొందించుకోవాలి. తద్వారా 'మన'

"తాజా పరిణామాల పట్ల ప్రజల అసంతృప్తిని మనం సక్రమంగా అంచనా వేయగలగాలి. వారి ఆదుర్దా, అసంతృప్తులకు రాజకీయ దృక్పథం తోడు చేయాలి. దాన్ని కార్మిక పోరాటాలు, వర్గ ప్రాతిపదిక రాజకీయ పోరాటాల వైపుకి మళ్ళించాలి. పని పరిస్థితులు, జీవన పరిస్థితులను మెరుగు పరుచుకునేందుకు ఉద్యమోన్ముఖులను చేయాలి."

కంపెనీ, 'వాళ్ళ' కంపెనీ అనే వాణిజ్య యూనియన్ దృక్పధాన్ని వదిలించుకోవాలి. ఇటువంటి తన, మన ధోరణులు ఐరోపాలో కన్నా అమెరికాలో జాస్తి, కానీ ఈ మధ్యకాలంలో ఐరోపాలో కూడా ఈ ధోరణులు బలపడ్డాయి. సమరశీలత, రాజకీయ దృక్పధం లోపించిన కార్మికసంఘాలు ఇతర దేశాల్లోని కంపెనీలతో 'పోటీ' పడే పేరిట, జాతీయస్థాయిలో 'ఉద్యోగ భద్రత' పేరిట యాజమాన్యాలతో చేతులు కలపడానికి సిద్ధపడ్డాయి. ఈ రకమైన దారి తప్పిన, సంకుచిత వ్యూహాలకు స్వస్తిచెప్పి, ఉత్పత్తి పంపిణీల మీద ప్రజాస్వామిక నియంత్రణ కోసం 'వర్గ' ప్రాతిపదికన ఉమ్మడి పోరాటాలు నిర్వహించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. అంతర్జాతీయంగా కార్మికసంఘాల మధ్య భాగస్వామ్యం పెంపొందించుకోవడానికి అవకాశం వున్న మరో కీలకాంశం- ప్రజోపయోగ సర్వీసుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సాగించాల్సిన పోరాటం. తద్వారా గత పోరాటాల ద్వారా సంక్షేమరూపంలో సాధించుకున్న ఫలితాలను పరిరక్షించవచ్చు. ప్రైవేటీకరణను ప్రతిఘటించవచ్చు. ప్రజోపయోగ సర్వీసులను కార్పొరేట్ రంగం కైవసం చేసుకోవడం అనేది సమాజంలోని పెట్టుబడి-కార్మికవర్గం మధ్య ఉన్న బలాబలాల పొందికలో కార్మికవర్గానికి అననుకూలమైన మార్పును సూచిస్తోంది.

మరో ముఖ్యమైన అంశమేమిటంటే కార్మిక సంఘాలలోని బ్యూరోక్రటిక్ ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా పోరాడడం ప్రగతిశీల కార్మికసంఘాల తొలి కర్తవ్యం. పెట్టుబడి - కార్మికవర్గ శాంతియుత సహజీవనం, సామాజిక భాగస్వామ్యం అనే సిద్ధాంతాలను ఎండగట్టాలి. కార్మికోద్యమంలో ఈ అంశంమీద అంతర్గతంగా స్నేహపూరితంగానే తీవ్రమైన చర్చలు నిర్వహించాలి. **'సామాజిక భాగస్వామ్యం' అనే సిద్ధాంతాన్ని కుట్రగానో నమ్మకద్రోహంగానో కాకుండా, నాటి చారిత్రక పరిస్థితుల ఆధారంగా నిశితంగా చర్చించాలి.** ఏ చారిత్రక పరిస్థితుల్లో పెట్టుబడికి - కార్మికవర్గానికి మధ్య రాజీ కుదిరిందో, ఏ పరిస్థితుల్లో ఆ రాజీ ఒప్పందం కుప్పకూలిందో ప్రజలకు వివరించడానికి చర్చల ద్వారా సరికొత్త విశ్లేషణలను రాబట్టగలగాలి.

తాజా పరిణామాల పట్ల ప్రజల అసంతృప్తిని మనం సక్రమంగా అంచనా వేయగలగాలి. వారి ఆదుర్దా, అసంతృప్తులకు రాజకీయ దృక్పధం తోడు చేయాలి. దాన్ని కార్మిక పోరాటాలు, వర్గ ప్రాతిపదిక రాజకీయ పోరాటాల వైపుకి మళ్ళించాలి. పని పరిస్థితులు, జీవన పరిస్థితులను మెరుగుపరుచుకునేందుకు ఉద్యోమోన్ముఖులను చేయాలి. ప్రజల అసంతృప్తి నుండి మితవాద, ప్రజాకర్షక రాజకీయ పార్టీలు లబ్ధి పొందకుండా నివారించడానికి ఇదొకటే మార్గం.

మనం సంక్షేమం మీద, పని పరిస్థితుల మీద దృష్టి కేంద్రీకరించాలి. ఆర్థిక వ్యవస్థ మార్కెట్ శక్తుల పాలయ్యేకొద్దీ పనిలో ఎంతటి బర్బరత్వం చోటు చేసుకుంటుందో, పనిగంటల మీదా-పని పద్ధతుల మీదా కార్మికుల జోక్యానికి ఎలా అవకాశం లేకుండా పోతుందో వివరించాలి. ప్రజల స్థైర్యాన్ని కూడగట్టడానికి, పెంపొందించడానికి ఇది అవసరం. బూర్జువా ఆలోచనల ఆధిపత్యం, నయా-ఉదారవాద విలువలు రాజ్యమేలుతున్న సమాజంలో శ్రామికుల, కష్టజీవుల గౌరవాన్ని పని ప్రదేశాల్లో, మీడియాలో, ప్రజా సామాన్యంలో సామాజిక, సాంస్కృతిక రంగాల్లో క్రమేపీ పలుచన చేస్తున్నారు. దీన్ని తిప్పి కొట్టాలంటే శ్రమ, వర్గసంబంధం, వర్గ స్పృహ భావాలను మళ్ళీ అందిపుచ్చుకోవాలి. ఐతే దీన్ని బయట నుండి కార్మికవర్గం మీద రుద్దలేం. సామాజిక సంఘర్షణలలో అంతర్భాగంగా దీన్ని అభివృద్ధి చెయ్యాలి.

చివరగా, నయా-ఉదారవాదానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ న్యాయం, అంతర్జాతీయ సంఘీభావం (ఐక్యత)ల కోసం జరిగే నూతన ప్రపంచ ఉద్యమాలతో పొత్తు కుదుర్చుకోవాలి. ఉద్యమాల సమాహారమైన ఈ ప్రపంచ ఉద్యమ వర్గ సంబంధాల పరిజ్ఞానం అంత గొప్పగా లేకపోయినప్పటికీ నేడు ఈ ఉద్యమం వ్యవస్థకి వ్యతిరేకంగా సాగుతున్న అతివాద రాజకీయ ఉద్యమమే. వర్గ సామరస్యం పట్ల ఉన్న భ్రమలు పటాపంచలు కావాలంటే ఈ ప్రపంచ ఉద్యమాలకు ఉన్న అతివాద దృక్పధం, సమరశీలత కార్మికోద్యమాలకు అబ్బడం అవసరం. ఈ పొత్తును సకారాత్మకంగా, నిర్మాణాత్మకంగా. తీర్చిదిద్దితే రెండు ఉద్యమాలూ పరస్పర ప్రభావంతో పోరాటాన్ని అత్యున్నతస్థాయికి తీసుకెళ్ళగలవు.

'సామాజిక ఒప్పందం' అనేది కార్మికోద్యమ నిర్వచితలక్ష్యం కానేకాదు. ఒక ప్రత్యేక చారిత్రక పరిస్థితులలో సంభవించిన పరిణామం. పెట్టుబడికి - కార్మికవర్గానికి మధ్య ఉన్న బలాబలాల పొందికలో సంభవించిన పెనుమార్పు ఇందుకు దారి తీసింది. రష్యా విప్లవం పశ్చిమదేశాల్లో బలమైన కార్మికవర్గం, కార్మికోద్యమాలు, తృతీయ ప్రపంచదేశాల్లో చోటు చేసుకున్న బలమైన విముక్తి పోరాటాలు, రెండో ప్రపంచయుద్ధం తరువాత పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలం నిలకడగా ఉండం ఈ పరిణామాలన్నీ కలగలిపి వర్గ సామరస్య ఒప్పందాన్ని సాధ్యం చేశాయి. కాని నేడు ఉన్న తాజా బలాబలాల పొందిక రీత్యా చూస్తే కొత్తగా మళ్ళీ వర్గ సామరస్యం, సామాజిక ఒప్పందాలను లక్ష్యంగా పెట్టుకోవడం భ్రమగానే మిగులుతుంది. అందుకే మన లక్ష్యం సామాజిక ఒప్పందం, సంక్షేమ రాజ్యాలకు మించినదయి ఉండాలి. నయా-ఉదారవాద విధానాలను పునరావృతం చేసేందుకు దోహదపడిన భౌతిక పరిస్థితులను సమాజంలో నుండి తొలగించగలిగి నప్పుడు మాత్రమే కష్టజీవుల ప్రయోజనాలు కాపాడబడతాయి. 'సోషలిజం' మినహా మరేదీ ఇందుకు హామీ ఇవ్వలేదు.

(అనువాదం: సత్యరంజన్)

పదునైన సైద్ధాంతిక పోరాటం

సైద్ధాంతిక సమస్యలపై పార్టీ అవగాహన - 4

సీతారాం ఏచూరి

విదేశీ ప్రభుత్వాలనుండి, సంస్థలనుండి నిధులు స్వీకరిస్తున్న ఇటువంటి ప్రభుత్వేతర సంస్థల స్వరూప స్వభావాలను పార్టీ విశ్లేషించింది. మన దేశపు అనుభవాలు, పొరుగునున్న బంగ్లాదేశ్, నేపాల్ అనుభవాలు దృష్టిలో ఉంచుకుని ఇటువంటి కొన్ని సంస్థల కార్యక్రమాలు ఉద్దేశ్యపూర్వకంగా ప్రజలను వామపక్షాల వెనక సమీకృతం కాకుండా చూసే లక్ష్యంతో రూపొందిస్తున్నాయన్న విషయాన్ని పార్టీ మరోసారి హెచ్చరిస్తోంది.

(గత సంచిక తరువాయి)

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యొక్క వివిధ ప్రజా వ్యతిరేక లక్షణాలపై విస్తృత ప్రజా ఉద్యమం నిర్మించాల్సిన ఆవశ్యకత గురించి, పార్టీ జోక్యం చేసుకోవటానికి వీలైన పరిస్థితులు, రంగాలను ఎంచుకోవాల్సిన ప్రాధాన్యత గురించి ఇంతకుముందు చెప్పుకున్నాము. అయితే మనం పని చేయాల్సిన ఇటువంటి అనేక రంగాల్లో ప్రభుత్వేతర సంస్థలు పని చేస్తున్నాయి. అందువల్ల ప్రభుత్వేతర సంస్థలతో మనం అనుసరించాల్సిన సంబంధాల గురించి మనకు స్పష్టమైన అవగాహన ఉండాల్సిన అవసరం ఉంది.

1980 దశకంలోనే విదేశీ ప్రభుత్వాలు, సంస్థల నుండి నిధులు స్వీకరిస్తున్న ఇటువంటి ప్రభుత్వేతర సంస్థల స్వరూప స్వభావాలను పార్టీ విశ్లేషించింది. మన దేశపు అనుభవాలు, పొరుగునున్న బంగ్లాదేశ్, నేపాల్ అనుభవాలు దృష్టిలో ఉంచుకుని ఇటువంటి కొన్ని సంస్థల కార్యక్రమాలు ఉద్దేశ్యపూర్వకంగా ప్రజలను వామపక్షాల వెనక సమీకృతం కాకుండా చూసే లక్ష్యంతో రూపొందిస్తున్నాయన్న విషయాన్ని పార్టీ మరోసారి హెచ్చరిస్తోంది. అంతేకాదు, ప్రజలను రాజకీయాలకు దూరం చేయటం, యువతకు కమ్యూనిస్టు పార్టీల కంటే మెరుగైన జీత భత్యాలు చూపించి ఆకర్షించటం వంటివి కూడా చేస్తుంటాయి. ఈ హెచ్చరిక చేస్తూనే పార్టీ విదేశీ నిధులు తీసుకుంటున్న స్వచ్ఛంద సంస్థల పట్ల మన అవగాహనను ఈ విధంగా స్పష్టీకరిస్తుంది.

గత రెండు దశాబ్దాల్లో స్వచ్ఛంధ సంస్థల కార్యక్రమాలు అన్నిరకాలుగా విస్తరించాయి. ప్రపంచబ్యాంకు వంటి అనేక అంతర్జాతీయ సంస్థలు ఉద్దేశ్యపూర్వకంగా స్వచ్ఛంధ సంస్థలను ప్రోత్సహిస్తున్నాయి. దీని వెనక సైద్ధాంతిక కారణం స్పష్టమే. ప్రపంచీకరణను రాజకీయంగా వ్యతిరేకిస్తున్న వారితో ఉమ్మడిగా వేదికలు ఏర్పాటు చేయాలని ప్రపంచ బ్యాంకు అధికారికంగానే ప్రకటించింది. ఇది ఒక విధంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచీకరణకు ఎదురవుతున్న వ్యతిరేకతను గుర్తించటమే. అదేసమయంలో ఇటువంటి ఉమ్మడి వేదికలు ఏర్పాటు చేయటం ద్వారా స్వచ్ఛంధ సంస్థలు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలు స్థూలంగా పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదపు చట్రానికి లోబడి ఉండేలా చూస్తున్నారు. అంటే తమ ఆక్రోశం వ్యక్తం చేసుకునేందుకు ప్రజలకు అవకాశాలు కల్పించటమే. స్వచ్ఛంధ సంస్థల నేతృత్వంలో సాగుతున్న ప్రపంచీకరణ వ్యతిరేక ఉద్యమాలు నిజానికి సేఫ్టీ వాల్వ్ వంటివే. ప్రెజర్ కుక్కర్ పేలిపోకుండా ఉండటానికి ఈ సేఫ్టీవాల్వ్ పని చేస్తున్నట్లుగానే ప్రపంచీకరణ బద్దలు కాకుండా ఉండటానికి ఇటువంటి ఉద్యమాలు ఉపయోగపడుతున్నాయి. స్వచ్ఛంధ సంస్థల నేతృత్వంలో సాగే ప్రపంచీకరణ వ్యతిరేక ఉద్యమాల్లో పాల్గొని ప్రజలు దాని పట్ల తమకున్న వ్యతిరేక భావాన్ని, కొన్ని సందర్భాల్లో కసిని వ్యక్తం చేస్తారు. తిరిగి ప్రజలు తమ కార్యక్రమాల్లో తాము నిమగ్నమై ఉన్నట్లే ప్రపంచీకరణ తన దారిలో తాను సాగిపోతుంది.

ఈ ఎజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు సామ్రాజ్యవాద సంస్థలు స్వచ్ఛంధ సంస్థలకు నిధులు ఇచ్చి మరీ పోషిస్తున్నాయి. వివిధ అభివృద్ధి కార్యక్రమాలు ఈ స్వచ్ఛంధ సంస్థల ద్వారా చేపడుతూ మరో వంక ప్రతిపక్ష ఉద్యమాలను నియంత్రించటానికి ఈ సంస్థలు సాధనాలుగా ఉపయోగ పడుతున్నాయి.

దేశంలో నయా ఉదారవాద ఆర్థిక విధానాలు అమలు చేయటం ప్రారంభించిన తర్వాత వరుసగా వస్తున్న ప్రభుత్వాలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో ప్రభుత్వేతర సంస్థలను భాగస్వాములను చేయటం అధికారిక విధానంగా మార్చుకున్నాయి. ఇది కూడా నయా ఉదారవాద విధానాల అమలులో ఒక భాగమే. ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న సామాజిక బాధ్యతను విస్మరించటం ద్వారా ఏర్పడే శూన్యంలో స్వచ్ఛంధ సంస్థలు చొరబడేలా అవకాశం కల్పించటం నయా ఉదారవాద విధానాల్లో ఒక అంశం. ఈ విధంగా కీలకమైన విద్య, వైద్య రంగాల్లో ప్రైవేటీకరణ అమలు చేయటానికి రంగం సిద్ధం చేస్తున్నారు. గడచిన దశాబ్దకాలంలో కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి శాఖ, మహిళా సాధికారత, విద్య, పర్యావరణం, సాంఘిక సంక్షేమం వంటి శాఖల ద్వారా ప్రభుత్వేతర సంస్థలకు పెద్దమొత్తంలో నిధులు విడుదల చేస్తున్నాయి.

రచయిత సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు

అనేక ప్రభుత్వ కార్యక్రమాల రూపకల్పనలో ఈ సంస్థలకు సంప్రదింపుల హోదా కల్పిస్తున్నారు.

దీంతో దేశంలో విదేశీ నిధులతోగానీ, కేంద్ర ప్రభుత్వ నిధులతో గానీ నడిచే ప్రభుత్వేతర సంస్థలు కుప్పలు తెప్పలుగా పుట్టుకురావటాన్ని ఈ కాలంలో మనం గమనించవచ్చు. మార్చి 31, 2001 నాటికి విదేశీ సహాయ నియంత్రణ చట్టం కింద రిజిష్టరు అయి విదేశాల నుండి నిధులు తీసుకుంటున్న సంస్థలు 23000 ఉన్నాయి. ఈ సంస్థలు సాలీనా 5000 కోట్ల రూపాయలు సేకరిస్తున్నాయి.

> **" విదేశీ రుణాలు తీసుకుంటున్న అనేక స్వచ్ఛంద సంస్థలు ప్రధానంగా దళితులు, ఆదివాసీలు, మహిళల్లో పని చేస్తున్నాయి. వీరిని రాజకీయాలతో నిమిత్తం లేని సమూహాలుగా మారుస్తున్నాయి. కేవలం ప్రభుత్వ నిధులు సమీకరించటానికి, వాటిని ఇతర అవసరాల కోసం వినియోగించుకునే ఉద్దేశ్యంతో కూడా కొన్ని సంస్థలు ఉనికిలోకి వస్తున్నాయి. "**

స్వచ్ఛంధ సంస్థలు ఇంత పెద్దఎత్తున పెరిగిపోతున్న నేపథ్యంలో కొన్ని అంశాలు మనం గమనంలోకి తీసుకోవాలి. విదేశీ రుణాలు తీసుకుంటున్న అనేక స్వచ్ఛంద సంస్థలు ప్రధానంగా దళితులు, ఆదివాసీలు, మహిళల్లో పని చేస్తున్నాయి. వీరిని రాజకీయాలతో నిమిత్తం లేని సమూహాలుగా మారుస్తున్నాయి. కేవలం ప్రభుత్వ నిధులు సమీకరించటానికి, వాటిని ఇతర అవసరాల కోసం వినియోగించుకునే ఉద్దేశ్యంతో కూడా కొన్ని సంస్థలు ఉనికిలోకి వస్తున్నాయి. ఈ విధంగా అభివృద్ధి కార్యక్రమాల కోసం కేటాయిస్తున్న నిధులు రాకెటీర్ల చేతుల్లో పడి దుర్వినియోగం కాకుండా జాగ్రత్త వహించాలి.

కొన్ని స్వచ్ఛంధ సంస్థలు విదేశీ నిధులను తిరస్కరిస్తున్న విషయాన్ని గమనంలో ఉంచుకుంటూనే ప్రజలను రాజకీయాలకు అతీతులుగా మార్చి , సంఘటితవామపక్ష శక్తులకు దూరంగా ఉంచే లక్ష్యంతో పని చేస్తున్న స్వచ్ఛంధ సంస్థల వ్యూహాలను గుర్తించి ప్రతిఘటించాలి. పెద్ద సంఖ్యలో ఈ సంస్థలు తమను తాము ప్రజా ఉద్యమాలుగా పేర్కొంటుంటాయి. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు నిర్వహించే రాజకీయ ఉద్యమాలకు తాము దూరంగా ఉన్నట్లు చిత్రీకరించు కుంటాయి. వాళ్ల సైద్ధాంతిక దృష్టి కోణం కూడా ఈ కింద ప్రస్తావిస్తున్న పదజాలం లాగానే గందరగోళంగా ఉంటుంది. " వనరులపై ప్రజలు అధికారం సంపాదించటం ద్వారానే ప్రపంచంలోని అణగారిన హక్కులకు దూరం చేయబడిన విశాల ప్రజానీకపు వాస్తవిక అభివృద్ధి సాధ్యం. అందువల్లనే వనరులపై హక్కులు సంపాదించాలని ప్రజా ఉద్యమాలు నిర్మిస్తున్నాము." అంటూ ఈ సంస్థలు తమ తమ కార్యక్రమాల్లో పేర్కొంటుంటాయి. తద్వారా వనరులపై కార్పొరేట్ రంగం గుత్తాధిపత్యానికి తాము వ్యతిరేకం అన్న భావన కలిగించే ప్రయత్నం చేస్తాయి. అదే సమయంలో వనరులపై రాజ్యం పెత్తనాన్ని కూడా ఈ సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. మొదటి తరహా విధానాన్ని అనుసరించటం ద్వారా తాము పెట్టుబడిదారీ విధానానికి, అది ప్రజలపై మోపుతున్న భారాలకు వ్యతిరేకం అన్న భావన కలిగించేందుకు ప్రయత్నిస్తూనే రెండో తరహా విధానం ద్వారా గతంలో సామ్యవాద దేశాలు అనుసరించిన విధానాలను వ్యతిరేకిస్తూ తాము సామ్యవాదానికి కూడా భిన్నమైన వారమని చెప్పుకునే ప్రయత్నం జరుగుతోంది. ఈ విధంగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు సామ్యవాదం ప్రత్యామ్నాయం అన్న వాదనను వీరు ప్రజల నియంత్రణ అన్న భావన ద్వారా నిర్వీర్యం చేస్తున్నారు.

ఈ తరహా సంస్థలతో సైద్ధాంతిక పోరాటం సాగించాలని సిపిఎం స్పష్టంగా విశదీకరిస్తోంది. " ఈ సైద్ధాంతిక పోరాటంలో మనం భాగస్తులం కావాలి. నిజానికి కమ్యూనిస్టులు అంతిమంగా వనరులపైనా సామాజిక కార్యక్రమాలపైనా ప్రజల వాస్తవిక, సార్వభౌమత్వ హక్కులు కలిగి ఉండాలని కోరుకుంటారు. అయితే ఈ హక్కును అనుభవించటానికి ప్రజలకు చట్టబద్ధతను కల్పించే సామాజిక ఆర్థిక వ్యవస్థ ఏది? ప్రజలకు నిజమైన అధికారాలను అందుబాటులోకి తేగలిగిన అటువంటి వ్యవస్థ సామ్యవాదం మాత్రమే. అందువల్లనే సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు సామ్యవాదమే నిజమైన ప్రత్యామ్నాయం." అని రాజకీయ నిర్మాణ నివేదిక పేర్కొంటోంది.

భారత ప్రభుత్వం, అంతర్జాతీయ సంస్థలు ఇటువంటి స్వచ్ఛంధ సంస్థలను ప్రోత్సహించటం వెనక ఉన్న రాజకీయ లక్ష్యాన్ని బట్టబయలు చేస్తూ సైద్ధాంతిక పోరాటం నడుపుతూనే ప్రాథమిక సామాజిక రంగాల్లో ప్రభుత్వం తన బాధ్యతలు విస్మరించే విధానాలకు వ్యతిరేకంగా కూడా పోరాడాలి. పై అవగాహనను గమనంలో ఉంచుకుని మనం పని చేస్తున్న రంగాలు, ప్రాంతాల్లో మన లాంటి లక్ష్యాలతో పని చేసే స్వచ్ఛంధ సంస్థలతో వ్యవహరించటానికి సంబంధించి కూడా సిపిఎం మార్గదర్శక సూత్రాలు రూపొందించాలి. ఈ విషయాన్ని గమనంలో ఉంచుకుంటూ రాజకీయ నిర్మాణ నివేదిక " విభిన్న తరగతులకు చెందిన ప్రజలను సమీకరించే పనిలో నిమగ్నమై, విదేశీ నిధులు స్వీకరించే స్వచ్ఛంధ సంస్థల కార్యక్రమాల్లో పార్టీ సభ్యులు భాగస్తులు కారాదు. ఏదైనా మినహాయింపు ఇవ్వాల్సి ఉంటే పార్టీ రాష్ట్ర కమిటీ గానీ, పొలిట్‌బ్యూరో కానీ మినహాయింపు ఇవ్వాల్సి ఉంటుంది.

నిర్దిష్ట ప్రాంతానికి పరిమితమై ప్రజల నిజమైన సమస్యలను తీసుకుని పని చేస్తున్న స్వచ్ఛంధ సంస్థలు ఉండవచ్చు. వారి పాత్రను అంచనా వేసి నిర్దిష్ట సమస్యలపై వారితో సమన్వయం చేసుకుని పని చేయగలమా అన్న విషయాన్ని నిర్ధారించటం సంబంధిత పార్టీ కమిటీల బాధ్యత. అటువంటి స్వచ్ఛంధ సంస్థలతో విశాల వేదికలపై ప్రజా సంఘాలు పని చేయవచ్చు అయితే అది కూడా పార్టీ కమిటీల అనుమతి తీసుకున్న తర్వాత మాత్రమే." అని స్పష్టం చేస్తోంది. గణనీయమైన మొత్తంలో ప్రభుత్వ నిధులు స్వచ్ఛంధ సంస్థల ద్వారా వినియోగిస్తున్న విషయాన్ని గమనంలో ఉంచుకుని మనం బలంగా ఉన్న రాష్ట్రాల్లో ప్రత్యేకించి మనం అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించటం కోసం అటువంటి సంస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం వస్తుంది. ఈ అవసరాన్ని గుర్తిస్తూ అన్ని పార్టీ కమిటీలు ఈ కింద పేర్కొన్న నాలుగు

"గ్రామీణ ప్రాంతాలకు అందాల్సిన సంస్థాగత రుణ సదుపాయానికి స్వయం సహాయ సంఘాలు ప్రత్యామ్నాయం కాలేవు. అంతేకాదు, గృహ నిర్మాణం, పారిశుధ్యం వంటి అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయటంలో ప్రజాతంత్ర యుతంగా ఎన్నికైన స్థానిక సంస్థలను పక్కనబెట్టేందుకు ఈ స్వయం సహాయ సంఘాలను సాధనాలుగా చేసుకునే విధానాలను కూడా మనం ప్రతిఘటించాలి."

మార్గదర్శక సూత్రాలు అమలు చేయాలని రాజకీయ నిర్మాణ నివేదిక ఆదేశిస్తోంది.

1. అటువంటి సంస్థల నిర్వహణకు అవసరమైన పార్టీ కాడర్‌ను కేటాయించే విషయాన్ని సంబంధిత కమిటీలు చర్చించాలి. పై కమిటీలు ఆమోదించాలి.

2. పైన పేర్కొన్న లక్ష్యం కోసం ఏర్పాటు చేసిన ఏదైనా స్వచ్ఛంధ సంస్థతో పార్టీ నిధుల వినియోగాన్ని తనిఖీ చేసే యంత్రాంగం ఏర్పాటు చేయాలి.

3. పార్టీ అనుమతితో గానీ, ప్రజా సంఘం ద్వారా గానీ ఏర్పాటు చేసిన ఏ స్వచ్ఛంధ సంస్థ అయినా విదేశీ నిధుల నియంత్రణ చట్టం అనుమతి అవసరమయ్యే నిధులు ఏమీ స్వీకరించరాదు. ఏదైనా మినహాయింపు అవసరమైతే సంబంధిత రాష్ట్ర కమిటీలు పొలిట్‌బ్యూరోల నుండి మాత్రమే అటువంటి మినహాయింపు పొందాలి.

4. అటువంటి ఏ సంస్థ అయినా ప్రభుత్వ నిధులు తీసుకోవాలంటే సంబంధిత పార్టీ కమిటీ అనుమతి తప్పనిసరి.

స్వయం సహాయ గ్రూపుల గురించి

ఈ మధ్య కాలంలో ప్రత్యేకించి 1990 దశకంలో వివిధ పథకాల కింద నిధులు మంజూరు చేయటానికి స్వయం సహాయ సంఘాలను ప్రాతిపదికగా తీసుకోవటం కేంద్ర ప్రభుత్వ విధానంగా మారింది. ఉదాహరణకు స్వర్ణ జయంతి రోజ్‌గార్ యోజన పథకం కింద కేంద్రం స్వయం సహాయ సంఘాల కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులు మంజూరు చేస్తోంది. ఈ విధానాన్ని మొదటిగా ప్రారంభించిన నాబార్డు ఆధీనంలో ప్రస్తుతం దేశవ్యాపితంగా 12 లక్షల స్వయం సహాయ సంఘాలు ఉన్నాయి.

అందులో అనేక సంఘాలు నిధులు సమకూర్చుకునేందుకు, రుణాలు సంపాదించుకునేందుకు వడ్డీ వ్యాపారుల నుండి విముక్తి పొందేందుకు మహిళలకు మంచి అవకాశం కల్పించాయి. మన పార్టీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో ప్రత్యేకించి మనం అధికారంలో ఉన్న పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో స్వయం సహాయ సంఘాలు గణనీయంగా పెరిగాయి. అంతేకాక ప్రజల జీవన ప్రమాణాలు పెంచే కార్యక్రమాలు జయప్రదం చేయటానికి ఈ సంఘాలు ముఖ్యమైన సాధనాలుగా మారాయి.

అయితే ఇందులో కొన్ని ప్రతికూల అంశాలు ఉన్నాయి. వీటిని మనం గుర్తించి వ్యతిరేకించాలి. స్వయం సహాయ సంఘాల ద్వారా సూక్ష్మ పరపతి విధానాన్ని ప్రపంచ బ్యాంకు అనేక దేశాల్లో ప్రతిపాదించి అమలు చేస్తోంది. దేశంలో జాతీయ బ్యాంకులు, ఆర్థిక సంస్థలు చట్టబద్ధంగా అందచేయాల్సిన సంస్థాగత రుణాలకు బదులు ఈ స్వయం సహాయ సంఘాల ద్వారా అందించే రుణాలు ప్రత్యామ్నాయ మార్గంగా ముందుకు వస్తున్నాయి.

నయా ఉదారవాద విధానాలు అమలు చేసిన ఈ దశాబ్ద కాలంలో ఇటువంటి సంస్థాగత రుణాలు గణనీయంగా తగ్గి పోయాయి. గ్రామీణ ప్రాంతాలకు అందాల్సిన సంస్థాగత రుణ సదుపాయానికి స్వయం సహాయ సంఘాలు ప్రత్యామ్నాయం కాలేవు. అంతేకాదు. గృహ నిర్మాణం, పారిశుధ్యం వంటి అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయటంలో ప్రజాతంత్ర యుతంగా ఎన్నికైన స్థానిక సంస్థలను బైపాస్ చేసేందుకు ఈ స్వయం సహాయ సంఘాలను సాధనాలుగా చేసుకునే విధానాలను కూడా మనం ప్రతిఘటించాలి.

కుప్పలు తెప్పలుగా ఏర్పడుతున్న స్వయం సహాయ సంఘాల గురించి పార్టీ మరింత స్పష్టంగా విశ్లేషించాలి. ప్రజాతంత్ర సంస్థలను బైపాస్ చేసే సాధనాలుగా, సంస్థాగత రుణసదుపాయానికి ప్రత్యామ్నాయ సాధనాలుగా స్వయం సహాయ సంఘాలను ముందుకు తేవటాన్ని, బహుళజాతి కంపెనీల ఉత్పత్తులను మార్కెటింగ్ చేసే సాధనాలుగా వీటిని వినియోగించుకోవటాన్ని వ్యతిరేకించాలి. ఈ రంగంలో అనుభవాలను పార్టీ మరింత సమగ్రంగా అధ్యయనం చేయాలి. అందువల్ల పార్టీ మహాసభ స్వయం సహాయ సంఘాలకు సంబంధించిన విషయాల్లో రూపొందించిన మార్గదర్శక సూత్రాల ఆధారంగా ఒక వర్క్‌షాప్ నిర్వహించాలి. ఈ వర్క్‌షాప్‌లో ఈ రంగంలో పని చేస్తున్న అన్ని రాష్ట్రాల నుండి ప్రతినిధులు పాల్గొనేలా చూడాలి. సాధ్యమైనంత త్వరగా పార్టీ కేంద్ర కమిటీ ఈ వర్క్‌షాప్ నిర్వహించాలి.

ముగింపు

సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో భాగంగా మన దేశంలో నయా ఉదారవాద విధానాలు ప్రారంభించిన అనంతరం తలెత్తిన ఈ పరిణామాలన్నింటిని చర్చించి నిర్ణయించటం పార్టీ అనుసరించాల్సిన మార్గదర్శక సూత్రాలు రూపొందించింది. పైన చర్చించిన అంశాలు, రూపొందించిన మార్గదర్శక సూత్రాలు కేవలం పార్టీ అవగాహనను విశదీకరించేవి మాత్రమే కాదు. ఇందులో క్రోడీకరించిన పలు నిర్ధారణలు సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించటానికి అసవరమైన నినాదాలుగా పని చేస్తాయి. మన దృష్టిలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు ఏకైక ప్రత్యామ్నాయం సోషలిజం మాత్రమే. ఈ ప్రత్యామ్నాయం దిశగా ఉద్యమాన్ని బలోపేతం చేయటానికి ప్రతి దేశంలోనూ ఆయా దేశాల పరిస్థితిని బట్టి విశాల ప్రజా ఉద్యమాలు నిర్మించాలి. మన దేశం ఎదుర్కుంటున్న నిర్దిష్ట పరిస్థితుల్లో వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమాన్ని బలోపేతం చేయటానికి అవసరమైన ప్రజాపోరాటాలు నిర్మించటంలో పైన స్పష్టీకరించిన మార్గదర్శక సూత్రాలు కీలకమైన సాధనాలుగా ఉంటాయి. సోషలిస్టు ప్రత్యామ్నాయం సాధించటానికి ఈ పోరాటాలే కేంద్రకంగా ఉంటాయి. ఈ అవగాహనతోనే ప్రస్తుత పరిస్థితుల్లో మన పోరాటానికి పదును పెట్టటానికి ఉపకరించే పై అంశాలపై పార్టీ మహాసభ చర్చించి కొన్ని నిర్ధారణలకు వచ్చింది.

(అయిపోయింది)

లౌకికతత్వ పరిరక్షణ కోసమే లాలూతో అవగాహన

- బి.వి. రాఘవులు

ప్రశ్న: బీహార్ మార్క్సిస్టుపార్టీ ఇతర వామపక్షాలు వేరు వేరు కూటముల్లో ఉండటం జాతీయస్థాయిలో వామపక్షాల ఐక్యతకు గండి కొడుతుందా? ప్రజావ్యతిరేకత ఉన్న లాలు పార్టీతో సిపిఎం అవగాహనకు రావడం ఎంతవరకు సబబు?

జ: ప్రస్తుత పరిస్థితుల్లో బీహార్‌లో తృతీయ ఫ్రంట్‌కు అవకాశంలేదని మా పార్టీ అంచనా. బీహార్‌లో మతతత్వశక్తులను ఎదిరించగలిగే ఏకైక పెద్ద లౌకికపార్టీ ఆర్‌జెడి. బీహార్‌శాసనసభ ఎన్నికల్లో లౌకికశక్తులన్నింటినీ ఉమ్మడి పోరుకు సమీకరించే ప్రయత్నంలో సిపిఐ వైఖరి నష్టదాయకంగా ఉంది. ఆర్‌జెడిని పక్కపెట్టి లౌకికకూటమి ఏర్పాటుఅంటే అది మతతత్వశక్తులకు అవకాశం కల్పించడమే అవుతుంది. అందుకు ఆర్‌జెడి విషయంలో కాంగ్రెస్, సిపిఐ, రాం విలాస్‌పాశ్వన్ పార్టీలు పునరాలోచన చేయాలని సిపిఎం కోరింది. కాంగ్రెస్ గత లోపాన్ని సరిచేసుకుని లాలు ప్రసాద్ పార్టీతో సర్దుబాటుకు సిద్ధమైంది. సిపిఐ అలా పునరాలోచన చేసుకోకపోవడం దురదృష్టకరం. ఆర్‌జెడి పాలన అసమర్థత, అవినీతితో ఉన్నదనేది వాస్తవమే. ఈ రోజు బిజెపి కూటమి అవినీతి, అసమర్థతలో అతీతంగా ఉన్నదని అనుకోరాదు. ప్రస్తుత పరిస్థితిలో ఈ అంశాలను ముందుకుతీసుకొచ్చి లౌకికశక్తులలో ఆర్‌జెడిని కలుపుకొచ్చే ప్రయత్నం చేయకపోతే మతతత్వశక్తులకు మేలు చేకూర్చినట్లువుతుంది. మతతత్వశక్తులను అధికారంలోకి రానివ్వడమా, దూరంగా ఉంచటమా అనేదే ప్రధానం. ఈ కొలబద్ద లతో రాజకీయాలను పరిశీలించాకే ఆర్‌జెడితో లౌకికశక్తులన్నీ సహకరించుకోవా లని సిపిఎం పిలుపునిచ్చింది. తన శక్తిమేరకు ఈ ఐక్యతకు కృషిచేసింది.

విదేశీ పెట్టుబడులపై ఇటీవల బెంగాల్ ముఖ్యమంత్రి బుద్ధదేవ్‌భట్టాచార్య వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. పెట్టుబడులను ఆహ్వా నించే విషయంలో పార్టీలో భిన్నాభిప్రా యాలున్నాయా?

బుద్ధదేవ్‌భట్టాచార్య చేసిన వ్యాఖ్యానాలు వివాదాస్పదం కాలేదు. వాటిని వివాదాస్పదం చేశారు. విదేశీపెట్టుబడుల విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీ విధానాలకు లోబడే ఉన్నాయి. విదేశీపెట్టు బడుల విషయంలో పార్టీ విధానమేమిటంటే 'దేశప్రయోజనాలకు, ఉపాధికి, దేశీయ పరిశ్రమలకు నష్టంలేకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే పద్ధతిలో విదేశీపెట్టు బడులను అంగీకరించాలి' ఇది మా పార్టీ విధానం. వీటికి అనుగుణంగానే బుద్ధదేవ్‌భట్టా చార్య వ్యాఖ్యానాలు ఉన్నాయి. మా పార్టీ విధానాలు తెలియనివారు, సిపిఎం జాతీయ మహాసభలో చేసిన తీర్మానంలో (విదేశీపెట్టు బడులపై) ఏముందో తెలుసుకోని వారే ఇలాంటి అవాకులు, చెవాకులు పేల్చుతున్నారు. పైగా పార్టీలో విస్తృతంగా చర్చించి మహాసభలో వీటిపై విధానాలను రూపొందించాం. అలాంటప్పుడు పార్టీలో భిన్నాభిప్రాయాలకు ఎలా ఆస్కారం ఉంటుందో చెప్పండి. పార్టీ మహాసభలో చేసిన నిర్ణయాలకు లోబడే ప్రతిఒక్క నాయకుడు పనిచేయాలి. ఇందులో బుద్ధదేవ్‌భట్టాచార్యకు మినహాయింపు ఏమీ ఉండదు.

టిఆర్‌ఎస్ ఇటు ఆర్‌ఎస్‌ఎస్‌తోనూ, నక్సల్స్‌తోనూ మిలాఖత్ అవుతూ మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నది. ఇది యుపిఏకు మద్దతిస్తున్న వామపక్షాలకు ఇబ్బందికరం కాదా? టిఆర్‌ఎస్ సరికొత్త చర్యలపై పార్టీ వైఖరి ఏమిటి?

ప్రత్యేక రాష్ట్రం విషయంతోనే సిపిఎం విభేదిస్తోంది. అందుకే ఆ పార్టీతో పొత్తులు, అవగాహన ఉండదని మొదటినుండి చెబుతూవచ్చాం. ఇకపోతే టిఆర్ఎస్‌కు ఆర్ఎస్ఎస్‌తో, నక్సలైట్లతో సంబంధాలు అదనంగా వచ్చాయని అనుకున్నా సిపిఎం తన వైఖరిలో, ఆలోచనలో మార్చుకోవాల్సిందేమీ లేదు. బిజెపి కూటమిని అధికారానికి దూరంచేయడానికి, సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేందుకు టిఆర్ఎస్ సహకారాన్ని కాంగ్రెస్‌పార్టీ తీసుకుంది. దీంతో పార్టీకి సంబంధంలేదు. కాంగ్రెస్ విధానాలతో సిపిఎంకు మౌలికంగా కొన్ని విభేదాలున్నాయి. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వంలో చేరలేదు, పదవులు తీసుకోలేదు. టిఆర్ఎస్ వల్ల పార్టీకి ఇబ్బందికి ఆస్కారం ఎందుకు ఉంటుంది. టిఆర్ఎస్ వ్యవహారతీరు రాష్ట్రకాంగ్రెస్‌కు గుదిబండల తయారైంది. మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బే తగిలింది. ఈ పార్టీ అవకాశవాదం, పదవీ వ్యామోహం ప్రజల ముందు బట్టబయలైంది.

సెప్టెంబర్ 17ను తెలంగాణా విమోచన దినాన్ని అధికారికంగా జరపాలని బిజెపి, టిఆర్ఎస్ డిమాండ్ చేస్తున్నాయి?. దీనిపై సిపిఎం వైఖరి ఏమిటి? నిజాం పాలన అంతరించినా కూడా భారతసైన్యాన్ని వ్యతిరేకించిన పార్టీ విమోచన దినోత్సవాన్ని అంగీకరిస్తుందా?

నిజాం ఆధీనంలో ఉన్న హైదరాబాద్ సంస్థానం 1948 సెప్టంబర్ 17న భారతదేశంలో విలీనం అయింది. ఇందుకు కోసం భారత కమ్యూనిస్టుపార్టీ, కాంగ్రెస్ పార్టీ ఆనాడు ఉద్యమాలు నిర్వహించాయి. ముఖ్యంగా ఆంధ్రమహాసభ కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంలో నిజాంపాలనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున సాయుధ రైతాంగ పోరాటం జరిగింది. ఈ ఉద్యమాల మూలంగా నిజాం పాలన పూర్తిగా పతనం అయ్యే స్థితికి వచ్చింది. నిజాం వ్యతిరేకపాలనను పతనంచేసిన ప్రతిష్ట కమ్యూనిస్టులకు దక్కకూడదనే ఆనాడు కేంద్రం సైన్యాన్ని ఆఘమేఘాలపై పంపి నిజాం లొంగుబాటును పూర్తిచేసింది. హైదరాబాద్ సంస్థాన విలీనం భారతసైన్యం వల్లే సాధ్యమైందనే భావనను కల్గించే ప్రయత్నం చేశారు. ఈ విలీనంలో కమ్యూనిస్టుపార్టీ పాత్రను ఏవరు విస్మరించినా అది చెరిగిపోనిది. సెప్టంబర్ 17న హైదరాబాద్ సంస్థాన విమోచన దినోత్సవాన్ని జరపాలని ప్రభుత్వాన్ని ఆనాడే కోరాం. ప్రభుత్వం జరపకపోయినా ఆరోజును కమ్యూనిస్టుపార్టీలు సంస్మరించుకుం టున్నాయి. ఇంకోటి ఇక్కడ స్పష్టంచేయాలి. హైదరాబాద్ సంస్థానానికి విమోచనం కలిగిన తరువాత కూడా కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన రైతాంగ సాయుధ పోరాటం మరికొంత కాలం జరిగింది. భారతసైన్యం వచ్చాక అప్పటికే పట్టణాలకు పారిపోయిన దొరలు, జమీందార్లు తిరిగి ఈ సైన్యం సహకారంతో గ్రామాల్లోకి

ప్రవేశించారు. వీరువచ్చిరాగానే రైతాంగంపై కక్షసాధింపుచర్యలకు పూనుకున్నారు. అన్యాయాలు, అకృత్యాలు, దుర్మార్గాలు చేయడం ప్రారంభించారు. అప్పటికే భూ సంస్కరణల ద్వారా రైతాంగం సాగుచేసుకుంటున్న లక్షల ఎకరాల భూములను తిరిగి లాక్కునేందుకు ఈ దొరలు, జమీందార్లు ప్రయత్నించారు. వెట్టిచాకిరిని పునరుద్దరించాలని ప్రయత్నించారు. ఈ నేపథ్యంలోనే సాదించు కున్న భూమిని, హక్కులను కాపాడుకోవడం కోసం రైతాంగ సాయుధపోరాటం కొనసాగింది. ఈ ప్రతిఘటన ద్వారా సాదించుకున్న హక్కులను రైతాంగం కాపాడుకోగలిగింది. అనంతరం భారత ప్రభుత్వం ఒప్పందంతో సాయుధ పోరాటం విరమించబడింది. పోరాట ఫలితాలు రక్షించడంతోపాటు, పాలకవర్గాల నుండి దేశాన్ని విముక్తిచేసే పోరాటం చేయాలనే అఖిల భారత విధానం కూడా ఆనాడు కమ్యూనిస్టుపార్టీ అనుసరించింది. ఆ విధానం మార్చుకున్న తరువాత రైతాంగరక్షణ కొంత స్థిరపడిన తరువాత సాయుధపోరాటాన్ని విరమించాం.

ఈ మున్సిపల్ ఎన్నికల్లో కొన్నిచోట్ల టిడిపితో సిపిఎం అవగాహనకు వచ్చినట్లు వినవస్తోంది? కాంగ్రెస్‌తో సర్దుబాట్లు చేసుకుని ఇలా చేయడం అవకాశవాదం కిందకు రాదా?

ఈ మున్సిపల్ ఎన్నికల్లో మాపార్టీ సిపిఐ, కాంగ్రెస్‌లతో సర్దుబాట్లు చేసుకుంది. ఓట్లు చీలకుండా ఈ ఎన్నికల్లో పాల్గొనాలని నిర్ణయించాం. శాసనసభ ఎన్నికల్లో అనుసరించిన విధానానికి కొనసాగింపే ఈ సర్దుబాట్లు. కాంగ్రెస్‌తో సర్దుబాటు సంపూర్ణంగా జరగలేదు. 144 స్థానాల్లో సర్దుబాటు జరిగింది. 147 స్థానాల్లో సర్దుబాటు జరగలేదు. కర్నూలు, నల్గొండలో పార్టీ టిడిపితో సర్దుబాట్లు చేసుకునట్లు మీడియాలో పెద్ద ఎత్తునప్రచారం జరిగింది. ఇది పూర్తిగా అభూతకల్పన. కాంగ్రెస్‌పై తాము పోటీచేసిన చోట టిడిపి ఉద్దేశపూర్వకంగానే ఈ ప్రచారంచేసింది. మీడియాలో ఒక భాగం దీనికి విశ్వసనీయత కలిగించింది. ఇక్కడ ఒకటి గమనించండి. కర్నూలులో టిడిపి తనకు బలంలేని ఐదుచోట్ల అభ్యర్థులను ఉపసంహరించుకుంది. నల్గొండలో 10వ వార్డులో టిడిపి అభ్యర్థి నామినేషన్ చెల్లలేదు. దీంతో ఆ వార్డులో సిపిఎంకు మద్దతు ఇస్తామని ఆపార్టీ ప్రకటించింది. పార్టీ పోటీచేసినచోట్ల స్వచ్ఛందంగా ఎవరు ఓటువేసేందుకు ముందుకువచ్చినా మాకు అభ్యంతరంలేదు. అదే విషయాన్ని మా పార్టీ నాయకులు చెప్పారు. దీనినే ఒప్పందంగా చిత్రీకరించి అవాకులు, చెవాకులు పేల్చి రాష్ట్రవ్యాప్త ప్రచారంచేయడం జరిగింది.

కొత్తగా ఏర్పడనున్న మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో సిపిఎం పాత్ర ఎలా ఉండబోతోంది?

ప్రజాసమస్యల ప్రస్తావన విషయంలో సమర్థవంతమైన పాత్రను సిపిఎం నిర్వహిస్తాది. సిపిఎం తరపున ఎన్నికైన ప్రతినిధులు ఇందుకు కృషిచేస్తారు. మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు చాలా అధికారాలు రాష్ట్రప్రభుత్వం బదలాయించాల్సి ఉంది. దీనికోసం మా పార్టీ ప్రతినిధులు కౌన్సిల్‌ను వేదికగా చేసుకుని ఆందోళనచేస్తారు. స్థానిక పరిపాలనలో పెరుగుతున్న అవినీతిపై కూడా మా ప్రతినిధులు పోరాటం చేస్తారు. పదవులను ప్రజాసేవకు, ప్రజా ఉద్యమాలకు సాధనాలుగా ఉపయోగించుకుంటాం.

సిపిఐ(ఎం) నివేదిక

(22వ పేజీ తరువాయి)

ఉపసంహరణ కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని తీవ్రంగా ఉల్లంఘించడమేనని జూన్‌లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో భావించాం. మన అభిప్రాయాన్ని కాంగ్రెస్ నాయకత్వానికి తెలపాలనుకున్నాం. కేంద్ర కమిటీ సమావేశ అనంతరం సమన్వయ కమిటి సమావేశం జూన్ 19న జరిగింది. సిఎంపికి అనుగుణంగానే బిహెచ్ఇఎల్‌లో పెట్టుబడులను ఉపసంహరిస్తున్నామని ఆ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని పునరుద్ఘాటించింది. ఈ నేపథ్యంలో సమావేశమైన వామపక్షాలు ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ దిశగా పయనిస్తున్నందుకు నిరసనగా సమన్వయ కమిటీ సమావేశాలను బహిష్కరించాలని నిర్ణయించాయి. ఆ తరువాత యుపిఎ నాయకత్వం ఉపసంహరించే షేర్ల సంఖ్యను ఐదేశాతానికి తగ్గిస్తామని, భవిష్యత్‌లో నవరత్నాల్లో ఉపసంహరణ చేపట్టబోమని ప్రతిపాదించింది. ఉపసంహరణ ఎంత అనేది సమస్యకాదని నవరత్న కంపెనీల షేర్లను అమ్మడమే అసలు సమస్యని పేర్కొంటూ యుపిఎ నాయకత్వ ప్రతిపాదనను వామపక్షాలు తిరస్కరించాయి.

ఇటీవలకాలంలో బిహెచ్ఇఎల్‌లో పెట్టుబడుల ఉపసంహరణ ఆలోచనను యుపిఎ ప్రభుత్వం మానుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని అధికారికంగా తెలిపితే సమన్వయ కమిటీ సమావేశంలో తిరిగి పాల్గొంటాం. అప్పటివరకు ప్రభుత్వంతో సాగించే సమాలోచనలన్నీ పార్లమెంట్‌లోపల సభాస్థాయి సమన్వయంలోనే జరుగుతాయి. అవసరమైనప్పుడల్లా అంశాలవారీగా కూడా ప్రభుత్వం, యుపిఎ నాయకత్వంతో సమావేశమవుతున్నాం.

సెప్టెంబర్ 29న సమ్మె
ఇతర ఆందోళనా కార్యక్రమాలు

16 డిమాండ్ల సాధనకోసం కేంద్ర కార్మిక సంఘాల సదస్సు సెప్టెంబర్ 29న అఖిలభారత సమ్మెకు పిలుపునిచ్చింది.++++ ప్రయివేటీకరణ, పెట్టుబడుల ఉపసంహరణ మానుకోవడం, పిఎఫ్ వడ్డీరేటు పెంపు, అసంఘటిత కార్మికుల చట్టం, సమ్మె హక్కు అనేవి ముఖ్యమైన డిమాండ్లు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రాస్తారోకోలు, రైల్‌రోకోలు, పికెటింగ్‌లు నిర్వహించాలని కిసాన్ సభ పిలుపునిచ్చింది. సెప్టెంబర్ 29 సమ్మెకు కేంద్ర కమిటీ మద్దతు తెలిపింది. భూమి, రేషన్‌కార్డులు, ఉపాధికోసం సెప్టెంబర్ మాసంలో ఉద్యమాలు నిర్వహించాలని, స్థానిక సమస్యల పరిష్కారానికి స్థానికంగా పోరాటాలు నిర్వహించాలని పార్టీ పిలుపునిచ్చింది. పెట్రోల్ ధరలు పెంచగానే ఆందోళనలు నిర్వహించాలని రాష్ట్ర శాఖలకు పిలుపునిచ్చింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదింపజేసేందుకు ప్రచారాన్ని నిర్వహించాలని కేంద్రకమిటీ తీర్మానించింది. ప్రచార తేదీని తగిన సమయంలో పొలిట్‌బ్యూరో నిర్ణయిస్తుంది.

+తాను డిసెంబర్‌లో అధ్యక్ష పదవినుండి దిగిపోతానని అద్వానీ చెన్నయ్ సమావేశంలో ప్రకటించారు.

++ఖురానాపై సస్పెన్షన్‌ను తరువాత ఎత్తి వేశారు.

+++పెట్రోల్ ధర మూడు రూపాయలు, డీజిల్ ధర రెండు రూపాలయలు చొప్పున ప్రభుత్వం మళ్లీ పెంచింది. అయితే కిరసనాయిలు, వంట గ్యాస్ ధరలు పెంచలేదు.

++++సెప్టెంబర్ 29న పారిశ్రామిక సమ్మె జయప్రదంగా జరిగింది.

(అనువాదం: జి. శ్రీనివాస్)

మహా శాస్త్రవేత్త

(2వ పేజీ నుండి)

రికా ప్రభుత్వం నమ్మే పరిస్థితిలేదు, ఐన్‌స్టీన్‌కు కూడా అణుబాంబుపై ఆసక్తి లేదు కనుక మాన్‌హట్టన్ ప్రాజెక్టుకు దూరంగా ఉన్నాడు. 1945 ఆగస్టు 6,9 తేదీల్లో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అమెరికా అణుబాంబులు వేసి సృష్టించిన విధ్వంసకాండను ఆయన ఖండించాడు. యుద్ధానంతరం అమెరికాకూ, సోవియట్‌కూ మధ్య అణ్వాయుధ పోటీ నివారించేందుకు ఏర్పడిన శాస్త్ర వేత్తల కమిటీకి ఐన్‌స్టీన్ అధ్యక్షుడిగా ఉండటానికి అంగీకరించాడు. **ట్రూమన్ విదేశాంగ విధానం సోవియట్ వ్యతిరేకతతో కూడిన దురాక్రమణ వాదమని ఒక సందర్భంగా ఐన్‌స్టీన్ పేర్కొన్నాడు.**

1940వ దశకంలో ఐన్‌స్టీన్ అమెరికాలో నెలకొన్న జాతి వివక్ష, లించింగ్ (నల్లజాతివారిని అంటరాని వారుగా వేరే కూర్చో పెట్టడం, చంపివేయడం) అనే జాడ్యాలపై కేంద్రీకరించాడు. అమెరికా సైన్యంలో కూడా జాతివివక్ష రాజ్యమేలింది. న్యూజెర్సీలోని ప్రిన్‌స్టన్ పట్టణంలో ఐన్‌స్టీన్ పనిచేసే విశ్వవిద్యాలయం, నివాసం ఉన్నాయి. విశ్వ విఖ్యాత గాయకుడు పాల్ రాబ్సన్ పుట్టింది అక్కడే. విద్యాలయాల్లో, నివాసగృహాల్లో ప్రవేశానికి నల్లవారికి ఎన్నో అడ్డంకులు. నిరసనలు వ్యక్తం చేస్తే పోలీసుల దాష్టీకం ఎదుర్కోవాల్సిందే. 1946లో నల్లజాతివారిపై దాడులకు వ్యతిరేకంగా పాల్ రాబ్సన్, వెబ్‌డు బోయిస్ తదితరుల ఆధ్వర్యంలో పెద్ద ప్రదర్శన జరిగింది. అనారోగ్యం వల్ల ఐన్‌స్టీన్ దానిలో పాల్గొనలేకపోయినా **అధ్యక్షుడు ట్రూమన్‌కు ఒక ఉత్తరం రాశాడు. అందులో దాడులకు పాల్ప డుతున్న దుండగుల్ని ప్రాసిక్యూట్ చేయాలని కోరాడు.** సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటానికి అండగా తనకున్న ప్రతిష్టను ఉపయోగించడానికి ఆయన ఎన్నడూ వెనుకాడలేదు. **పూర్తిగా నల్లజాతి వారిదైన పెనిసిల్వేనియాలోని లింకన్‌యూనివర్సిటీ ఇచ్చిన గౌరవ డిగ్రీని స్వీకరంచడానికి 1946 మేలో ఐన్‌స్టీన్ వెళ్లాడు. అక్కడ** ఆ రోజంతా విద్యార్థులకు ఉపన్యాసాలు ఇస్తూ, అధ్యాపకుల కుటుంబాలతో ఆడుతూ, పాడుతూనూ గడిపాడు. ఆ విధ్యార్థుల్లో ఒకడైన జూలియన్ బాండ్ తరవాత కాలంలో పౌర హక్కుల ఉద్యమం నాయకుడైనాడు. ఆరోజు ఐన్ స్టీన్ చేసిన ప్రసంగం చారిత్రాత్మకమైనది. **“అమెరికావారి సామాజిక దృక్పథం, సమానతా భావం, మానవులకిచ్చే గౌరవం అన్నీ తెల్ల చర్మం ఉన్న వారికే పరిమితం.** అమెరికా పౌరుడినన్న విషయం గుర్తుకొచ్చినప్పుడు ఇది నన్నెంతో బాధపెడుతుంది. దీన్ని నిర్మొహమాటంగా, బహిరం గంగా చెప్పడం ద్వారా నా 'నేరాన్ని' కడిగేసుకోవా లనుకుంటున్నాను”అని తన ప్రసంగంలో చెప్పాడు.


1948లో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో వామపక్షవాదులు, రాడికల్స్, సోషలిస్టులు, కమ్యూనిస్టులు కలిసి ప్రోగ్రెసివ్ పార్టీని స్థాపించారు. ఆ పార్టీ తరపున మాజీ వైస్ ప్రెసిడెంట్ హెన్రీ ఎ వాలెస్‌ను పోటీకి నిలబెట్టారు. ఐన్‌స్టీన్ ఆ పార్టీకి పూర్తి మద్దతిచ్చాడు. **అణ్వాయుధాలను నిషేధించాలని, వాటిని అంతర్జాతీయ అజమాయిషి కింద ఉంచాలని ఐన్‌స్టీన్ మద్దతుతో హెన్రి వాలెస్ ప్రచారం చేశాడు.** ఆ రోజుల్లోనే లియో హ్యూబర్‌మన్, పాల్ స్వీజీలు మార్క్సిష్టు సిద్ధాంతానికి ఆయుధంగా మంత్లీ రివ్యూ పత్రిక స్థాపించారు. వారి రచన 'సోషలిజం ఓనమాలు' మొదటి తరం కమ్యూనిస్టులకు పెద్ద బాలశిక్షగా ఉపయోగపడింది. 1949లో మొదటి సంచికకు **ఐన్‌స్టీన్ 'సోషలిజం ఎందుకు' అనే సిద్ధాంతవ్యాసం రాశాడు.** ఆ వ్యాసంలో సోషలిజం రాజకీయంగా న్యాయబద్ధంగా ఎలా ఉంటుందో వివరించారు. ఆ వ్యాసం సోషలిస్టు సిద్ధాంత వ్యాప్తికి, పత్రిక సర్క్యులేషన్ పెరగడానికి బాగా తోడ్పడింది.

1950లో అమెరికాలో నెలకొన్న కమ్యూనిస్టు వ్యతిరేకత 'ఎర్రభూతం' అనే భయానక వాతావరణం ఐన్‌స్టీన్‌ను కలిచివేసింది. కొన్నేళ్ల క్రితం జర్మనీలో జరిగిన ఘోరకలి పునరావృతం అవుతుందని ఐన్‌స్టీన్ భావించాడు. రాడికల్ అభిప్రాయాలున్న వ్యక్తులను కమిటీల ముందుకు పిలిచి తమ సహచరుల పేర్లు వెల్లడించాలని బెదిరించేవారు. ఇలా అయితే అమెరికా మేధావి వర్గానికి మిగిలేది బానిసత్వమే అని ఐన్‌స్టీన్ ప్రచారం చేశాడు. ఆయన రాసిన ఒక బహిరంగ లేఖలోని ఈ భాగాలకు జాతీయ పత్రికలు పతాక శీర్షికలు ఇచ్చాయి. అదిమంచి ప్రభావాన్ని చూపింది. కమిటీలముందు హాజరవడానికి మేధావులు వ్యతిరేకించడం ప్రారంభించారు. ఆల్ షాడోవిడ్స్ అనే రాడికల్ వ్యక్తి 'నేను విచారణకు హాజరు కాను డాక్టర్ ఐన్‌స్టీన్ గారి సలహాలు తీసుకుంటున్నాను' అని సెనేటర్ మెకార్థీతో చెప్పాడు. దీనిపై మెకార్థీ మండి పడ్డాడు. ఈ అంశం సుప్రీంకోర్టుకు వెళ్లింది. 1957లో కోర్టు ఈ విచారణ పద్ధతికి బ్రేక్ వేసింది. 1960 నుండి న్యూలెఫ్ట్‌కు చెందిన విద్యార్థి బృందాలు మెకార్థి సమావేశాలను వ్యతిరేకించడం మొదలెట్టాయి. ఆ తర్వాత పది సంవత్సరాలకు మార్టిన్ లూథర్‌కింగ్ (జూ) తన ప్రపంచ ప్రఖ్యాతమైన పౌరహక్కుల ఉద్యమాన్ని ప్రారంభించాడు.

1953లో2 పేరు పొందిన అమెరికా శాస్త్రవేత్తలు జూలియస్, ఈథెల్ రోజెన్ బెర్గ్‌లు సోవియట్‌కు రహస్య పత్రాలు అందజేసినట్లు కేసు నడిచింది. ఈ కేసులో ఐన్‌స్టీన్ జోక్యం చేసుకుని కేసు విచారణ చేస్తున్న జడ్జి ఇర్వింగ్ కాఫ్‌మెన్‌కు నేరుగా ఉత్తరం రాశాడు. నిందితుల నేరం నిస్సందేహంగా రుజువు కాలేదని, వారికి వ్యతిరేకంగా ఉంచిన సాక్ష్యం ఏ ముఖ్యమైన రహస్యాన్నీ వెల్లడించలేదని పేర్కొన్నాడు. దీనికి సమాధానం రాకపోవడంతో అధ్యక్షులు ట్రూమన్‌కు, మిడియాకు తన అభిప్రాయాలు తెలియచేశాడు. ప్రభుత్వం క్షమాబిక్ష పెట్టాలన్నాడు. ఐతే ఫలితం లేకపోయింది. జూన్ 19న ఎలక్ట్రిక్ చైర్‌తో రోజెన్ బర్గ్ దంపతుల ప్రాణాలు తీసేశారు. ఐన్‌స్టీన్ మిత్రుడైన డి బోయస్ సోవియట్ ఏజెంట్ అని 1951లో కేసు పెట్టారు. ఆయన మీద కేసు ఎత్తివేయించడానికి ఐన్‌స్టీన్ తీవ్రంగా కృషిచేశాడు. ఐన్‌స్టీన్ తన జీవితపు చివరి భాగమంతా దేశంలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రతిఘటించడంతోనే గడిపాడు. తనకున్న ప్రతిష్ఠనంతా అన్యాయంగా ఉపాధి కోల్పోయిన రాడికల్స్‌కు ఎదో ఒక ఉద్యోగం ఇప్పించేందుకు వినియోగించాడు. అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ కమ్యూనిస్టులను పట్టించుకోలేదు. రోజెన్ బర్గ్ దంపతుల రక్షణకు ఏ మాత్రం సహకరించలేదు. దానికి ప్రత్యామ్నాయంగా మరోక సంస్థ అవసరమని, 1954లో ఆయన 75వ జన్మదినాన్ని అందుకు వినియోగించుకున్నాడు. **'అత్యవసర సివిల్ లిబర్టిస్ కమిటీ' ఏర్పాటు చేశారు.** అనాటి సభలో లబ్దప్రతిష్టులైన రాజకీయ నాయ కులు, శాస్త్రవేత్తలు ప్రసంగించారు. ఐనస్టీన్ అనేక మంది వామపక్ష భావాలు గల శాస్త్రవేత్తలతో కలిసి పనిచేశాడు. అందులో ఫిజిక్స్ శాస్త్రవేత్త, మార్క్సిస్టు లియోపాల్డ్ ఇన్‌ఫీల్డ్ వంటి వారంతా అనాటి ఛాందస భావాలకు, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా కృషి చేశారు. ఐన్‌స్టీన్ 1955లో ఏప్రిల్ 18న మరణించాడు. అంతకు కొద్ది రోజుల క్రితమే ఆయన బెట్రాండ్ రస్సెల్‌తో కలిసి జరిపిన కృషి 1957లో పుగ్వాష్ కాన్ఫరెన్స్‌కు దారి తీసింది. అణ్వాయుధ నిషేధం, ప్రపంచ శాంతి కోసం ఏర్పాటైన ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్తల సమావేశమే పుగ్వాష్ కాన్ఫరెన్స్. భారత శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాధన్ ఇటీవల సంస్థకు అధ్యక్షుడిగా ఎన్నుకోబడ్డారు. ఐన్‌స్టీన్ గొప్ప శాస్త్రవేత్త మాత్రమే కాదు. అంతకన్నా ఎక్కువగా మానవతావాది. సమానత్వం, సామాజిక న్యాయం, సోషలిజాన్ని మనస్పూర్తిగా నమ్మినవాడు. ఆచరణలో పెట్టినవాడు. **(మూలం:మంత్లీ రివ్యూ)**

వాస్తవికతలో నివసిస్తూ వాస్తవికతను మార్చాలి!

- పాలో ఫ్రెయిరె



"పిడివాదం మౌఢ్యం చేత పోషించబడుతుంది. అది ఎల్లప్పుడూ నిష్ఫలమైనది. విప్లవచైతన్యం విమర్శనా స్ఫూర్తివల్ల పెంపొందుతుంది. అది ఎల్లవేళలా సృజనాత్మకంగా ఉంటుంది. పిడివాదం మార్మికం గావిస్తుంది. అందువల్ల అది పరాయీకరణకు గురిచేస్తుంది. విప్లవచైతన్యం విమర్శ గావిస్తుంది. అందువల్ల అది విముక్తి ప్రసాదిస్తుంది. విప్లవచైతన్యం ఒక వ్యక్తిని తను ఎంచుకున్న వైఖరికి మరింతగా నిబద్ధం చేస్తుంది. ఆ విధంగా నిర్దిష్టమైన, వస్తుగతమైన వాస్తవికతను మార్చడానికి అతను మరింతగా కృషిచేసేట్లు పురిగొల్పుతుంది. దీనికి భిన్నంగా పిడివాదం, మార్మికతతోకూడి, అహేతుకంగా ఉంటుంది కనుక అది వాస్తవికతను బూటకపు "వాస్తవికతగా" మార్చేస్తుంది. (ఆ విధంగా దాన్ని మార్చడానికి వీలులేనిదిగా చేసేస్తుంది.)

"పిడివాదం ఏ రూపంలో ఉన్నా మానవాళి విముక్తికి ప్రతిబంధకమైనది. మితవాద పిడివాదం విప్లవకారుని చైతన్యాన్ని నీరుగారుస్తుంది. ఒక్కోసారి జరిగేదేమంటే, విప్లవకారులు మితవాద పిడివాదంతో పోరాడే క్రమంలో తాము కూడా పిడివాదంలో పడిపోతుంటారు. అయితే, ఇలా జరిగే ప్రమాదం ఉంది కనుక విప్లచైతన్యంగల వ్యక్తి, ఉన్నత వర్గాలతో పోరాడకుండా వారి చేతిలో పావుగా మారకూడదు. విముక్తి పోరాటంలో ఉన్న వ్యక్తి పీడకుల హింసాకాండను చూస్తూ ఊరుకో కూడదు.

"మరోవైపు విప్లవచైతన్యకారుడు ఎన్నడూ స్వీయమానసిక వాది కాదు. ఇటువంటి వ్యక్తికి స్వీయమానసిక విషయం వాస్తవిక విషయంతో ముడిపడి మాత్రమే ఉంటుంది. (విశ్లేషణ నుండి నిర్దిష్ట వాస్తవికత జనిస్తుంది). ఆ విధంగా స్వీయమానసికత, వాస్తవికత రెండూ గతితర్క ఐక్యతపొంది కార్యాచరణతో కలిసి విజ్ఞానాన్ని ఉత్పత్తి చేస్తాయి. విజ్ఞానం కార్యాచరణకు కారణమవుతుంది.

"కాని, పిడివాది-ఎటువంటి పిడివాది అయినా సరే-అహేతుకతచేత గుడ్డివానిగా మారి వాస్తవికత యొక్క పరిణామశీలతను గమనించడు, గమనించలేడు. లేదా దానికి తప్పుడు భాష్యo చెబుతాడు....

"మితవాద పిడివాదికీ, వామపక్ష పిడివాదికీ తేడా ఏమిటి? మితవాద పిడివాది వర్తమానాన్ని తన ఆలోచనకనుగుణంగా ఉంచడానికి ప్రయత్నిస్తాడు. ఆ విధంగా భవిష్యత్తు కూడా ఇదే విధమైన 'ఊహాజనితమైన వర్తమానాన్ని' పునరుత్పత్తి చేస్తుందని అనుకుంటాడు. వామపక్ష పిడివాది, భవిష్యత్తు ముందుగానే నిర్ణయమైపోయిందనుకుంటాడు. దాన్ని ఒక విధమైన అనివార్యంగా వచ్చే విధిగానూ, అదృష్టంగానూ పరిగణస్తాడు. మితవాద పిడివాదికి 'నేడు' గతంతో ముడిపడి ఉంటుంది. అది ఎవరో ఇచ్చేసినట్లు, మార్పులేనిదిగానూ ఉంటుంది. వామపక్ష పిడివాదికి 'రేపు' ముందుగానే సిద్ధమైపోతుంది. అది ఏమాత్రం అటూఇటూ లేకుండా నిర్ణయమైపోయి ఉంటుంది. ఈ మితవాద, వామపక్ష పిడివాదులిద్దరూ అభివృద్ధి నిరోధకులే. ఎందుకంటే చరిత్రను బూటకపు ధోరణినుండి చూసే వారు దానికి తగ్గ కార్యాచరణకు పూనుకుంటారు. ఇది స్వేచ్ఛను వమ్ముచేసేదిగా ఉంటుంది. మొదటి వ్యక్తి 'చక్కగా ప్రవర్తించే' వార్తమానాన్ని, రెండో వ్యక్తి ముందుగానే నిర్ణయమైపోయిన భవిష్యత్తును గురించి ఆలోచిస్తున్నారంటే అర్థం, వారు ఆలోచనలతోనే ఆగుతారని, కార్యాచరణ లేకుండా చేతులు ముడుచుకు కూర్చుంటారని కాదు. మొదటి వ్యక్తి వర్తమానమే కొనసాగుతుందనుకుంటూ, రెండో వ్యక్తి అప్పటికే తెలిసిన భవిష్యత్తు వచ్చేసిందన్న ఆలోచనలతో ఆగిపోరు. దానికి బదులుగా వారు "సంభవాల చక్రాల్లో" ఇరుక్కుంటారు. వాటినుండి తప్పుకోలేరు. వాటిలోనే ఉండి వారు తమ స్వంత సత్యాలను 'తయారు'చేసుకుంటారు. వీళ్ల సత్యం, భవిష్యత్తును నిర్మించుకునేందుకు పోరాడే ప్రజల సత్యం కాదు, భవిష్యత్తును నిర్మించుకునే క్రమంలో ప్రమాదాలు ఎదుర్కొనే సత్యం కాదు. లేదా భవిష్యత్తును నిర్మించుకునే క్రమంలో భుజం భుజం కలిపి పోరాడే ప్రజలు కలిసి నేర్చుకునే సత్యామూ కాదు. ప్రజలకు ఎవరో ఇచ్చిన భవిష్యత్తు కాకుండా ప్రజలు తమంత తాము రూపొందించుకునే భవిష్యత్తుకోసం పోరాడే క్రమంలో ఉద్భవించిన సత్యం కాదు. రెండు రకాల పిడివాదులూ, చరిత్రను తమ స్వంత ఆస్తి అన్న కోణం నుండి చూసే క్రమంలో ప్రజలను విస్మరిస్తారు. ఇంకో మాటలో చెప్పాలంటే ప్రజలకు వ్యతిరేకంగా మారిపోతారు.

"'తన' సత్యంలో తను ఉండి తలుపులు మూసుకున్న మితవాద పిడివాది ఏ విధమైన పాత్ర నిర్వహిస్తాడో, పిడి వాదిగా మారిన, పట్టువిడుపులు లేకుండా పోయిన వామపక్ష వాది కూడా తన లక్షణానికి భిన్నంగా అదే రకమైన పాత్ర నిర్వహిస్తాడు. ఇద్దరూ కూడా 'తమ' సత్యం చుట్టూ తిరుగుతూ ఆ సత్యాన్ని ఎవరైనా ప్రశ్నిస్తే తమకు ప్రమాదం వచ్చినట్లు భావిస్తారు. అంటే 'తన' సత్యం కానిదాన్నంతటినీ అబద్ధంగా పరిగణిస్తారు. పాత్రికేయుడు మార్సియో మోరీరా చెప్పినట్లు "ఇద్దరూ కూడా సందేహ రాహిత్యం అనే జబ్బుకు గురియవుతారు".

"మానవ విముక్తికి కట్టుబడిన విప్లవచైతన్యకారుడు "సంభవాల చక్రం"లో బంధీగా మారడు. వాస్తవికతను కూడా అందులో బంధించడు. దానికి మారుగా ఒక వ్యక్తి ఎంత విప్లవ చైతన్యం పొందితే అతను, లేదా ఆమె అంత ఎక్కువగా వాస్తవికతలోకి ప్రవేశిస్తారు. అందువల్ల వాస్తవికతను మరింత ఎక్కువగా తెలుసుకోవడం వల్ల అతను లేదా ఆమె ఆ వాస్తవికతను మరింత బాగా మార్చగలరు. ఈ వ్యక్తి ప్రపంచాన్ని యథాతథంగా చూడ్డానికి, వినడానికి, దాంతో పోట్లాడ్డానికి భయపడడు. ఈ వ్యక్తి ప్రజలను కలవడానికి, వారితో చర్చించడానికి భయపడడు. ఈ వ్యక్తి చరిత్రకు, లేదా ప్రజలందరికీ తానే యజమానిని అనుకోడు. వారికి విముక్తి ప్రసాదించేవాడినని అనుకోడు. దానికి మారుగా ఆ వ్యక్తి తనూ చరిత్రలో అంతర్భాగంగా ఉంటూ ప్రజల పక్షాన పోరాడుతున్నాననుకుంటాడు."

(పాలో ఫ్రెయిరె, 'పెడగాజీ ఆఫ్ ది అప్రెస్డ్' గ్రంథం నుండి)

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KRSA102M107
పుస్తకం పేరు	మార్క్సిస్టు
తారీఖు	23 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	37
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Saranya
పేజీలు విడదీసినది	SARANYA
స్కాన్ చేసినది	Apsar
పరీక్ష చేసినది	HEMA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good